ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 29, అక్టోబరు 2025



ఎం.గంగవరం వద్ద రైతు వారధి అప్రోచ్‌రోడ్డుకు గండి పడి ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

మొంథా విరుచుకుపడుతోంది. ఒకవైపు చలిగాలులు, మరోవైపు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానతో జిల్లాలోని తూర్పు, దక్షిణ ప్రాంత ప్రజలు వణికిపోతున్నారు. తీరప్రాంత గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. తుఫాన్ తీవ్రతతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఎగిసిపడుతున్నాయి. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. జిల్లా అంతటా చెరువులు, ఇతర జలవనరులు నిండిపోయాయి. పలుచోట్ల వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో అనేక ప్రాంతాల్లో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. తుఫాన్ పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి అవసరమైన సహాయక చర్యలు చేపడుతోంది. మంత్రి స్వామి, ఇతర పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లాకు పర్యవేక్షణాధికారులుగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

ముంచెత్తింది!



వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న ఒంగోలులోని కర్నూలు రోడ్డు

మొంథా ముప్పేట పంజా

- జిల్లా అంతటా గాలివాన
- తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో భారీ వర్షం
- తీర ప్రాంతంలో 'అల'జడి
- ఇళ్లకు పరిమితమైన ప్రజలు
- అన్ని ప్రాంతాల్లోనూ పొంగిన వాగులు
- చాలాచోట్ల నిలిచిన రాకపోకలు
- పలు గ్రామాలు, కాలనీలు జలమయం
- నీట మునిగిన పంటలు, భారీ నష్టం
- అప్రమత్తంగా అధికార యంత్రాంగం
- అవసరమైన చోట్ల సహాయక చర్యలు
- 65 పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు
- సింగరాయకొండలో పర్యటించిన మంత్రి స్వామి
- అధికారులతో జోనల్ అధికారి సమీక్ష



సంతనూతలపాడు వద్ద రోడ్డుపై భారీగా నీరు చేరడంతో వాహనదారులను రోడ్డు దాటిస్తున్న ఎస్సై అజయ్‌బాబు



గుండ్లకమ్మ నాలుగు గేట్లు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు

వాగు కాదు.. రోడ్డు!



ఇది జరుగుమల్లి మండలం కామేపల్లి నుంచి కొండపి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు. మొంథా తుఫాన్ ప్రభావంతో మంగళవారం కురిసిన భారీ వర్షానికి గ్రామంలోని చెరువు, రోడ్డు పక్కన ఉన్న కుంట నిండాయి. దీంతో వర్షపు నీరు ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి చేరి ఇలా వాగును తలపిస్తోంది.

ఒంగోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ జిల్లాను ముంచెత్తుతోంది. దాని ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అందులో మంగళవారం పగటిపూట తెరపి లేకుండా వాన కురిసింది. తూర్పు, దక్షిణ ప్రాంతంలో భారీ వర్షమే పడింది. జిల్లాపై తుఫాన్ ప్రభావం సోమవారం నుంచి మూడు రోజులపాటు ఉంటుందని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. దీంతో యంత్రాంగం అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టింది. అయితే తొలిరోజున జిల్లాలో పెద్దగా ఆ ప్రభావం కనిపించ లేదు. సోమవారం సాయంత్రం ఐదు గంటల తర్వాత జల్లులు ప్రారంభమయ్యాయి. రాత్రి ఒక మోస్తరు వాన కురిసింది. అలా మంగళవారం ఉదయం 8.30 గంటలకు జిల్లాలో సగటున 22.20 మి.మీ వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా పొన్నలూరు మండలంలో 49.0 మి.మీ, పామూరు మండలంలో 39.60 మి.మీ కురిసింది. మంగళవారం ఉదయం నుంచి తిరిగి జల్లులు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంట నుంచి తెరపి లేకుండా కురిసింది. ఈ సమయంలో ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి, కనిగిరి గిద్దలూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో భారీ వర్షం పడింది. అలా మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకూ అత్యధికంగా సింగరాయకొండలో 166.25 మి.మీ వర్షపాతం నమోదు కాగా అదే మండలంలోని పాకలలో 127.75 కురిసింది. సంతనూతలపాడు మండలం చిలకపాడులో 131.50 మి.మీ, చీమకుర్తిలో 121.50, కనిగిరిలో 68.50, పొన్నలూరులో 66.5, మద్దిపాడులో 62.0, సీఎస్‌పురంలో 57.0, పొదిలిలో 55.0, రాచర్లలో 54.50, ఎన్‌జీపాడులో 54.0 మి.మీ నమోదైంది. పలు ఇతర మండలాల్లోనూ 30 నుంచి 50 మి.మీ వర్షం కురిసింది.

వణికిస్తున్న వాగులు, నీటి వనరులు

ఇటీవల వరుసగా నాలుగైదు రోజులు అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకే జిల్లాలోని వనరులన్నింటిలోకి నీరు చేరి ఉంది. తాజాగా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో అన్నింటిలోనూ

మిగతా 6వ పేజీలో



సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం రోడ్డులో పడిపోయిన చెట్టును తొలగిస్తున్న పోలీసులు



ఊళ్లపాలెం వద్ద మత్స్యకార కుటుంబాన్ని కలిసి యోగక్షేమాలను తెలుసుకుంటున్న మంత్రి స్వామి, శశిధర్



కొత్తపట్నం పల్లెపాలెం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న జోనల్ అధికారి సిసోడియా, జేసీ గోపాలకృష్ణ



ఒంగోలులో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరంలో ఉన్న ముంపు కాలనీ ప్రజలు



ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడు మధ్య వరి పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

విపత్తును ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు

- తీరప్రాంత మండలాలకు స్పెషల్ ఆఫీసర్లు
- పోలీసులతో 12 ప్రత్యేక టీంల ఏర్పాటు
- 27 ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధం
- హైవేపై భారీ వాహనాలు నిలిపివేత
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



ఒంగోలు క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం చేశామని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని తీరప్రాంతంలో ఉన్న మండలాల్లో పరిస్థితిని సమన్వయం చేయడం కోసం పోలీసుశాఖ నుంచి ప్రత్యేక అధికారులను నియమించామని

మిగతా 6వ పేజీలో

ఏడు సొసైటీ పీఐసీల గడువు పెంపు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏడు సొసైటీ పీఐసీల గడువును పెంచుతూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాటిలో సర్వేరెడ్డిపాలెం, రాపర్ల, కొణిజేడు, పొన్నలూరు, కారుమంచి, కొమరోలు సహకార సంఘాలు ఉన్నాయి. వచ్చే ఏడాది జనవరి 30వ తేదీ వరకు ఈ కమిటీలు కొనసాగుతాయి.

ప్రకాశంలోకే కందుకూరు

కొత్త జిల్లాల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు సమీక్ష

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

మార్కాపురం జిల్లా ఏర్పాటుతోపాటు కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలిపేందుకే ఉన్నత స్థాయిలో నిర్ణయం జరిగినట్లు తెలుస్తోంది. జిల్లాల ఏర్పాటు అంశంపై కేబినెట్ సబ్‌కమిటీ, అధికారులతో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, సబ్‌కమిటీలోని మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, మనోహర్, బీసీ జనార్దన్‌రెడ్డి తదితరులు, ఇతర మంత్రులు, ముఖ్య నేతలు, అధికారులు హాజరైనట్లు తెలుస్తోంది. సమావేశంలో మంత్రులు సేకరించిన ప్రాథమిక సమాచారాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రుల సబ్ కమిటీ ఆయా జిల్లాల కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజల నుంచి అందిన సమాచారానికి అనుగుణంగా ఒక నివేదికను కూడా తయారు చేసినట్లు తెలిసింది. అందులోని అంశాలను వారు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాకు సంబంధించి మార్కాపురం జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను ఆయనకు వివరించారు. కనిగిరి, దర్శి, మార్కాపురం, వైపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలతో మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ఉన్న అవకాశాన్ని విశదీకరించినట్లు తెలిసింది. శ్రీశైలం మండలాన్ని మార్కాపురంలో కలిపే ప్రతిపాదన లేనట్లు

మిగతా 6వ పేజీలో



దోర్నాల వద్ద వ్యవసాయ బోరు నుంచి ఉధృతంగా వస్తున్న నీరు

పాతాళగంగ పైపైకి..

- పలు మండలాల్లో పెరిగిన భూగర్భ జలమట్టం
- పశ్చిమాన తీరిన నీటి బెంగ
- అత్యధికంగా వైపాలెంలో 17.49 మీటర్లు పెరుగుదల

త్రిపురాంతకం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో నీటి సమస్య చాలావరకు తీరినట్టయింది. ముఖ్యంగా జిల్లాలోని పశ్చిమప్రాంత మండలాల్లో భూగర్భ జలాలు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగాయి. జిల్లావ్యాప్తంగా మే నుంచి సెప్టెంబరు మధ్య భూగర్భ జలాల గణాంకాలను పరిశీలిస్తే సగటున 3.43 మీటర్లు పెరిగింది. మేలో 18.96 మీటర్ల లోతులో నీరు ఉండగా సెప్టెంబరులో 15.54 మీటర్లకు చేరింది. ఈఏడాది వర్షాలు కూడా ఏకధాటిగా కురవకపోయినా కురిసిన ప్రాంతాల్లో కుంభవృష్టిగా పడింది. ఈ వర్షాల వల్ల పాతాళగంగ పైకి ఉబికిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు మెట్ట పంటలకు జీవం పోయగా, ఇతర పంటలకు బోర్లపై ఆధారపడే రైతులు

మిగతా 6వ పేజీలో

రేషన్ పంపిణీ ప్రారంభం

- మొంథా తుఫాన్ నేపథ్యంలో ముందుగానే ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజా ప్రభుత్వం ముందస్తుగానే రేషన్ పంపిణీని ప్రారంభించింది. 1,392 చౌక ధరల దుకాణాల పరిధిలోని కార్డుదారులందరికీ డీలర్లు నవంబర్ కోటా సరుకుల పంపిణీని మంగళవారం నుంచి ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 6.61లక్షల తెల్లరేషన్ కార్డుదారులు ఉండగా వారందరికీ అవసరమైన బియ్యం, చక్కెరను ఇప్పటికే పౌరసరఫరాల శాఖ గోడౌన్ల నుంచి సరఫరా చేశారు. విపత్కర వేళ ప్రజలు ఆహారం కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సరుకులు పంపిణీ చేయాలని శుక్రవారమే ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు. ఒంగోలు గాంధీనగర్‌లోని రేషన్ షాపును డీఎస్‌వో పద్మశ్రీ పరిశీలించి అక్కడ కార్డుదారులతో పాటు డీలర్లతో మాట్లాడారు. రేషన్ సరుకుల్లో కేవలం బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ఈ సారి కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. ఎనిమిది నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఏ నెలకానెల కందిపప్పు సరఫరా అవుతుందని ఉన్నతాధికారులు చెప్తున్నా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు.



ఒంగోలు గాంధీనగర్‌లో బయోమెట్రిక్ మిషన్‌లో కార్డుదారుడు వేలిముద్ర వేస్తుండటాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌వో పద్మశ్రీ

ముంచెత్తింది!

(5వ పేజీ తరువాయి)

ప్రవాహ ఉధృతి పెరిగింది. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఆరు వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నాలుగు గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. పాలేరు, ముసి, సగిలేరుతోపాటు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కంభం చెరువుతోపాటు అన్ని చెరువుల్లోకి భారీగా నీరు చేరింది.

పొంగిన వాగులు.. రాకపోకలకు అంతరాయం

వాగులు, వంకలు పొంగి అనేక చోట్ల రాకపోకలకు అటంకం ఏర్పడింది. గుండ్లకమ్మ ఉధృతితో మార్కాపురం- కంభం మధ్యలో ఆటంకం ఏర్పడగా కురిచేడు మండలంలో రైతులు నిర్మించుకున్న వారధి మునిగి పల్నాడు జిల్లాకు రాకపోకలు నిలిచిపోయాయి. ఒంగోలు ప్రాంతంలో నల్లవాగు, ముదిగొండి వాగులు, కొత్తపట్నం, ఎన్‌జీపాడు, కొండపి, జరుగుమల్లి మండలాల్లోని పలు వాగులు పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. రాచర్ల మండలంలోని నక్కల వాగు, కోమరోలు మండలంలోని పులివాగు, దోర్నాల మండలంలోని పలు వాగుల పరిస్థితి అలాగే ఉంది.

నీటిలోనే పంటలు

తుఫాన్ పంటలపై కూడా తీవ్ర ప్రభావం చూపింది. ఇప్పటికే ఇటీవలి వర్షాలతో వేలాది ఎకరాలలో పంటలు దెబ్బతినగా తాజాగా తుపాన్‌తో కురిసిన వర్షం పంట పొలాలను ముంచెత్తింది. ఆయా ప్రాంతాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం జిల్లాలో సుమారు 50 వేల ఎకరాలలో వరి, పత్తి, మిర్చి, మినుము, కంది, సజ్జ, పొగాకు మొక్కజొన్న, ఇతరత్రా పంటలు నీట మునిగాయి. పలుచోట్ల వర్షపు నీరు చేరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. కాగా తుఫాన్ ముందస్తు ఏర్పాట్లలో రెండు రోజుల నుంచి తలమునకలై ఉన్న జిల్లా యంత్రాంగం తాజా వర్షాలతో మరింత అప్రమత్తమయ్యారు. ప్రాణనష్టం అసలు లేకుండా, ఆస్తుల నష్టాలు వీలైనంత తక్కువగా ఉండేలా చూడాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. భారీ వర్షాలు కురిస్తే ముంపునకు గురయ్యేవారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చాల్సిన ప్రాంతాలను ముందుగానే గుర్తించారు.

భారీగా పునరావాసం

తీర ప్రాంతంలోని ఐదు మండలాల్లోని 8 గ్రామాల్లో తీవ్ర ప్రభావం ఉంటుందని అంచనా వేశారు. అలాగే ఇతర ప్రాంతాల్లో లోతట్టు కాలనీలు ముంపునకు గురవుతాయని గుర్తించి 13 మండలాల్లోని 61 లోకేషన్లలో 62 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా 19 వేల మందికి వాటిలో రక్షణ కల్పించాలని నిర్ణయించారు. మంళవారం ఉదయానికి 21 కేంద్రాలను ఏర్పాటుచేసి 814 మందిని తరలించారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి వర్షం భారీగా పడటంతో సాయంత్రానికి 65 శిబిరాలు ఏర్పాటు చేసి 2,900 మందిని వాటిలోకి చేర్చారు. తుఫాన్ ప్రభావంతో తీరప్రాంతం వణికిపోయింది.

ఉన్నతాధికారులు, మంత్రి పరిశీలన

తుఫాన్ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ఆయా ప్రాంతాల్లో అవసరమైన చర్యలపై ఒకవైపు అధికార యంత్రాంగం, మరోవైపు ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించారు. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి సింగరాయకొండ మండలంలోని తీర ప్రాంతంలోని పాకల, బింగినపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయనతో పాటు జిల్లా స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్ కూడా గ్రామాల్లో పర్యటించారు. జోనల్ పర్యవేక్షణాధికారైన సీనియర్ ఐఏఎస్ సిసోడియా జిల్లాకు వచ్చి కలెక్టర్ రాజాబాబు, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఇతర కీలక అధికారులతో సమీక్షతోపాటు కొత్తపట్నం పల్లెపాలెంలో పర్యటించి సహాయకచర్యలు పర్యవేక్షించారు. సాయంత్రం మంత్రి డాక్టర్ స్వామి కలెక్టరేట్‌కు చేరుకొని కమాండ్ కంట్రోలు రూములో ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సీనియర్ అధికారులతో భేటీ అయ్యారు. ఒంగోలు నగరంలో అలాగే నియోజకవర్గంలోని మండలాల్లో చర్యలపై చర్చించారు.

పరిస్థితిని సమీక్షించిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు

సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ మద్దిపాడులోని పునరావాస కేంద్రాన్ని సందర్శించగా గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సగిలేరు ముంపు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పారు. దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కురిచేడు మండలంలో పర్యటించి రోడ్ల పరిస్థితిని పరిశీలించారు. గుండ్లకమ్మలో కొట్టుకుపోయిన వారధిని పరిశీలించారు. కాగా భారీ వర్షాలు, గాలులతో అక్కడికక్కడ ఇళ్లు, చెట్లు కూలాయి. రాచర్ల మండలం అనుమలవీడులో మట్టిమిద్దె కూలి మహిళకు గాయాలయ్యాయి. వెలిగండ్ల మండలం మరపగుంట్లలో ప్రహరీ కూలి గేదె మృతి చెందింది. ఎన్‌జీపాడు మండలం పోతవరంలో ఇంటిపై కొబ్బరి చెట్టు విరిగిపడగా, పలుచోట్ల భారీ చెట్లు విరిగి పడ్డాయి. మద్దిపాడు మండలం రామాయపాలెంలో ఇరిగేషన్ చెరువుకు గండిపడే ప్రమాదం ఉండటంతో గ్రామస్థులు అప్రమత్తమై ఎక్స్‌కవేటర్‌తో చెరువు సప్లయ్ చానల్‌కు ఉన్న రింగ్‌బండ్‌కు గంటికొట్టి నీటిని మళ్లించారు.

తీరని వేదన

- ● జలదిగ్బంధంలో తీరప్రాంత గ్రామాలు
- ● వణుకుతున్న మత్స్యకార పల్లెలు
- ● గాలుల తీవ్రతతో భయాందోళన
- ● నీట మునిగిన వరి పొలాలు
- ● ఉద్యాన పంటలకు తీవ్ర దెబ్బ
- ● ఉప్పు కొటార్లు నీటిపాలు

మొంథా తుఫాన్ జిల్లాను అతలాకుతలం చేసింది. మంగళవారం జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు తీర ప్రాంతం చిగురుటాకులా వణికిపోయింది. మత్స్యకార గ్రామాల్లో నిశ్శబ్దం ఆవరించింది. భారీ వర్షాలకు మత్స్యకార గ్రామాలు జలమయం అయ్యాయి. కొన్ని జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఉదయం నుంచి తుప్పర్లతో ప్రారంభం అయిన వాన మధ్యాహ్నం నుంచి భారీ వర్షంగా మారింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి మత్స్యకార గ్రామాల్లోకి భారీగా నీరు చేరింది.

ఒంగోలు నగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ దాటికి కొత్తపట్నం నుంచి బీచ్ వరకు ఉన్న తారు రోడ్డు కనిపించకుండా పోయింది. ఈ మార్గంలో రోడ్డులో మూడడుగుల ఎత్తులో నీరు ప్రవహించింది. కొత్తపట్నం పల్లెపాలెం గ్రామంలోకి వరద నీరు వచ్చి చేరింది. కొత్తపట్నం మండలోని మత్స్యకార గ్రామాలైన స్వర్ణాంధ్రపట్టపుపాలెం, మడనూరు చినపట్టపుపాలెం, పెద పట్టపుపాలెం, ఈతముక్కల పల్లెపాలెం, రాజు పాలెం పట్టపుపాలెం గ్రామాల్లోకి వర్షపు నీరు చేరింది. ఇళ్లలోకి కూడా నీరు వచ్చి చేరటంతో మత్స్యకారులు ఇబ్బందులు పడ్డారు. గడిచిన పదేళ్లలో ఇంతస్థాయిలో గ్రామాల్లోకి నీరు వచ్చిన దాఖలాలు లేవని మత్స్యకారులు అంటున్నారు. నాగులుప్పలపాడు, కనపర్తి, గుండాయపాలెం, గుండమాల, పిన్నివారిపాలెం, శింగరాయకొండ మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లోకి కూడా వర్షం నీరు చేరటంతో మత్స్యకారులు ఇబ్బందులు పడ్డారు. తీర ప్రాంత గ్రామాల్లోకి నీరు వచ్చి చేరటంతో పలు గ్రామాల్లో మత్స్యకారులను పునరావాస కేంద్రాలకు తరలించారు. అధికారులు భోజనవసతి


కొత్తపట్నం నుంచి బీచ్‌కు వెళ్లే రహదారిలో భారీగా నిలిచిన నీళ్లు

ఏర్పాటు చేశారు.

500 ఎకరాల్లో నీటమునిగిన వరి

కొత్తపట్నం మండలంలో రైతులు సాగు చేసిన 500 ఎకరాల్లో వరి పూర్తిగా నీటమునిగి పోయింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు చేరి చావుబతుకుల మధ్య ఉన్న పైరు మంగళవారం కురిసిన వర్షానికి పూర్తిగా మునిగిపోయింది. పంట పొలాలు చెరువులా మారాయి. ఇసుక నేలల్లో చేమదుంపలు, ఆకు కూరలు, పూలసాగు చేసిన రైతులు కూడా బాగా దెబ్బతిన్నారు. మోకాటి లోతు నీళ్ళలో పంటలు మునిగిపోయి ఉన్నాయి. కుళ్లిపోయి పనికి రాకుండా పోతాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఆందోళనలో ఆక్వా రైతులు

జిల్లాలోని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆక్వా చెరువుల్లో నీరు వచ్చి చేరింది. కట్టపైన నీరు పొంగి పొర్లుతోంది. ఇంకా వర్షం పడితే చెరువులు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం ఇలాగే కొనసాగితే చెరువుల్లో ఆక్సిజన్ స్థాయిలు పడిపోయి నష్టం వచ్చే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుఫాన్ నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాలకు విద్యుత్ సరఫరాలో పలుమార్లు అంతరాయం ఏర్పడింది. మంగళవారం రాత్రికి గాలుల తీవ్రత పెరగటంతో అనేక గ్రామాలకు అధికారులే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పెద్ద వాహనాలు తప్ప ద్విచక్ర వాహనాలు కూడా తిరగలేని విధంగా రోడ్లు వర్షపు నీరు చేరటంతో తీర ప్రాంత గ్రామాలకు రాకపోకలు తగ్గిపోయాయి.

విపత్తును ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లికి ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, కొత్తపట్నం, ఒంగోలు మండలాలకు ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, నాగులుప్పలపాడు మండలానికి దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణలను ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని కొన్ని అత్యవసర చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి 7 గంటల నుంచి భారీ వాహనాలను నిలిపివేస్తున్నామని వెల్లడించారు. అన్ని రహదారులలో వాణిజ్యపరమైన వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. సురక్షితమైన ప్రాంతాలలో ఆయా వాహనాలను నిలుపుకోవాలని కోరారు. అత్యవసరమైతే మినహా ఎవ్వరూ ఇంటి నుంచి బయటకు రావద్దని తెలిపారు. తుఫాన్ ప్రభావం తగ్గిన వెంటనే నిబంధనలు ఉపసంహరిస్తామన్నారు. ఆస్తి, ప్రాణ నష్టం కలగకుండా అనేక చర్యలు చేపట్టామన్నారు. జిల్లా కేంద్రంలో 12 పోలీసు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, 27 ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో 112 లేదా వాట్సాప్ నంబరు 9121102266కు సమాచారం ఇవ్వాలని కోరారు. తుఫాన్ హెచ్చరికల గురించి తప్పుడు పోస్టులు సోషల్ మీడియాలో పెట్టవద్దని హితవు పలికారు.

పాతాళగంగ పైపైకి..

(5వ పేజీ తరువాయి)

భూగర్భ జలాల పెరుగుదలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చాలాచోట్ల ఈ ఏడాది పంటల సాగుకు బోర్ల ద్వారా నీటి తడులు అందించే పని కూడా తగ్గిందంటున్నారు. జిల్లాలో 11 మినహా మిగిలిన అన్ని మండలాల్లో కూడా జలాల పెరుగుదల ఉన్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

పశ్చిమాన జలకళ

జిల్లాలోని పశ్చిమప్రాంతం ఎప్పుడూ కరువు పీడిత ప్రాంతం. భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికి కూడా ఇబ్బందులు పడే పరిస్థితి. తాజా వర్షాల కారణంగా బోర్లలో నీరు సమృద్ధిగా వస్తోంది. మే, సెప్టెంబర్ మధ్య నీటి మట్టం గణాంకాలను పరిశీలిస్తే.. అత్యధికంగా ఎర్రగొండపాలెం మండలంలో 17.49 మీటర్లు పెరిగింది. మేలో ఇక్కడ 47.07 మీటర్ల లోతులో ఉన్న నీరు సెప్టెంబరుకు 29.58 మీటర్లకు చేరింది. రాచర్లలో 16.29 మీటర్లు, మార్కాపురంలో 14.13, దోర్నాలలో 11.79, పెద్దారవీడులో 10.01, గిద్దలూరులో 9.49, పుల్లలచెరువులో 8.06, తర్లుపాడులో 7.09, త్రిపురాంతకంలో 6.89 మీటర్లు పెరిగింది. దర్శిలో 2.40, కంభంలో 2.20, పామూరులో 1.37, పొదిలిలో 1.02, తాళ్లూరులో 0.89, చీమకుర్తిలో 0.79, ఒంగోలులో 0.71, వెలిగండ్లలో 0.63, నాగులుప్పలపాడులో 0.54, జరుగుమల్లిలో 0.49, మద్రిపూడిలో 0.45, కురిచేడులో 0.40, కొనకనమిట్లలో 0.31, కొమరోలులో 0.11, కొత్తపట్నంలో 0.10 మీటర్ల నీటి మట్టం కనిపించింది.

కొన్ని మండలాల్లో తగ్గిన నీటి మట్టం

నీటిమట్టం తగ్గిపోయిన మండలాల్లో బేస్తవారపేట, పీసీపల్లి ముందువరుసలో ఉన్నాయి. బేస్తవారపేటలో - 2.83 మీటర్లు, పీసీపల్లిలో - 1.64 మీటర్లు మే నుంచి సెప్టెంబరు మధ్య నీటి మట్టం తగ్గుదల కనిపించింది. దొనకొండ -1.35, హనుమంతుని పాడు -1.31, పొన్నలూరు -0.67, సీఎస్‌పురం -0.60, కనిగిరి -0.25, ముండ్లమూరు -0.20, సంతనూతలపాడు -0.11, అర్ధవీడు -0.05, కొండపి -0.04 (మైనస్) భూగర్భ జలాలు తగ్గుదల ఉన్నట్లు గణాంకాలు వెల్లడించాయి. దీంతో పాతాలగంగ పైకి వచ్చినట్లు అయ్యింది.

ప్రకాశంలోకే కందుకూరు

(5వ పేజీ తరువాయి)

సమాచారం. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకి నియోజకవర్గాన్ని, నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశంలో చేర్చడమే ఉత్తమమన్న అభిప్రాయాన్ని చెప్పినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అందుకనుగుణమైన సంకేతాన్ని ఇచ్చినట్లు సమాచారం. ఇటీవల కందుకూరు నెల్లూరులోనే ఉండవచ్చన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గతం నుంచి ఉన్న ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా కందుకూరును ప్రకాశం జిల్లాలోకే చేర్చే పరిస్థితి స్పష్టంగా వెల్లడవుతోంది. చీరాల, పర్చూరు నియోజకవర్గాలు బాపట్ల జిల్లాలోనే కొనసాగించాలని సబ్‌కమిటీ ప్రతిపాదనలో పేర్కొన్నట్లు తెలిసింది. కాగా రెవెన్యూ డివిజన్‌ల ఏర్పాటు, ఆయా మండలాలకు సంబంధించి కొన్ని గ్రామాల చేర్పులు, మార్పులు తదితర అంశాలు కూడా మంత్రుల సబ్ కమిటీ నివేదికలో పొందుపరిచినట్లు సమాచారం. అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సబ్‌కమిటీ కూడా ప్రతిపాదించినట్లు తెలిసింది. కందుకూరు రెవెన్యూ డివిజన్ విస్తరణ అంశం వివరాలు తెలియాల్సి ఉంది. మార్కాపురం జిల్లాలోకి చేరే దర్శి నియోజకవర్గంలోని ముండ్లమూరు, తాళ్లూరు మండలాల వారు తమను ఒంగోలు లేక కొత్తగా ఏర్పడే అద్దంకి డివిజన్‌లో ఉంచాలని గతంలో ప్రతిపాదనలు చేశారు. ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కూడా అదేరకమైన ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై తుది నిర్ణయం ఇంకా జరగలేదని సమాచారం.

చిత్రజ్యోతి
SINCE 1965

కొత్త తేదీన ఆర్యన్




విష్ణు విశాల్ కథా నాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ఠ్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి



దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకొని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగిన్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబోనో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.



వర్షానికి తడిసి కుళ్లిపోయిన ఉల్లి

ఉల్లి కుళ్లి... రైతు తల్లడిల్లి

● పంట చేతికొచ్చే సమయానికి వానదెబ్బ ● 540 ఎకరాల్లో నష్టం

త్రిపురాంతకం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ దెబ్బకు ఉల్లి రైతులు తల్లడిల్లుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఎర్రగొండ పాలెం మండలం గురిజేపల్లి, త్రిపురాంతకం మండలం నడిగడ్డ గ్రామాల్లో 540 ఎకరాల్లో రైతులు ఉల్లిని సాగు చేశారు. ప్రస్తుతం ఉల్లి పంట చేతికి వచ్చింది. కొంతమంది ఈ వర్షానికి ముందే పొలాల్లోని ఉల్లిని తీసి ఆరబె ట్టారు. ఇంతలోనే వర్షం రావడంతో తడిసిపోయి కుళ్లుతోంది. ఇక మిగిలిన రైతుల పంట కూడా భూమిలో ఉన్నప్పటికీ అది కూడా అధికంగా నీరు నిల వడం, తేమశాతం అధికం కావడంతో కుళ్లిపోతుందని వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇదే వర్షాలు మరో రెండు మూడు రోజులు కొనసాగితే దాదాపు 540 ఎకరాల్లోని సాగులో ఉన్న ఉల్లి నష్టపోయినట్టేనని చెప్తున్నారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి గోపీచంద్ మంగళవారం ఉల్లి పొలాలను పరిశీలిం చారు. వర్షం తగ్గిన తరువాత మరోసారి పరిశీలించి పంట నష్టం అంచనా వేసి జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. దాదాపు ఎకరాకు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టి పంటను పండించు కున్న తరువాత కుళ్లిపోతున్న ఉల్లిని చూసి రైతులు కన్నీరు పెడుతున్నారు.

‘రైతు వారధి’కి మరమ్మతులు

● అప్రోచ్ రోడ్డు గండి పూడ్చివేత



రైతు వారధిని పరిశీలిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

కురిచేడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దెబ్బతిన్న రైతు వారధి అప్రోచ్ రోడ్డు మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. కురిచేడు, త్రిపురాంతకం మండలాల మధ్య ముష్టిగంగవరం గ్రామస్థులు గుండ్లకమ్మ నదిపై చందాలు వేసుకుని రైతు వారధిని నిర్మించుకున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు నమోదు కావడంతో పైభాగం నుంచి నీటి ప్రవాహ ఉధృతి పెరిగింది. నీటితోపాటు తూటుకాడ, ముళ్ల కంప కొట్టుకువచ్చింది. ఇది వారధి తూములకు అడ్డుపడటంతో అప్రోచ్ రోడ్డుకు గండి పడింది. స్పందించిన గ్రామస్థులు, అధికారులు వెంటనే ఎక్స్‌కవేటర్ సాయంతో తూటుకాడను తొలగించారు. అయినా నీటి ప్రవాహ ఉధృతి పెరగడంతో అప్రోచ్ రోడ్డుకు పడిన గండి పెద్దది అయింది. మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి రైతు వారధిని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వెంటనే లారీలతో రాళ్ళు, మట్టిని తోలి సాయంత్రానికి కొంతమేర గండిని పూడ్చారు. వర్షం వారి పనులకు ఆటంకాన్ని కలిగించింది. లారీలు బురదలో ఇరుక్కుపోతున్నాయి. వాటిని బయటకు తీసుకురావడానికే ఎక్కువ సమయం పడుతుంది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గండిని పూడ్చే పనులు చేస్తున్నారు. వారధి కిందిభాగంలో ఉండే మట్టి కోతకు గురికావడంతో వారధి దెబ్బతినే ప్రమాదం ఉందని గండి పూడ్చే పని వేగవంతం చేస్తున్నారు. వారధి ఉంటే కురిచేడు, త్రిపురాంతకం మండలాల మధ్య రాకపోకలకు ఇబ్బంది ఉండదు. ఇప్పటికే రాకపోకలు ఆగిపోయాయి.

జిల్లాలో 22.2 మి.మీ. వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 22.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. పొన్నలూరులో 49.0. పామూరు 39.6, ఒంగోలు అర్బన్ 38.2, ఒంగోలు రూరల్ 38.2, టంగుటూరు 37.4, జరుగుమల్లి 37.2, హనుమంతునిపాడు 36.0, కొత్తపట్నం 34.4, మర్రిపూడి 33.6, నాగులుప్పలపాడు 33.4, కనిగిరి 34.4, సింగరాయకొండ 31.2, కేకేమిట్ల 26.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. పీసీపల్లి 28.6, మద్దిపాడు 28.6, సంతనూతలపాడు 26.2, పొదిలి 26.2, కొండపి 22.6, వెలిగండ్ల 20.8, తర్లుబాడు 18.4, మార్కాపురం 17.6, పెద్దారవీడు 15.8, కొమరోలు 15.6, కంభం 15.4, సీఎస్‌పురం 14.2, రాచర్ల 13.6, కురిచేడు 13.6, దొనకొండ 12.2, త్రిపురాంతకం 12.2, దర్శి 11.2, గిద్దలూరు 11.2, ముండ్లమూరు 10.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.



కూలిన మట్టిమిద్దె

మట్టి మిద్దె కూలి మహిళకు గాయాలు




చికిత్సలు పొందుతున్న మహిళ

రాచర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మట్టి మిద్దె కూలి మహిళ గాయపడిన ఘటన మండ లంలోని అనుములవీడు గ్రామంలో సోమ వారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన పిన్నిక లక్ష్మీ రంగమ్మ మట్టి మిద్దెలో నిద్రిస్తుం డగా రాత్రి 10గంటల సమయంలో మిద్దె కూలి మట్టి ఆమెపై పడింది. దీంతో ఆమెకు గాయాలు కాగా 108లో గిద్దలూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాని మిద్దె కూలింది. టీడీపీ నాయకుడు అంబవరం శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్, ఏఎస్సై శ్రీనివాస రావు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద కారణాలను తెలుసుకున్నారు.

మొంథా తాండవం!

జిల్లాను వణికించిన తుఫాన్

● ఎడతెరపిలేకుండా దంచికొట్టిన వాన
● నీట మునిగిన పంట పొలాలు
● రోడ్లన్నీ జలమయం
● నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పర్యటన



మొంథా తుఫాన్ జిల్లాను వణికించింది. సోమవారం అర్ధరాత్రి తరువాత నుంచి మొదలైన వర్షం మంగళవారం రాత్రి వరకూ దఫాలు దఫాలుగా దంచికొట్టింది. ప్రధానంగా తీర ప్రాంతాలను బెంబేలెత్తించింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షానికి తోడు గాలులు తీవ్రమవడంతో పలుచోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పంట పొలాలు నీట మునిగాయి. కాలువలు పొంగి పొర్లాయి.

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులో నీట మునిగిన పంట పొలాలు

8,150 హెక్టార్లలో పంటలకు నష్టం

ప్రాథమికంగా గుర్తించిన వ్యవసాయశాఖ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలకు జిల్లాలో 8,150.2 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లాలోని 23 మండలాల పరిధిలోని 160 గ్రామాలకు చెందిన 9,322 మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. పెద్దారవీడు మండలంలో 13 గ్రామాలకు చెందిన 1309 మంది రైతులు, మార్కాపురం మండలంలో 15 గ్రామాలకు చెందిన 3,260 మంది, తర్లుబాడు మండలంలో 13 గ్రామాలకు చెందిన 99 మంది, కంభం మండలంలో రెండు గ్రామాలకు చెందిన 30 మంది రైతులు, అర్ధవీడు మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన 55 మంది రైతులు, మర్రిపూడి మండలంలో 18 గ్రామాలకు చెందిన 420 మంది రైతులు, పొదిలి మండలంలో 27 గ్రామాలకు చెందిన 185 మంది రైతులు, దర్శి మండలంలో ఐదు గ్రామాలకు చెందిన 228 మంది రైతులు, కొనకనమిట్ల మండలంలో మూడు గ్రామాలకు చెందిన 258 మంది రైతులు, దొనకొండ మండలంలో ఐదు గ్రామాలకు చెందిన 389 మంది రైతులకు చెందిన పలు రకాల పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. తాళ్లూరు మండలంలో ఒక గ్రామానికి చెందిన 10 మంది, రాచర్లలో మూడు గ్రామాలకు చెందిన 425 మంది, గిద్దలూరు మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన 405 మంది, బేస్తవారిపేటలో ఐదు గ్రామాలకు చెందిన 302 మంది, పుల్లలచెరువు మడలంలో ఐదు గ్రామాలకు చెందిన 35 మంది రైతుల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. వైపాలెం మండలంలో ఆరు గ్రామాలకు చెందిన 162 మంది, దోర్నాల మండలంలో ఒక గ్రామానికి చెందిన 20 మంది రైతులు, వెలిగండ్ల మండలంలో 17 గ్రామాలకు చెందిన 1278 మంది రైతులు, హనుమంతునిపాడు మ ండలంలో ఒక గ్రామానికి చెందిన 62 మంది రైతులు, సీఎస్‌పురం మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన 22 మంది, కనిగిరి మండలంలో రెండు గ్రామాలకు చెందిన నలుగురు, కొత్తపట్నం మండలంలో ఒక గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల పంటల దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పత్తి 6178 హెక్టార్లు, మొక్కజొన్న 124.06 హెక్టార్లు, సజ్జ 1771 హెక్టార్లు, జొన్న 5.42 హెక్టార్లు, వేరుశనగ 9.70 హెక్టార్లలో వర్షాలకు పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు.



ఊళ్లపాలెం పల్లెపాలెంలో పర్యటిస్తున్న మంత్రి స్వామి, అధికారులు

తుఫాన్‌పై చింతొద్దు

● ఎదుర్కోవడానికి ముందస్తు చర్యలతో ప్రభుత్వం సిద్ధం
● మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి
● పాకల, పల్లెపాలెంలలో ప్రత్యేక అధికారితో కలిసి పర్యటన

సింగరాయకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ముంచుకొస్తున్న మొంథా తుఫాన్‌ను ఎదుర్కోవడానికి ప్రభుత్వం అన్నివిధాలుగా సిద్ధంగా ఉందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. మంగళవారం తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న సింగరాయకొండ మండలంలోని తీరప్రాంత గ్రామాలైన ఊళ్లపాలెం, పాకలలో జోరువానలో జిల్లా ప్రత్యేక అధికారి కోన శశిధర్, అధికారులతో కలిసి పర్యటించారు. తొలుత ఊళ్లపాలెం పంచాయతీ పరిధిలోని దేవళం పల్లెపాలెం, బేసిన్‌పల్లెపాలెం, బావివద్దపల్లెపాలెంను సందర్శించారు. అక్కడ మత్స్యకారుల ఇళ్లకువెళ్లి వారితో స్వయంగా మాట్లాడారు. నిరవధికంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. తుఫాన్ తీరందాటే సమయంలో అతివేగంతో ఈదురు గాలులుతో కూడిన భారీవర్షం పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతంలో నివాసం ఉండేవారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాకల పంచాయతీ పరిధిలోని చెల్లమ్మగారిపట్టపుపాలెంలో తుఫాన్ షెల్టర్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని, వైద్యశిబిరాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న వారితో మాట్లాడారు. వారికి ఏర్పాటుచేసిన భోజన సదుపాయాల పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పాకల సముద్రతీరానికి చేరుకొని బేవాచ్‌టవర్ నుంచి సముద్రతీరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం అధికంగా ఉన్నందున అత్యవసరం ఉన్నవారు మాత్రమే బయటకు రావాలని సూచించారు. జిల్లా ప్రత్యేక అధికారి కోన శశిధర్ మాట్లాడుతూ తీరప్రాంతాల్లోని మత్స్యకారులు వేటకు వెళ్లకుండా అన్నిచర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. మంత్రితో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మండల ప్రత్యేక అధికారి, జడ్పీ సీఈవో చిరంజీవి, తహసీల్దార్ ఎస్‌టీవీ రాజేష్, ఎంపీడీవో జయమణి, పలుశాఖల అధికారులు, పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోలు రూమ్‌ను సందర్శించిన శశిధర్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో ఒంగోలులోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోలు రూమ్‌ను కలెక్టర్ రాజాబాబుతో కలిసి తుఫాన్ జిల్లా ప్రత్యేక అధికారి, స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ కోన శశిధర్ పరిశీలించారు. తుఫాన్ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితిపై జిల్లాలో ఏమైనా సంఘటనలు నమోదు అయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయా అని తెలుసుకొని పలు సూచనలు చేశారు.

గుండ్లకమ్మ బ్రిడ్జిల వద్ద అధికారుల పహారా



చెరువు అలుగును పరిశీలిస్తున్న తహసీల్దార్ కిరణ్

కంభం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో మంగళ వారం ఉదయం నుంచి నల్ల మల్ల అడవుల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గుండ్లకమ్మ, జంపలేరు, నల్లవాగులు ఉధృ తంగా ప్రవహిస్తున్నాయి. దీంతో తహసీల్దార్ కిరణ్, ఎస్ఐ నరసింహారావు మండలంలో గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహించే ఎర్ర బాలెం, రావిపాడు, పెద్దనల్లకాల్వ బ్రిడ్జిల వద్ద పోలీస్, రెవెన్యూ సిబ్బందిని కాపలా పెట్టారు. సూరేపల్లి గ్రామం వద్ద రోడ్డుపై నుంచి వాగు ప్రవహిస్తుండడంతో చీకట్లో అటువైపు ఎవరూ వెళ్లకుండా రోడ్డుపై ట్రాక్టర్‌ను పెట్టారు.

అలుగు పారేందుకు ఒక్క అడుగు దూరంలో కంభం చెరువు

మొంథా తుఫాన్‌తో కురుస్తున్న భారీ వర్షాలకు గుండ్లకమ్మ, జంపలేరు వాగుల ద్వారా మంగళవారం ఒక్కరోజే కంభం చెరు వుకు నాలుగు అడుగుల మేర నీరు చేరింది. ప్రస్తుతం 19 అడుగుల నీరు ఉందని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు.



ఉధృతంగా వాగులు..

రాచర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం ఉదయం నుంచి జోరు వానలు కురుస్తుండడంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనుములవీడు - గౌతవరం గ్రామాల మధ్య నక్కలవాగు, చోళ్లవీడు వద్ద గుడ్ల కమ్మ వాగు, సోమిదేవిపల్లి సమీపంలోని పగిడి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 134, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

చెడు వ్యసనాలకు బానిసై.. చోరీల బాటపట్టి

● యువకుడు అరెస్ట్ ● రూ.30లక్షల ఆభరణాలు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చెడు వ్యసనాలకు గురైన ఓ యువకుడు దొంగత నాల బాట పట్టాడు. తొలుత చిన్నాచితక చోరీలు చేసిన అతను చివరికి ఇళ్లకు కన్నాలు వేసే స్థాయికి ఎదిగాడు. ముఖ్యంగా ఎవరూ ఇంట్లో ఉండని వాటిని ఎంపిక చేసుకుని చోరీలు చేసి, విలువైన ఆభరణాలను కొట్టేసి ప్రైవేటు తాకట్టు కంపెనీల్లో పెట్టి డబ్బులు తెచ్చుకుని బెట్టింగ్‌లకు పాల్పడడం ఆనవాయితీగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో మార్కాపురంలో ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసులో పోలీసుల చేతికి చిక్కాడు. అతని వద్ద నుంచి పోలీ సులు సుమారు రూ.30లక్షల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు కథనం మేరకు.. తర్లుపాడు మండలం గానుగపెంట గ్రామానికి చెందిన ఈసు మీరావలి జులాయిగా తిరుగుతున్నాడు. స్నేహితులతో కలిసి చెడు వ్యస నాలకు బానిసయ్యాడు. ఎక్కువగా బెట్టింగ్‌లు ఆడే వాడు. దీంతో అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలోనే సులువుగా డబ్బులు సంపాదించాలని దొంగతనాలు మొదలుపెట్టాడు. మార్కాపురం పట్టణంలోని సత్య నారాయణస్వామి గుడి సమీపంలో షేక్‌బాబు కుటుంబం జూలై 22వ తేదీన అసోంలో ఉన్న కూతురు దగ్గరకు వెళ్లారు. ఇంటి తాళాలు పగుల కొట్టి ఉండటాన్ని బాబు బావమరిది షేక్ ఖాశింసా చూసాడు. వెంటనే విషయాన్ని బాబుకు తెలిపాడు. దీనిపై బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.30 లక్షలకు పైగా ఆభరణాలు, నగదు, విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యా దులో పేర్కొన్నారు. పోలీసులు ఈ కేసును చాలెం జీగా తీసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ముఖ్యంగా పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు చోరీకి గురైన నేపథ్యంలో ప్రైవేటు తాకట్టు సంస్థల్లో ఎక్కడైనా కుదవ పెట్టారనే అనుమానంతో విచారిం చారు. మార్కాపురంతోపాటు, గిద్దలూరులోని పలు సంస్థల్లో యువకుడు ఆభరణాలు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నట్లు గుర్తించారు. సాంకేతికత సాయంతో ఈనెల 27న మధ్యాహ్నం టౌన్‌లోని ఎస్టేట్‌కు సమీపంలో వై జంక్షన్ వద్ద ఈసు మీరావ లిని అరెస్ట్ చేశారు. అతని వద్ద ఉన్న మరికొన్ని ఆభరణాలతోపాటు కుదవ పెట్టిన ఆభరణాలను, ఓ డ్రోన్ కెమెరా, మోటరోలా సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చ డంతో రిమాండ్ విధించారు. ఈ కేసును ఛేదించ డంలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

ఏపీఎం, సీసీలు సస్పెన్షన్

పామూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపులకు చెందిన నగదు గోల్‌మాల్‌పై జిల్లా వెలుగు శాఖ అధికారులు చేపట్టిన విచారణలో బాధ్యులైన గతంలో ఏపీఎంగా పనిచేసిన రజిని, పామూరు పట్టణ సీసీ జీవీ బాస్కరెడ్డిలను సస్పెండ్ చేశారు. పామూరు క్లస్టర్ పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన వీఏవో పల్లాపు బేబి తన పరిధిలోని 9 గ్రూపులకు తెలియకుండా సుమారు రూ.25 లక్షలు, మరోగ్రూపు సభ్యులకు సంబంధించి రూ.6 లక్షలు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రావడంతో గత ఆగస్టు నెలలో విచారణ చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వీఏవో బేబి గత మే నెలలోనే జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో నిధుల దుర్వినియోగంపై స్థానిక వెలుగు అధికారులు తనను తప్పుదోవ పట్టించారని ఫిర్యాదుచేశారు. నిధుల అవకతవలపై మూడు బృందాలతో విచారించి ఆధారాలను సేకరించారు. రూ.20 లక్షల సీసీఎల్ రుణాల్లో అవకతవకలు ఎక్కువగా ఉన్నాయని విచారణ అధికారులు గుర్తించారు. ఈనేపథ్యంలో విచారణ అధికారుల నివేదిక ప్రకారం ఏపీఎం రజిని, సీసీ బాస్కరెడ్డిలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నగదు గోల్‌మాల్ విషయంలో వీరికి సహకరించిన స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్ హస్తం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మేనేజర్‌పై బ్యాంకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఒంగోలు క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని గుర్తించి అరెస్టు చేశామని రైల్వే ఎస్సై మధుసుదనరావు తెలిపారు. సోమవారం ఈగల్ టీమ్ రైళ్లలో తనిఖీలు చేస్తుండగా ఎర్నాకులం వెళ్లే రైలులో గంజాయిని స్వాధీనం చేసుకుంది. ఈ క్రమంలో తమిళనాడుకు చెందిన జయరామ్ క్రిష్ణను అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయి తరలిస్తున్న బ్యాగ్ అతనిదే అని అంగీకరించాడని ఎస్సై తెలిపారు. ఈ మేరకు జయరామ్ క్రిష్ణను అరెస్టు చేసి నెల్లూరు రైల్వే కోర్టులో హాజరు పరిచనట్లు తెలిపారు.

మొంథా ముప్పు..!


నీట మునిగిన కొప్పోలు రోడ్డు

11 మంది గర్భిణులను వైద్యశాలలకు తరలింపు

కొండపి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ తీవ్రత నేపథ్యంలో కొండపి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నెలలు నిండిన 11 మంది గర్భిణులను ఆ శాఖ అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో చేర్పించారు. కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల్లో కాన్పుకు దగ్గరలో 17 మంది ఉన్నారు. వీరిలో రవాణా వసతి లేని గ్రామాల్లోని వారిని వైద్యశాలలకు తరలించారు. మిగతా వారు బంధువుల రక్షణలో క్షేమంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. కొండపి సీహెచ్‌సీకి తరలించిన అనకర్లపూడి గ్రామానికి చెందిన గర్భిణి మంగళవారం ఇంటికి బయల్దేరేందుకు ప్రయత్నించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఆంజనేయులు, సీడీపీవో సుశీలాదేవి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ నాగమణి ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆసుపత్రిలోనే ఉండేలా చర్యలు తీసుకున్నారు.

నీట మునిగిన ఒంగోలు నగరం

పునరావాస కేంద్రాలకు శివారు ప్రాంత ప్రజలు

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో నగరం నీటమునిగింది. ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. శివారు కాలనీల్లో ముంపు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. రెండు రోజులుగా కురిసిన వానకు నగరం అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన రహదారుల్లో నీరు నిలిచి, రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మరోవైపు కాలువల్లో పూడికతీత పనులు పూర్తి స్థాయిలో చేయకపోవడంతో మురుగు నీటికి తోడు, వర్షపు నీరు కలిసి రోడ్లపైకి ప్రవహించాయి. ఏకధాటిగా కురుస్తున్న వానకు వీధుల్లో నీరు నిలిచి ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇదిలా ఉండగా కర్నూలు రోడ్డు నుంచి మంగమూరు వెళ్లే రోడ్డు మార్గం మరింత అస్తవ్యస్తంగా మారింది. పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ గోతులమయం కాగా, వర్షపు నీరు నిలవడంతో కనీసం కాలి నడక కూడా కష్టతరంగా మారింది. కొన్ని ప్రాంతాలలో వర్షపు నీరుపోయే మార్గం లేకపోవడంతో పరిస్థితి మరింత జటిలమైంది.

● **రోజంతా వాన**

రోజంతా కురిసిన కుండపోత వానకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, నగర ప్రధాన రహదారుల్లో మోకాళ్ల లోతున నీరు నిలబడి చెరువులను తలపించాయి. ప్రధాన వీధులన్నీ వర్షపునీరు, మరోవైపు పొంగిన మురుగుతో చెరువులను తలపించాయి. భాగ్యనగర్‌లో, జీజీహెచ్ ఎదురు, కర్నూలురోడ్, పలు వీధుల్లో నీరు నిలిచి ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ధారావారి తోట, దేవుడు చెరువు, సీఎస్ఆర్ శర్మాకళాశాల, బాపూజి మార్కెట్ కాంప్లెక్స్, ఆర్టీసీ డిపో ఆవరణ, ఏకలవ్య నగర్, మసాన్ దర్గా సెంటర్, భాగ్యనగర్‌లో నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందుల పడ్డారు.

● **పునరావాస కేంద్రాలకు శివారు కాలనీల ప్రజలు**

ఎడతెరిపి లేకుండా ముసురుతో కూడిన వర్షానికి వెంకటేశ్వరకాలనీ, బలరాంకాలనీ, బిలాల్ నగర్, కరుణా మిలటరీ కాలనీ, బాలినేనిభరత్ కాలనీ, ఇందిరాకాలనీ, గుర్రంజాషువాకాలనీ, మదర్ థెరిస్సాకాలనీ, ప్రగతి కాలనీ, చినమల్లేశ్వరకాలనీలతోపాటు నగరంలోని కర్నూలు రోడ్డు, నెల్లూరు బస్టాండ్, ఆర్టీసీ ఆవరణ, స్టేషన్ రోడ్, పలు ప్రాంతాలలో నీరు నిలిచి ప్రజలు, ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా, మదర్‌థెరిస్సా కాలనీ, అంబేద్కర్ కాలనీ, ప్రగతి కాలనీ, జాషువా కాలనీతోపాటు పలు శివారు కాలనీల ప్రజలను కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు ముందుగానే అప్రమత్తం చేశారు. భాగ్యనగర్‌లోని 2వ లైనులో సర్వస్వతి కాలేజిలో ఏర్పాటు చేసిన పునరావా కేంద్రానికి 450 మందిని తరలించగా, పీవీఆర్ బాలుర పాఠశాలలో నక్కల వారిని, వంటవారి కాలనీ, తదితర సమీప ప్రాంతాలకు చెందిన 150 మందిని తరలించి ఆహారంతోపాటు తదితర వసతులను కల్పించారు. కాగా తహసీల్దారు మధు, కమిషనరు వెంకటేశ్వరరావు ఎప్పటికప్పుడు స్వయంగా పరిశీలించారు.

● **వీధులన్నీ నిర్మానుష్యం.. వీధి వ్యాపారం విలవిల**

తుఫాన్ కారణంగా మంగళవారం వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. అధిక శాతం మంది ప్రజలు ఇళ్లకే పరిమితం కాగా, ఏరోజుకారోజు పనిచేసుకుని జీవనం సాగించే వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వ్యాపారం వదులుకోలేక, ఇంటికెళ్లలేక అవస్థలు పడ్డారు.

● **మునిగిన కాలనీలు, పంటపొలాలు**

సంతనూతలపాడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ తీవ్రతకు భారీ వర్షాలతో మండలంలోని పలుగ్రామాల్లో కాలనీలు, పంట పొలాలు నీటమునిగాయి. సంతనూతలపాడులోని తంబళ్లగుంట వాగు ఉధృతంగా ప్రవహిస్తూ రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అక్కడ ఉంటున్న ప్రజలను ముందుజాగ్రత్తగా పునరావాసకేంద్రానికి తరలించారు. బాధితులకు ఆహారం అందించారు. సంతనూతలపాడు పెద్ద చెరువు అలుగు పెద్ద ఎత్తున పారుతుండటంతో త్రిపురాంతకస్వామి ఆలయంతో పాటు సచివాలయం-1 ప్రాంగణం నీటిమునిగింది. అదేవిధంగా బాపట్ల బజారులోని అంకమ్మగుడిసమీపంలోని కాలువ, పెద్దచెరువు అలుగు ఉధృతంగా పారుతుండడంతో ఇళ్లలోకి నీళ్లు వచ్చాయి. విద్యుత్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పశువులను, గొర్రెలను సంతనూతలపాడు మార్కెట్ యార్డుకు తరలించారు. మంగమూరులో నల్లవాగును ఎంపీడీవో సురేష్‌బాబు పరిశీలించారు.

ప్రమాదకరంగా సంతనూతలపాడు పెద్ద చెరువు

సంతనూతలపాడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు సంతనూతలపాడు పెద్ద చెరువులోని వర్షపునీరు చేరి ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఎస్సై అజయ్‌బాబు తన సిబ్బందితో హుటాహుటిన చెరువుకు సంబంధించి పంట కాలువ రెండు గేట్లను ఎత్తివేయించారు. లేదంటే చెరువులో వర్షపునీరు భారీగా చేరి చెరువు కట్టకు ప్రమాదం ఏర్పడేది. చెరువు అలుగు ఉధృతంగా పారుతుండటంతో పోలీస్‌స్టేషన్ ప్రాంగణం పూర్తిగా మునిగిపోయింది. సమీపంలోని కర్నూలు రోడ్డుపై కల్వర్టు మునగడంతో రోడ్డు కనిపించక వాహనాలు ఆగాయి. ఎప్పటికపుడు పోలీసులు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.



చెరువు అలుగుపారడంతో నీటిమునిగిన సంతనూతలపాడు-1 సచివాలయం ప్రాంగణం

నాగులుప్పలపాడు మండలంలోనూ...

నాగులుప్పలపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో మండల పరిధిలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాగులు వంకలు పొంగి పొర్లాయి. మండల ప్రత్యేకాధికారి జి.జోసఫ్‌కుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో తేళ్ల రవికుమార్‌లు గ్రామాల్లో పరిస్థితులను తెలుసుకొంటూ తగు సూచనలు జారీ చేశారు. చదలవాడ రామన్నచెరువు కట్టను పరిశీలించి ఎప్పటికప్పుడు చెరువులోకి చేరిన వర్షపు నీటిని మోటార్లు ద్వారా బయటకు తరలించాలని అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులకు సూచించారు. కొత్తకోట, హనుమాపురం, ఉప్పుగుండూరు సమీపంలోని నాగన్నవాగు, మట్టిగుంట రోడ్డులోని వాగుకు వరదనీరు చేరడంతో రాకపోకలను నిలిపివేశారు. నాగులుప్పపాడులోని పునరావాసకేంద్రాన్ని పరిశీలించి బాధితులకు భోజనం వడ్డించారు. పోలీసు ప్రత్యేకాధికారి దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ రజియాసుల్తానా కనపర్తి పునరావాస కేంద్రం, వైద్యశిబిరాన్ని పరిశీలించారు. మేకల సోమయ్య పట్టపుపాలెం గ్రామస్థులను కనపర్తి జడ్పీ హైస్కూల్‌లో పునరావాస కేంద్రానికి తరలించారు. పోతవరంలోని చెన్నమనేని కృష్ణారావు రేకుల ఇంటిపై కొబ్బరి చెట్టు విరిగిపడి రేకులు దెబ్బతిన్నాయి. అధికారులు ఎక్స్‌కవేటర్,ట్రాక్టర్‌తో విరిగిన చెట్టును తొలగించారు. వరదనీరు వెళ్లే మార్గం లేక ఉప్పుగుండూరు అంబేద్కర్ కాలనీలోని లోతట్టు ప్రాంతం, మసీదు కాలనీ, చీర్వానుప్పలపాడు గ్రామంలోని బీసీ కాలనీలోకి వరదనీరు చేరింది. ఉప్పుగుండూరు గ్రామంలోని చెక్‌డ్యాం వద్ద వరి పొలాలను వరదనీరు ముంచెత్తింది. మాచవరం రోడ్డులోని పొలాల్లోకి పెద్దఎత్తున వరదనీరు చేరి చెరువులా మారాయి. ఈదురు గాలులలో కూడిన భారీ వర్షం ధాటికి విద్యుత్‌సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారీవర్షంతో చదలవాడ గ్రామంలోని రామన్నచెరువు నిండి తూర్పు వైపు కట్ట తెగి వరదనీరు పెద్దఎత్తున హైవేపైకి చేరింది. దాంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

'కొండపి'లో భారీ వర్షం

సింగరాయకొండలో కుండపోత..
11.8 సెం.మీ వర్షపాతం
ఇతర మండలాల్లోనూ భారీ వర్షం
లోతట్టు ప్రాంతాలు జలమయం.. ప్రజల అవస్థలు
ఈదురుగాలులతో విద్యుత్‌కు అంతరాయం
వణికిపోతున్న తీర ప్రాంతాల ప్రజలు

కొండపి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో కొండపి నియోజకవర్గంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రానికి సింగరాయకొండలో అత్యధికంగా 11.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొండపి, టంగుటూరు మండలాల్లో 4 సెం.మీ కురిసింది. జరుగుమల్లి, పొన్నలూరు, సింగరాయకొండ మండలాల్లో దంచికొట్టింది. భారీ వర్షాలతో పాటు ఈదురుగాలులు వీస్తున్నాయి. టంగుటూరు మండలంలోని ఆలకూరపాడు, జయవరం, పొందూరు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు.

● **పునరావాస కేంద్రాలకు తరలింపు..**

కొండపి మండలంలోని చినవెంకన్నపాలెంలో 30 మంది యానాదులను పునరావాస కేంద్రానికి చేర్చారు. చోడవరం, ముప్పవరం గ్రామాలకు వచ్చిన దాదాపు 70 మంది నారుమడుల కూలీలను ఆ గ్రామంలోని జడ్పీస్కూల్‌కు తరలించారు. కొండపిలో క్రరకోతకు వచ్చిన 30 మంది కూలీలను పునరావాస కేంద్రానికి చేర్చారు. ఇలవరలో ఇబ్బంది పడుతున్న 20 మంది యానాదులను జడ్పీస్కూల్‌కు తరలించారు. వారికి ఆహారం, ఇతర వసతులను తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రామాంజనేయులుకల్పించారు. టంగుటూరు మండలంలోని పలు పునరావాస కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి డీపీవో వెంకటేశ్వరరావు పరిశీలించారు.

● **కామేపల్లిలో చెరువు, కుంటకు జలకళ**

జరుగుమల్లి మండలం కామేపల్లికి ఆనుకుని ఉన్న చిన్నపాటిచెరువు, పక్కనున్న కుంట వర్షానికి మంగళవారం రాత్రికి నిండింది. రెండు నిండి వర్షపునీరు ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి చేరి పడమర వైపు గ్రామంలోకి ప్రవహించింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


సింగరాయకొండ పోలీస్‌స్టేషన్‌లో చేరిన వర్షపునీరు

● **సింగరాయకొండలో..**

సింగరాయకొండ : వర్షం దెబ్బకు ఆర్టీసీ బస్టాండ్, పోలీస్‌స్టేషన్ ప్రాంగణాల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. భైరాగిమాన్యం, అరుణా కాలనీ, పాతపోస్టాఫీస్ సెంటర్‌లోని పలు గృహాల్లో వర్షపు నీరు చేరింది. ప్రధాన రహదారిలో గాలుల ధాటికి భారీ వృక్షాలు నేలవాలడంతో వెంటనే ఎక్స్‌కవేటర్ల సహాయంతో పోలీసులు తొలగించారు. సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని అప్పాపురం ఎస్టీకాలనీ, ఊళ్లపాలెం పంచాయతీలోని బేసిన్‌పల్లెపాలెంలో వర్షపు నీరు భారీగా చేరింది. అప్పాపురంలోని గిరిజనులను పునరావాస కేంద్రానికి తరలించిన అధికారులు వారికి భోజనం ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండల ప్రత్యేక అధికారి, జడ్పీ సీఈవో చిరంజీవి, తహసీల్దార్ రాజేష్, సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర, ఇతర శాఖల అధికారులు తీరప్రాంత గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

● **వాగుల వద్ద హెచ్చరిక బోర్డులు**

జరుగుమల్లి (కొండపి), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రత్యేకాధికారి పార్థసారథి పర్యవేక్షణలో పైడిపాడు వద్ద పాలేరుపై, పచ్చవ వద్ద నల్లవాగుపై, దావగూడూరు-చింతలపాలెం మధ్య నక్కవాగు వద్ద, దావగూడూరు-చిర్రికూరపాడు గ్రామాల మధ్యచిర్రికూరపాడు-కె.ఉప్పలపాడు గ్రామాల మధ్యన ఉప్పువాగు చప్టా వద్ద రక్షణ చర్యలు తీసుకున్నారు. ప్రత్యేకాధికారితోపాటు తహసీల్దార్ పి.మురళి, ఎంపీడీవో రమణమూర్తి, ఎస్సై బి.మహేంద్ర పర్యవేక్షించారు.

● **పొన్నలూరులో..**

పొన్నలూరు : మండలంలో 6.65 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పొన్నలూరు చెరువుకు భారీగా నీరు చేరింది. ఉప్పలదిన్నె గ్రామంలోని నల్లవాగు పొంగడంతో రాకపోకలు నిలిచాయి. మండల ప్రత్యేక అధికారి సిహెచ్.సువార్త, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో పి.సుజాత, ఆయా శాఖల అధికారులంతా గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

● **మర్రిపూడిలో..**

మర్రిపూడి : మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం రాత్రి నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తోంది. ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ జనార్దన్, డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలి, ఎస్ఐ టి.రమేష్‌బాబు, ఎంపీడీవో జగదీష్ పలుగ్రామాలలో పర్యటించారు. అయ్యపురాజుపాలెంలో గిరిజనులను తహసీల్దార్ జనార్దన్ ఒప్పించి తంగెళ్లలోని పునరావాస కేంద్రానికి తరలించారు. వల్లాయిపాలెం, పొట్టిరెడ్డిపాలేల్లో వాగుల పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న పలు యానాది కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. కూచిపూడిలోని పునరావాస కేంద్రాలలో ఉన్న 57 మందికి రెండు రోజులుగా టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎర్రంరెడ్డి వెంకటరెడ్డి భోజన సదుపాయాలు కల్పించారు. కెల్లంపల్లి, పిన్నికవారిపల్లి, పన్నూరు, శివరాయునిపేట, కాకర్ల, రామాయపాలెం, చిమట చెరువులు అలుగులు పారుతున్నాయి. పందికుంటవాగు ఉధృతికి రోడ్డుకు గండిపడి రాకపోకలు స్తంభించాయి. గుండ్లసముద్రం, కెల్లంపల్లి, చిలంకూరు, కాకర్ల మధ్య వాగుల దెబ్బకు రాకపోకలు నిలిపేశారు. మర్రిపూడిలో మంగళవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.




కొండపిలోని ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వాన నీరు, ఈతముక్కల రోడ్డులో ఈతగాళ్లతో అధికారులు

తుఫాన్ ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని సీనియర్ ఐఏఎస్ అధికారి, జోనల్ స్పెషల్ ఆఫీసర్ సిసోడియా సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ గోపాలకృష్ణలతో భేటీ అయ్యారు.


స్పెషల్ ఆఫీసర్ సిసోడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల, పక్కన కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, రియాజ్

● **సిసోడియాను కలిసిన దామచర్ల**

జిల్లాకు వచ్చిన సీనియర్ ఐఎఎస్ అధికారి, జోనల్ స్పెషల్ ఆఫీసర్ సిసోడియాను ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ కలిశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అదే విధంగా దామచర్ల ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను కలెక్టర్ రాజాబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఒడా చైర్మన్ షేక్ రియాజ్ ఉన్నారు.

● **కొత్తపట్నంలో..**

కొత్తపట్నం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జోనల్ స్పెషలాఫీసర్, ఐఏఎస్ అధికారి సిసోడియా చెప్పారు. ఆయన కొత్తపట్నం పల్లెపాలెంలో పర్యటించారు. జేసీ గోపాలకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, లైజనింగ్ ఆఫీసర్ కళావతి, ఎంపీడీవో శ్రీకృష్ణ, తహసీల్దార్ శాంతి ఉన్నారు.

పంట కాలువను తలపిస్తున్న కొప్పోలు రోడ్డు

ఒంగోలు రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ఫ్లైఓవర్ వంతెన దిగువ నుంచి కొప్పోలు వరకు నాలుగు వరసల రోడ్డు పంట కాలువను తలపిస్తోంది. మంగళవారం సాయంత్రం ప్రవాహం ఉధృతంగా ఉండడంతో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు, కార్లను నిలిపివేశారు. రోడ్డుకిరువైపులా కాలనీల చుట్టూ 4అడుగుల లోతున నీరు నిల్వచేరింది. ఈ రోడ్డులో పదికాలనీలకు పైగా ఉన్నాయి.

● **దిగ్బంధంలో కొత్తమామిడిపాలెం**

ఒంగోలు నగరం-కొత్తమామిడిపాలెం రోడ్డులో గల చప్టాపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు స్తంభించాయి.

● **ముదిగొండి వాగు చప్టాపై రాకపోకలు నిషేధం**

కొప్పోలు నుంచి కరవది పోవు రోడ్డు గుత్తికొండవారిపాలెం దగ్గర గల ముదిగొండి వాగు చప్టాపై 4 అడుగులు లోతుపైగా వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిషేధించారు. తహసీల్దార్ నాయబ్ రసూల్ వాగును పరిశీలించారు.

● **దేవరంపాడు ఎస్సీకాలనీ వద్ద చప్టాపై వరద నీరు**

ఒంగోలు మండలం దేవరంపాడు నుంచి గుండాయపాలెం పోవు రోడ్డులో చప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తహసీల్దార్ రసూల్, ఎంపీడీవో రాజశేఖరరావులు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు.


వాగు పొంగడంతో నిలిచిన రాకపోకలు

భాగ్యనగర్‌లో ఇళ్లలోకి చేరిన నీరు


కాలువల్లో పూడిక తీస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని భాగ్యనగర్ నీట మునిగింది. ప్రత్యేకించి ఏకధాటిగా కురిసిన కుండపోత వానకు ఆ కాలనీ 3, 4 లైన్లలో పలు ఇళ్లలోకి నీరు చేరింది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. అలాగే వరదను దారిమళ్లించారు. ఇళ్లలోకి చేరిన నీటిని బయటకు పోసేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉంచితే పలు కాలనీల్లో ఇదే పరిస్థితి ఉంది.

నోడల్ ఆఫీసర్ల నియామకం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నడిచే 70 సచివాలయాలకు నోడల్ ఆఫీసర్‌లను నియమిస్తూ కమిషనరు కే వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయ పర్యవేక్షకులుగా వ్యవహరించే వీరి కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. నోడల్ ఆఫీసర్లపై అసిస్టెంట్ కమిషనరు, కార్యాలయ మేనేజర్ సూపర్ వైజింగ్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారు.

పునరావాస కేంద్రాలలో బిస్కట్ ప్యాకెట్ల పంపిణీ

ఒంగోలు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : నగరంలోని పునరావాస కేంద్రాలలోని ముంపు బాధితులకు మంగళవారం మాజీ సైనిక సంక్షేమ సంఘం నేతలు బిస్కెట్ ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు నెప్పలి నాగేశ్వరరావు, వెంకట్రావు, కరిచేటి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, దశరథరామయ్య సుమారు 700 ప్యాకెట్లను పంపిణీ చేశారు.

అంధకారంలో తీర ప్రాంత మండలాలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయి తీరప్రాంత మండలాల్లో అంధకారం నెలకొంది. మంగళవారం భారీగా కురిసిన వర్షంతో పాటు గాలులు వీయడంతో అనేక ప్రాంతాలలో విద్యుత్తు వైర్లు తెగిపడి ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కొత్తపట్నం, టంగుటూరు మండలాలో అన్ని తీరప్రాంత గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఒంగోలు నగరంలోని శివారు ప్రాంతాలలో విద్యుత్తు పూర్తిగా నిలిచిపోయింది. కొత్తపట్నం బస్టాండ్ ప్రాంతంలో విద్యుత్తుతీగలు తెగిపడ్డాయి. గాలి తగ్గితే విద్యుత్తు సరఫరా పునరుద్ధరిస్తామని ఎస్ఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

భారీవర్షాలకు అధికార యంత్రాంగం అప్రమత్తం

మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారయంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధమై ఉందని రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి చెప్పారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన ముందుగా కమాండ్ కంట్రోలు రూమును పరిశీలించారు. అనంతరం అక్కడ పనిచేస్తున్న తీరును కలెక్టర్ రాజాబాబు మంత్రికి వివరించారు. వర్షాలపై అధికారులతో సమీక్షించిన అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. తొమ్మిది రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నా జిల్లాలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అధికారయంత్రాంగం చేపట్టిన చర్యలు అభినందనీయమన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 65 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 2900 మందిని వాటిల్లోకి తరలించినట్లు తెలిపారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో 30 లోతట్టు కాలనీలు గుర్తించామన్నారు. కోస్తా మండలాల్లో 10 లోతట్టు ఆవాస ప్రాంతాలు ఉన్నాయన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ ఉన్నారు.

● **300 హెక్టార్లలో దెబ్బతిన్న పండ్లతోటలు**

తుఫాన్‌ప్రభావంతో జిల్లాలో సుమారు 300.80 హెక్టార్లలో పండ్ల తోటలు దెబ్బతిన్నట్లు ఉద్యానవనశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

● **'కొత్తపట్నం'కు ఆర్టీసీ బస్‌లు నిలిపివేత**

ముంథా తుఫాన్ నేపథ్యంలో కొత్తపట్నం మండలానికి ఆర్టీసీ బస్‌లను నిలిపేశారు. గుండమాల, పాదర్తి పల్లెపాలెం తదితర గ్రామాలకు బస్‌లు తిరగడం లేదు.

● **నేడు పొగాకు వేలం కేంద్రానికి సెలవు**

ఒంగోలు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభవంతో ఒంగోలు పొగాకు వేలం కేంద్రం 2లో ఈనెల 29వ తేదీ నిర్వహించనున్న వేలానికి సెలవు ప్రకటించినట్లు వేలం నిర్వహణాధికారి తులసి ఒక ప్రకటనలో తెలిపారు.

నగరంలో పర్యటించిన ఎమ్మెల్యే, ఎస్పీ

ఒంగోలు క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : నగరంలో నీట మునిగిన ప్రాంతాలను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజులు పర్యటించారు. సుజాతనగర్, సమతా నగర్‌తో పాటు పోలీసు శిక్షణా కళాశాలను సందర్శించారు. వరద నీటిని డ్రైనేజీలోకి పంపించే మార్గాలను మున్సిపల్ అధికారులతో చర్చించారు. కర్నూలు రోడ్డులోని వర్మ క్యాంటిన్ వద్ద ఉన్న డివైడర్‌ను పగలకొట్టి వరద నీటిని పోతురాజు కాలువ వైపు మళ్ళించారు.పీటీసీ కళాశాల ప్రిన్సిపల్ రాధిక, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, మేయర్ సుజాత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.


కాలనీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఏపీ మారిటైం సదస్సుకు స్పందన

ముంబయి సదస్సులో పాల్గొన్న చైర్మన్ సత్య


సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి, సత్య

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ముంబయిలో జరుగుతున్న ఇండియా మారిటైం వీక్ 2025 సదస్సులో మంగళవారం రాష్ట్ర మారిటైం బోర్డు ప్రత్యేక సదస్సుతో పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రయత్నం చేసింది. కేంద్ర ఓడరేవులు, షిప్‌లు, జలమార్గాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో మంగళవారం రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, పెట్టుబడి అవకాశాలను వివరించారు. రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సత్య మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాన్ని వివరిస్తూ పారిశ్రామికవేత్తలను ఏపీకి రావాలని కోరారు. వందకుపైగా దేశాలు, 500 మందికిపైగా పారిశ్రామికవేత్తలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఇండియాస్ మారిటైం గేట్ వే టు దిఈస్ట్(తూర్పునకు భారత దేశ సముద్ర ద్వారం) అనే నినాదంతో రాష్ట్రంలోని తీర ప్రాంతంలోని పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను ప్రతిబింబించే ప్రదర్శన ఇచ్చారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో మారిటైం ద్వారా పెట్టుబడిదారులకు ఇచ్చే ప్రోత్సాహకాలను సత్య వివరించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

» లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన
» తుఫాన్‌పై ప్రజలను, అధికారులను అప్రమత్తం చేసిన అశోక్‌రెడ్డి
» గిద్దలూరులో భారీ వర్షం

గిద్దలూరు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా గిద్దలూరు పట్టణంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మంగళవారం లోతట్టు ప్రాంతాలలో పర్యటించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రజలకు భరోసా ఇచ్చారు. అటు ప్రజలను, ఇటు అధికారులను ఆయన అప్రమత్తం చేశారు. ఉదయం నుంచి పలు ప్రాంతాలలో పర్యటిస్తూ అధికారులకు సూచనలు చేశారు. సోమవారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో సగిలేరు పరీవాహక ప్రాంతమైన శ్రీనివాస థియేటర్, పాతాళ నాగేశ్వరస్వామి దేవాలయం సమీపంలో లోతట్టు ప్రాంతాలలో, రాచర్ల రోడ్డులోని ప్రాంతాలను పర్యటించి ప్రజలతో మాట్లాడారు. పాత మిద్దెలను ఆయన పరిశీలించి ఇబ్బందికర పరిస్థితులు ఎదురైతే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందులో ఉండాలని వారికి సూచించారు. ప్రజలు ఎవరూ భయపడవద్దని, సహాయ చర్యలకు అధికార యంత్రాంగం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. సగిలేరువాగు ఉధృతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రజలకు ఎటువంటి అత్యవసరం ఉన్నా తనకు గాని, అధికారులకు గాని ఫోన్ చేయాలని ఆయన తెలిపారు. కృష్ణా థియేటర్ సమీపంలో సగిలేరు కాలువను పరిశీలించారు. 2వ వార్డులోని నరసింహస్వామి మెట్ల సమీపంలో నివాసం ఉంటున్న ప్రజల వద్దకు వెళ్లి పాత మిద్దెలలో నివాసం ఉంటున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బాలికల హైస్కూల్‌లో పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, అర్బన్ సీఐ కె.సురేష్, పలుశాఖల అధికారులు, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు ఉన్నారు. కలెక్టర్‌కు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తుఫాన్ పరిస్థితులను వివరించారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

మొంథా తుఫాన్ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఆంజనేయరెడ్డి తెలిపారు. తుఫాన్ సహాయం కోసం 24 గంటలు గ్రామ రెవిన్యూ అధికారులు, గ్రామసహాయకులు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాలలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కె.సీతారామారావు తెలిపారు. సమస్యలు ఏర్పడితే 7013991331, 9491142161 ఫోన్ చేసి తెలిపాలన్నారు.

గిద్దలూరు ప్రాంతంలో మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. సోమవారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లులతో మొదలైన తుఫాన్ అర్థరాత్రి నుంచి మోస్తరుగా కురుస్తున్నది. మంగళవారం ఉదయం నుంచి భారీ వర్షపాతం నమోదైంది. సాయంత్రానికి కుండపోతగా వర్షం కురుస్తున్నది. ఈదురు గాలులు, చలి ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై జనసంచారం లేకపోవడంతో దుకాణాలన్నీ మూతపడ్డాయి.



లోతట్టు ప్రాంతాలలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

లోతట్టు ప్రాంతాలవారు అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం వన్‌టౌన్ : మొంథా తుఫాన్ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను మంగళవారం ఆయన పర్యటించి పలు సూచనలు చేశారు. తుఫాన్ విపత్కర పరస్థితులను మున్సిపల్ యంత్రాంగంతో కలిసి ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వార్డులలో శిథిలావస్థలో ఉన్న మట్టి మిద్దెలను గుర్తించి అక్కడి వారు పునరావస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన కంట్రోల్ కార్యాలయానికి తెలపాలన్నారు.

పొదిలి : పొదిలి తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కృష్ణారెడ్డి తెలిపారు. ప్రభావిత గ్రామాలలో అధికారులు అందుబాటులో ఉంటారని ఇబ్బందులు ఎదురైతే వెంటనే 9951423490, 8499908491, 9581020408 నెంబర్లకు సంప్రదించాలని చెప్పారు.

పునరావాస కేంద్రానికి 30 మంది చెంచులు

మండలంలోని పెద్దనాగులవరం గ్రామానికి చెందిన చెంచు గిరిజనులను అధికారులు మంగళవారం రాత్రి పునరావాస కేంద్రానికి తరలించారు. గ్రామానికి చెందిన చెంచుల గృహాలు వర్షానికి తడిసి ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయి. వర్షానికి నాని ప్రమాదం జరిగే అవకాశం ఉన్నట్లు గుర్తించిన అధికారులు వారందరినీ గ్రామంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించి ఆహార పదార్థాలను అందించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, ప్రత్యేకాధికారి సత్యనారాయణ, తహసీల్దార్ కె.చిరంజీవి, ఎంపీడీవో బాలచెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కొనకనమిట్ల : మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం రాత్రి నుంచి ఈదురగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మంగళవారం తహశీల్దార్ ఆవుల సురేష్, ఎంపీడీవో ఈశ్వరమ్మ పలు గ్రామాలలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. గొట్లగట్టు పంచాయతీలోని నాయుడిపేట పాఠశాలలో 12 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. నాగరాజకుంట గ్రామంలో నాలుగు ఎస్టీ కుటుంబాలకు పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించి భోజన వసతిని ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాలతో గ్రామాల్లో తిరిగి ప్రజలకు జాగ్రత్తలు తెలిపారు. తన్నీరువారిపల్లి- పేరారెడ్డిపల్లి గ్రామాల పెద్దమ్మకుంట వాగును అధికారులు పరిశీలించారు. వాగు ఉధృతిగా ప్రవహిస్తుండడంతో ప్రజలు వెళ్లొద్దని సూచించారు.



పెద్దనాగులవరంలోని పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

పెద్ద దోర్నాల : తహసీల్దార్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస ప్రసాద్ అధికారులతో మంగళారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎక్కడ సమస్యలు ఎదురైనా వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని శ్రీనివాసప్రసాద్ సూచించారు. చెరువులు, కాలువల ఉధృతిని పరిశీలించాలని, వాహనరాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీవో నాసర్ రెడ్డి, ఎస్సై మహేష్, విద్యుత్తు ఏఈ భీమానాయక్, ఎంఈవో మస్తాన్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు : మొంథా తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అధికారి గోపీచంద్ అన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఎంపీడీవో వి.సంజీవరావుతో కలిసి మండలంలోని చెరువులు, గిరిజన గూడెంలలో పర్యటించారు. చిన్నకండ్లేరు చెరువు కట్ట, తూమును పరిశీలించి ఇరిగేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. వారితోపాటు ఎంపీడీవో సంజీవరావు, ఇరిగేషన్ ఏఈ కిరణ్ ఉన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : అటవీ ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ డీ మంజూనాథరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గండిచెరువు, పునరావస కాలనీ, గుడిపాడు, వైపాలెంలోని పలు కాలనీల్లో మండల ప్రత్యేకాధికారి పోలిరెడ్డితో కలసి పర్యటించారు. వారివెంట ఆర్ఐ సర్దార్, వీఆర్వోలు నాసర్‌వలీ, పొతులూరయ్య ఉన్నారు.

మండలంలో 45.2మి.మీ వర్షం

రాచర్ల : తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల సమయానికి మండలంలో 45.2మి.మీ వర్షపాతం నమోదైందని ఏఎస్‌వో షేక్ మున్వర్ తెలిపారు. రాత్రికి అధిక శాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ప్రజలు సమస్యలు ఏమైనా ఉంటే 9948897397, 9618374099, 7674809078 చెప్పాలని సూచించారు.



రోడ్డు పమరమ్మతు చేయిస్తున్న అధికారులు

ఆర్అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు

బేస్తవారపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండలంలోని కోనపల్లె ఆర్అండ్‌బీ రోడ్డు అక్కపల్లె - గలిజేరుగుళ్ల వద్ద రోడ్డు కోతకు గురై నీరు రోడ్డుపై నిలబడ్డంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ విషయమై ఈనెల 14వతేదిన ఆంధ్రజ్యోతిలో ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానం శీర్షికన వచ్చిన వార్తపై అధికారులు స్పందించారు. మంగళవారం రోడ్డును పరిశీలించి ఎక్స్‌కవేటర్‌తో మురుగు నీరు పోయేలా చర్యలు చేట్టావు. తాత్కాలిక రోడ్డును నిర్మించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పానకాలరావు, తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీవో రంగనాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నుంచి బయటకు రావద్దు

ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను తీవ్రత దృష్ట్యా నియోజకవర్గంలోని ప్రజలు అత్యవసరమైతే తప్పితే ఇళ్లలోంచి బయటకు రావద్దని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచించారు. తుఫాన్ నేపథ్యంలో ఇప్పటికే నియోజకవర్గంలోని అధికారులకు తగిన సూచనలు ఆయన చేశారు. అంతేకాక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆపద సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి చిన్నపాటి ఇబ్బంది ప్రజలకు తలెత్తినా వెంటనే రంగంలోకి దిగి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలలోని వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు.

గుండ్లకమ్మపై రాకపోకలు నిలిపివేత

మార్కాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మండల పరిధిలో గుండ్లకమ్మ నదిపై రాకపోకలను పోలీసు అధికారులు నిలిపివేశారు. ప్రధానంగా మండలంలోని బొడిచెర్ల, పెద్దనాగులవరం సమీపాల్లో గుండ్లకమ్మ నదిపై లోలెవల్ బ్రిడ్జిలు ఉన్నాయి. గుండ్లకమ్మ ఉధృతి నేపథ్యంలో బ్రిడ్జిల పైనుంచి నీరు ప్రవహిస్తోంది. మంగళవారం రాత్రికి ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపారు.

డిక్టేషన్ పోటీలు

గిద్దలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో బాలబాలికలకు డిక్టేషన్ పోటీలను నిర్వహించారు. వివిధ అంశాలపై పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కిశోర్, కార్యదర్శి ఫరూఖ్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

గిద్దలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో జరిగిన ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో పట్టణంలోని స్ప్రింగ్ బోర్డు పాఠశాల, సిద్ధార్థ స్పోర్ట్స్ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనపరిచారు. వివిధ విభాగాలలో 6 మంది బంగారు, ముగ్గురు కాంశ్య, ఇద్దరు రజత పథకాలను సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ జేవీ నారాయణ, ప్రిన్సిపాల్ శ్వేత విద్యార్థులను అభినందించారు.

గర్భిణులకు జాగ్రత్తలు

పొదిలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని సీడీపీవో మారుతి సూచించారు. వర్షాలు కురుస్తుండడంతో డెలివరీ డేట్‌కు ముందుగానే గర్భిణులు ఆసుపత్రిలో చేరాలని సూచించారు. వారి పరిస్థితిని అంగన్‌వాడీలు రోజూ తెలుసుకోవాలన్నారు. తక్షణ వైద్య సాయం కోసం వెంటనే సీహెచ్‌సీ కేంద్రాలకు వెళ్లాలని తెలిపారు.

తహసీల్దార్ తీరుపై టీడీపీ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

కొనకనమిట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ ఆవుల సురేష్ తీరును నిరసిస్తూ మంగళవారం టీడీపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అష్టకష్టాలు పడి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చామని, అయితే ప్రజలకు సేవ చేయడంలో వెనుకబడి పోయామని టీడీపీ మండల నాయకులు తహసీల్దార్‌పై మండిపడ్డారు. టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు తహసీల్దార్‌ను కలిసి వివరణ కోరేందుకు వచ్చారు. అయితే మొంథా తుఫాన్ కారణంగా తహసీల్దార్ గ్రామాలలో పర్యటిస్తుండగా నాయకులు కార్యాలయం ముందు నిరసనకు దిగారు. సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు పనులు చేయకుండా సమయాన్ని వృథా చేస్తున్నారని అన్నారు. అర్జీలను పరిష్కరించకుండా పదేపదే తిప్పుతున్నార్నారు. మ్యుటేషన్, కులధ్రువీకరణ ఇతర అవసరాలకు వచ్చే వారికి వారానికో సమస్య చెప్పి వెనక్కి పంపుతున్నారన్నారు. వీఆర్వో, ఆర్ఐ లబ్ధిదారులు, గ్రామస్థులను విచారించి ఫైల్ ఇచ్చినా పని చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల అలసత్వ తీరుతో గ్రామాల్లో తిరగలేని పరిస్థితి తమకు ఎదురవుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోరబోయిన బాబూరావు, నాయకులు తాతిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, కనకం నరసింహారావు, పరిటాల సుబ్బయ్య, పెరికే సుఖదేవ్, భాషపతి, కుందురు కాశిరెడ్డి, ముప్పా కాటంరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జాం

» నల్లమలలో ప్రవహిస్తున్న వాగులు
» నిలిచిన వాహనాలు

పెద్ద దోర్నాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం - దోర్నాల ఘాట్ రోడ్డులో మంగళవారం సాయంత్రం ట్రాఫిక్ జామ్ అయింది. సాయంత్రం 6గంటల నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తుఫాన్ కారణంగా నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తోన్న భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. తుమ్మలబైలు, చింతల సమీపంలో పల్లం ప్రాంతంలోని చిన్నపాటి బ్రిడ్జిలపై వరద ప్రవహిస్తుండడంతో వాహనాలు నిలిపోయాయి. ఎస్ఐ మహేష్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రాత్రి 9గంటలు దాటితే శ్రీశైలం వెళ్లేందుకు అనుమతులు లేవు. దీంతో దోర్నాలలోనే వాహనాలు నిలిపివేస్తారు.

మట్టి మిద్దె ఇళ్లల్లో ఉండొద్దు

బేస్తవారపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. మట్టి మిద్దె ఇళ్లల్లో ఉండవద్దని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. సలకలవీడులో పాతబడిన మట్టిమిద్దెలలో నివాసం ఉంటున్న వారిని తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీవో రంగనాయకులు ఖాళీ చేయించారు. కార్యక్రమంలో వీఆర్వో చెన్నమ్మ,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



బాపూజీ కాలనీలో గుడిసె వాసులతో మాట్లాడుతున్న తెలుగు యువత నాయకులు

లోతట్టు ప్రాంతాల్లో తెలుగు యువత పర్యటన

మార్కాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో పట్టణంలోని లోతట్టు ప్రాంతాల వారిని తెలుగు యువత నాయులు అప్రమత్తం చేశారు. ప్రధానంగా గుండ్లకమ్మతోపాటు, చెరువు సప్లై చానల్ పరిసరాల్లో ఉండేవారికి తగు సూచనలు చేశారు. వర్షం ఎక్కువైతే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ తెలుగు యువత అధ్యక్షులు దొడ్డ దుర్గేష్‌రెడ్డి, 15, 16వ వార్డుల టీడీపీ ఇన్‌ఛార్జిలు ఓబినబోయిన రామాంజనేయులు, చల్లగాలి విద్యాసాగర్, నారాయణ, దుద్దుకూరి అల్లూరయ్య పాల్గొన్నారు.

పంటల పరిశీలన

పొదిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పొదిలి మండలంలో తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పంటలను ఏవో దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 241 హెక్టార్లలో సజ్జ, 13.5 హెక్టార్లలో పత్తికి నష్టం వాటిల్లిందని చెప్పారు. రెండ్రోజులు వానలు కురిసే అవకాశముండడంతో రైతులు జాగ్రత్తగా ఉండాలని ఏవో సూచించారు.

కొనకనమిట్ల : మొంథా తుఫాన్‌తో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి ప్రకాష్‌రావు అన్నారు. మండలంలో 18 రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ సిబ్బందితో తుఫాన్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. పంట నష్టం జరిగితే తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వానలు ఇంకా కురిస్తే పత్తి పూర్తిగా దెబ్బతింటుందని చెప్పారు. మినుము, అలసంద కూడా దెబ్బతింటాయన్నారు.

పంటల్లో నిలిచిన నీటెని బయటకు పంపండి

జిల్లా ఉద్యానశాఖ అధికారి సూచన

త్రిపురాంతకం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా పంట పొలాల్లో నిలిచిన నీరు ఎప్పటికప్పుడు బయటకు పంపుకుంటే చాలావరకు పంటలను కాపాడుకోవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్ రైతులకు సూచించారు. మంగళవారం త్రిపురాంతకం, ఎర్రగొండపాలెం మండలాల్లోని సోమేపల్లి, గురిజేపల్లి గ్రామాల్లో ఆయన పంటలను పరిశీలించి రైతులకు తగు జాగ్రత్తలు వివరించారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 25,500 ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారని 2500 ఎకరాల్లో బొప్పాయి, 900 ఎకరాల్లో అరటి సాగు చేశారని చెప్పారు. వీటిలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వర్షాలు తగ్గిన తరువాత 19:19:19 లేదా 13-0-45 లేదా యూరియా వంటి పోషకాలను పంటలపై పిచికారి చేసుకోవాలని చెప్పారు. మిర్చి మొక్కలు పడిపోయినట్టయితే వాటిని వెంటనే మొక్కలకు మట్టి ఎగదోసి నిలబెట్టి కాపాడుకోవాలన్నారు. తుఫాన్ ప్రభావం తగ్గిన తరువాత పంటనష్టం వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని ఆయన చెప్పారు.

అవసరమైతే తప్ప బయటకు రావొద్దు

రాచర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అవసరమైతే తప్ప ప్రజలు ఎవరు బయటకు రవద్దని ఎంపీడీవో ఎస్ వెంకట రామిరెడ్డి, టీడీపీ మండల నాయకుడు అంబవరం శ్రీనివాసరెడ్డి అన్నారు. తుఫాన్ నేపథ్యంలో మంగళవారం అనుములవీడులో పర్యటించారు. మట్టి మిద్దెలో నివశించేవారు వీలైనంతవరకు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్, ఏఎస్సై శ్రీనివాసరావు, కార్యదర్శి గణేష్, వీఆర్వో కిషోర్ కుమార్, సర్పంచ్ లతీఫ్, నాయకులు కృష్ణారెడ్డి, వి శివరామిరెడ్డి, సంజయ్, దివాకర్, మున్ని, ఆంజనేయులు, గఫూర్ పాల్గొన్నారు.



గ్రామాల్లో పర్యటిస్తున్న నాయకులు, అధికారులు

కటకానిపల్లెలో వరద నీరు మళ్లింపు

ఎరిక్షన్‌బాబు సూచనతో కదిలిన అధికారులు

పెద్ద దోర్నాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు కొండల నుంచి వచ్చే వరద నీటిని వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ అధికారులు మంగళవారం మళ్లింపు చర్యలు చేపట్టారు. పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నల్లమల అటవీ ప్రాంతం నుంచి, కొండల నుంచి వచ్చిన వరద నీరు ఫీడర్ కెనాల్‌కు చేరి నల్లమల నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు చేరే పరిస్థితులు లేక గండ్లు పడి పంట పొలాలపై ప్రవహిస్తున్నాయి.



కటకానిపల్లె వద్ద కొండల నుంచి వచ్చే వరద నీటిని చెరువుకు మళ్లించేలా కాలువను తీస్తున్న ఎక్స్‌కవేటర్

దీంతో సాగు చేసిన పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయి. ఇంతలోనే మళ్లీ మొంథా తుఫాన్ ఏర్పడిన క్రమంలో వాననీరు ఫీడర్ కెనాల్‌కు చేరకుండా సమీపంలోని చెరువుకు మళ్లించాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మండల రైతు సంఘం అధ్యక్షుడు రావెళ్ల సత్యనారాయణ టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. దీంతో ఫీడర్ కెనాల్ డీఈలు నరసింహారెడ్డి, సెరియాన్ ఏఈ రవి, డిప్యూటీ తహసీల్దార్ సాలమ్మ, వీఆర్వో సామేలు, కార్యదర్శి వెంకటేశ్వర్లు దగ్గరుండి ఎక్స్‌కవేటర్‌తో వరద నీటిని చెరువుకు మళ్లించారు.

రాములోరి గోవు మృతి

ఊరేగించి.. అంత్యక్రియలు

పొదిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పొదిలి మండలంలోని ఈగలపాడు గ్రామంలో 16 సంవత్సరాల కిందట రాములవారి ఆలయానికి ఇచ్చిన గోవు కార్తీక సోమవారం అనారోగ్యానికి గురై మంగళవారం మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ఈగలపాడుకు చెందిన సూరె పెదరామిరెడ్డి సుమారు 16 సంవత్సరాల కిందట ఒక గోవును రాములోరి గుడికి ఇచ్చారు. అప్పటి నుంచి గ్రామస్థులతో కలియదిరుగుతున్న ఆవు మృతిచెందడంతో అందరూ కంటతడిపెట్టారు. మరో గోవును ఆలయానికి ఇస్తామని తెలిపారు. జోరు వానను లెక్కచేయకుండా గోవును ఊరేగింపుగా తీసుకెళ్లి శాస్త్రబద్ధంగా అంత్యక్రియలు జరిపించారు.



గోవును ఊరేగింపుగా అంత్యక్రియలకు తీసుకెళ్తున్న ప్రజలు

గండి చెరువు కాలువ పనులు ప్రారంభం

» కలెక్టర్ ఆదేశాలతో నిర్వహణ
» సప్లై చానల్ సరిగ్గా లేక పంట పొలాల్లోకి చేరిన నీరు
» ఆందోళనలో రైతులు

పెద్ద దోర్నాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద బొమ్మలాపురం గండి చెరువు నుంచి కాలువ నిర్మాణ పనులను ఇరిగేషన్ అధికారులు మంగళవారం ప్రారంభించారు. మండలంలోనే అతి పెద్ద గండి చెరువుకు ఈ ఏడాది పూర్తి స్థాయిలో నీరు చేరింది. అయితే మొంథా తుఫాన్ కారణంగా కురిసే భారీ వర్షాలకు మరింత వరద చేరే అవకాశం ఉందని, చెరువుకు ఎలాంటి ప్ర మాదం వాటిల్లకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా తూము ఎత్తి కొంత భాగం నీటిని కిందికి విడుదల చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఇరిగేషన్ అధికారులు సోమవారం తూము ఎత్తడంతో పంట కాలువలు పూడిపోయి అస్తవ్యస్తంగా ఉండడంతో చెరువు నుంచి విడుదల చేసిన నీరు పంట పొలాలపై ప్రవహించింది. దీంతో సుమారు వంద ఎకరాల్లో బొప్పాయి, అరటి, మిరప తదితర పంటలు నీటి మునకలో దెబ్బతిన్నాయి. గమనించిన రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో సంబంధిత ఏఈ వెంకటరామిరెడ్డి వెంటనే తూము కట్టేసి పంట కాలువలు బాగు చేయించి నీటిని వాగుకు వదిలారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



గండిచెరువు నుంచి తీస్తున్న కాలువ

చెరువులకు గండ్లు పడకుండా చూడాలి

రాచర్ల : చెరువులకు, తూములకు గండ్లు పడకుండా చూడాలని గిద్దలూరు ఇరిగేషన్ శాఖ డీఈ చెంచు రామారావు అన్నారు. మంగళవారం ఆయన నీటి సంఘం అధ్యక్షులు, గ్రామ రైతులతో కలిసి గుడిమెట్ట శంకరుని చెరువు, పాలకవీడు సర్కార్ పెద్ద చెరువును పరిశీలించారు. తుఫాన్ తీవ్రత అధికంగా ఉండడంతో నీటి ఉధృతి ఎక్కువైతే చెరువులకు, తూములకు గండ్లు పడే ప్రమాదం ఉందని, వాటి నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు సహకరించాలని కోరారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

చెరువుకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలి

మార్కాపురం : మార్కాపురం చెరువుకు నీరు చేరేలా అన్ని చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడుతున్న నేపథ్యంలో గుండ్లకమ్మ నది ప్రవాహం, మార్కాపురం చెరువుకు సప్లై చానల్ ద్వారా పారుతున్న నీటిని మంగళవారం తనిఖీ చేశారు. ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. మండలంలోని మాల్యవంతునిపాడు గ్రామ సమీపంలోని చెక్‌డ్యామ్ వద్దకు చేరుకుని నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అక్కడ నుంచి సప్లై చానల్‌కు నీరు ఏ విధంగా వస్తోందో గమనించారు. ముఖ్యంగా అక్కడ ఉన్న లాకులను తనిఖీ చేశారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు వర్షాలు బాగాన కురిసినా చెరువుకు పెద్దగా నీరు చేరలేదన్నారు. వచ్చే వేసవిలో పట్టణ ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే గుండ్లకమ్మ నీటిని సాధ్యమైన మేర చెరువుకు చేరేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ నాగ వినోద్, మార్కాపురం చెరువు సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు దగ్గుల శ్రీనివాసరెడ్డి, టీసీ మెంబర్ చిట్యాల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



గుండ్లకమ్మను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

‘మొంథా’తో అతలాకుతలం

- ఎడతెరిపిలేని ఈదురు గాలులతో వర్షం
- జనజీవనానికి తీవ్ర ఇబ్బందులు
- పొలాల్లోకి చేరిన నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు



దర్శి-కురిచేడు రోడ్డులో శివరాజ్‌నగర్ వద్ద కూలిన చింతచెట్టు



దర్శి: పత్తి పైరులో నిలబడిన వర్షపునీరు



పామూరు: భైరవకోనలోని శ్రీత్రిముఖదుర్గాంభ ఆలయం వద్దకు చేరిన వరదనీరు

దర్శి, అక్టోబరు, 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో దర్శి ప్రాంతంలో మంగళవారం ఎడతెరపి లేకుండా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం జల్లులు పడుతూనే ఉన్నాయి. దీంతో జనజీవనంకు అంతరాయం కల్గింది. ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేదు. వర్షాలకు పంట పొలాల్లోకి భారీగా నీరు చేరటంతో ఉరకెత్తుతున్నాయి. ఆరుగాలం కష్టించి లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు నీటి పాలవుతుండటంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పత్తి పంటదశలో ఉంది. కాయలు పగిలి పత్తి తీసే సమయంలో తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడటంతో పొలాల్లోకి నీరుచేరి చెట్లు చనిపోతున్నాయి. పత్తి కాయల్లోకి నీరుచేరి రంగు మారి పనికిరాకుండా పోతుంది. వైట్ బర్లీ పొగాకు అధిక వర్షానికి ఉరకెత్తి దెబ్బతింటుంది. మిర్చి, కంది పంటలు కూడా ఉరకెత్తుతున్నాయి. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడటంతో పాటు పంటలు సానుకూలంగా ఉన్నాయని రైతులు ఆనందిస్తున్న తరుణంలో తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలకు దెబ్బతింటున్న పంటలను ఏడీఏ బాలాజీనాయక్, వ్యవసాయాధికారి కె.రాధ మంగళవారం పరిశీలించారు. కంది, పొగాకు పంటల్లోకి నీరు చేరిన ప్రదేశాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పొలాల్లోకి చేరిన నీటిని వెంటనే గండ్లు పెట్టి బయటకు పంపాలని సూచించారు. అధిక తేమకు పంట దెబ్బతినకుండా ఉండేందుకు యూరియా, సల్పేట్ పిచికారీ చేయాలని సూచించారు.

భారీ వర్షం, ఈదురు గాలులకు దర్శి-కురిచేడు రోడ్డులోని శివరాజ్‌నగర్ వద్ద చింతచెట్టు రోడ్డుపై విరిగిపడింది. దీంతో పొదిలి, వినుకొండ ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు అంతరాయం కల్గింది. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, అధికారులు హుటాహుటీన అక్కడకు వెళ్లి వెంటనే చెట్టును తొలగించారు. పొతకమూరులో పాత ఇల్లు వర్షాలకు కూలింది. ఆ ఇల్లు ఎంతో కాలంగా పాతపడిపోవటంతో ఎవరూ నివాసం ఉండటం లేదు. అన్నిశాఖల అధికారులు అప్రమత్తమై నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంతాలకు నీరుచేరితే ప్రజలను తరలించేందుకు స్థానిక ప్రభుత్వ కాలేజీలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

చెరువులను పరిశీలించిన అధికారులు

పామూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తుందని మండల ప్రత్యేకాధికారి రవితేజ అన్నారు. మండలంలోని మోపాడు రిజర్వాయర్, రేణిమడుగులోని నెరేళ్లవాగు, నాసవాగు, మన్నేరు వాగులతో పాటు, పామూరు పాత చెరువు, బోడవాడ, మాలకొండాపురం, రేణిమడుగులో అలుగు పారుతున్న చెరువులను మండలస్థాయి అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. మోపాడు రిజర్వాయర్‌లో గతంలో 9 అడుగులమేర నీటిమట్టం ఉండగా, ప్రస్తుతం 12 అడుగులకు చేరిందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.సీఐ బీమానాయక్, ఎస్ఐ కిశోర్‌బాబులు మండలంలోని రేణిమడుగు, మోపాడు, పామూరు ఎస్టీ కాలనీల్లో పర్యటించారు. సీఎస్‌పురం మండలంలోని కేజీబీవీలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి టి.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ షేక్ మహ్మద్‌హుస్సేన్, వెంకటేశ్వరనాయక్‌లు పరిశీలించారు. డొక్కలవాగు నీటి ప్రవాహాన్ని, లోతట్టు ప్రాంతాలను టీడీపీ మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, సింగిల్‌విండో చైర్మన్ సీహెచ్ వెంకటరెడ్డి పరిశీలించారు. పామూరు పాత చెరువు అలుగును నీటి సంఘం చైర్మన్ పాలపర్తి రమణయ్య, అంచూరి వెంకటరెడ్డి పరిశీలించారు. సహాయక చర్యల పరిశీలన కార్యక్రమాల్లో తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, యరవ శ్రీనువాసులు, అమీర్ బాబు, వీరబాబు, ఇర్రి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పామూరు: మోపాడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న అధికారులు



కనిగిరి: జమ్మలమడక గ్రామానికి వెళ్ళే మార్గంలో వాగుపై ప్రవహిస్తున్న నీరు

కనిగిరిలో 5సెం.మీ వర్షపాతం

కనిగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో కనిగిరి నియోజకవర్గంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుంది. కనిగిరి మండలంలో 5 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి మంగళవారం పామూరు, వెలిగండ్ల, కనిగిరి మండలాల్లోని వివిధ గ్రామాలను పరిశీలించారు. కనిగిరి మండలంలోని బల్లిపల్లి గ్రామ ఎస్టీ కాలనీలో సంచారజాతుల వారిని స్థానిక హైస్కూల్‌కు తహసీల్దార్ జయలక్ష్మి ఆధ్వర్యంలో తరలించే ఏర్పాట్లుచేశారు.

ఎడతెరపి లేకుండా కురుస్తున్న నాన్పుడు వానకు కనిగిరి మండలంలోని బొమ్మిరెడ్డి పల్లిలో రాణెమ్మకు చెందిన సిమెంట్ బ్రిక్స్ ఇల్లు కూలిపోయింది. అధికారుల బృందం ఆ గ్రామానికి వెళ్ళి వారిని సమీప గృహంలో ఉండేవిధంగా ఏర్పాట్లుచేశారు. టీడీపీ నాయకులు కొండాకృష్ణారెడ్డి, పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, బాలు ఓబులురెడ్డిలు బాధిత కుటుంబానికి రూ.10 వేలు నగదు అందజేశారు. పట్టణ సమీపంలోని శంఖవరం ఎస్సీ కాలనీలోని సిద్దా లక్ష్మీదేవి, కుడాలి చెన్నమ్మలకు చెందిన ఇంటి గోడలు పడిపోయాయి. తహసీల్దార్ వారిని పునరావాస కేంద్రానికి తరలించారు. వర్షానికి జమ్మలమడక గ్రామ సమీపంలోని వాగు పొంగి పొర్లుతుంది. దీంతో గ్రామానికి వెళ్లేందుకు రాకపోకలు స్తంభించాయి.

మండలంలోని పునుగోడు, తాళ్లూరు, బొమ్మిరెడ్డి పల్లి గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. ఏడీఏ జైనులాబ్దిన్ వ్యవసాయశాఖ సిబ్బంది నీటమునిగిన పంటలను పరిశీలించి రైతులకు పలుసూచనలుచేశారు. పట్టణ సమీపంలోని కాశిరెడ్డికాలనీలో ఉంటున్న సంచారజాతులను ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ జయలక్ష్మి, మున్సిపల్ కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డిలు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. మున్సిపల్ చైర్మన్ గఫార్, సిబ్బంది, ఉపాధ్యాయులు వారికి భోజనవసతి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కమిషనర్ కృష్ణమోహనరెడ్డి పట్టణంలోని నాగులచెరువు, పెద్దచెరువు అలుగు వాగులను పరిశీలించారు. శివనగర్‌కాలనీలో అలుగువాగు, పట్టణంలోని ఆర్టీసీ డిపో డౌన్‌లోని వాగు చప్టాకు అడ్డుపడిన పూడికను తొలగించే ఏర్పాట్లు చేపట్టారు.



వెలిగండ్ల: పూలికుంట్ల చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి



వరద నీటి ప్రవాహ ఉధృతి ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

అధికారులను అప్రమత్తం చేసిన డాక్టర్ ఉగ్ర

కనిగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏ ఆపద వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. తుఫాన్ ప్రభావం కనిగిరి ప్రాంతంలో మంగళవారం రాత్రి నుంచి పెరిగే అవకాశం ఉందని తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి గుంటూరు నుంచి హుటాహుటీన బయలు దేరి మంగళవారం రాత్రి 9 గంటలకు కనిగిరి చేరుకున్నారు. వెంటనే శంఖవరం, ఒంగోలు బస్టాండు సమీప ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో నీటి ప్రవాహ పరిస్థితిని తెలుసుకున్న ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. ముంపు ప్రాంతాల పరిస్థితిపై మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డితో చర్చించారు. కందుకూరు రోడ్డు సమీపంలోని నివాసాలు, శంఖవరం గ్రామంలోని లోతట్టు ప్రాంతాలను వర్షానికి తడుస్తూ డాక్టర్ గ్రు పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలలోని డ్రైనేజీ కాలువల్లో పూడిక లేకుండా చూడాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్‌కు సూచించారు. ఎమ్మెల్యే వెంట కూటమి నేతలు ఫిరోజ్, మున్సిపల్ కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి, బుల్లాబాలబాబు తదితరులు పాల్గొన్నారు.

పూలికంట్ల చెరువును పరిశీలించిన అధికారులు

వెలిగండ్ల, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో మంగళవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో మండలంలోని పూలికుంట్ల, రామలింగాపురం, ఇమ్మడిచెరువు గ్రామాల్లో చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. పూలికుంట్ల చెరువు నిండి ప్రమాదకర స్థాయిలో ఉండటంతో గ్రామస్థులు అధికారులకు సమాచారం అందించారు. ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో మహబూబ్ భాషా, తహసీల్దార్ వాసు, సీఐ భీమానాయక్, ఎస్ఐ కృష్ణపావని చెరువును పరిశీలించారు. ప్రమాదం లేదని, గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలో అతి పెద్ద రిజర్వాయర్ అయిన పందువ గండి పూర్తిస్థాయి నీటిమట్టం 22 అడుగులు కాగా, ప్రస్తుతం 18 అడుగులకు చేరింది. మరపగుంట్ల గ్రామంలో వర్షానికి తడిసి గోడకూలి దూడ మృతిచెందింది. వెలిగండ్ల బీసీ కాలనీలో గాలికి భారీ వృక్షాలు నేలకూలాయి. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

ముండ్లమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్‌చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మక్కెనవారిపాలెం, పూరిమెట్ల మధ్య ఉన్న ఈదర వాగును అధికారులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించటం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంటలు నష్టపోయిన రైతుల వివరాలు కూడా వెంటనే సేకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఆర్.జనార్దన్, పంచాయతీ కార్యదర్శి వేణు, ఎంపీటీసీ చింతపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో నేతలు

కనిగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలతో కూటమి నేతలు మొంథా తుపాను బాధితులకు అండగా నిలుస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు. మండలంలోని చిన్నఇర్లపాడు పంచాయతీ పరిధిలోని కంఠంవారిపల్లి గ్రామంలో పనుల కోసం గుడ్లూరు ప్రాంతం నుంచి వచ్చిన వలస వాసులకు కూటమి నేతలు సిద్దాటపు వెంకటరెడ్డి, వడ్డెంపూడి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పునరావాసం కల్పించారు. గ్రామంలోని సచివాలయంలో వారికి పునరావాసం కల్పించి భోజనవసతి కల్పించారు. మండలంలోని గుడిపాడు పంచాయతీ పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో రాణెమ్మకు చెందిన ఇల్లు తుఫాన్ కారణంగా కూలిపోయింది. విషయం తెలుసుకున్న మండలపార్టీ అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డి మండలపార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, బాలుఓబులురెడ్డి, గంగవరపు నాగిరెడ్డి సమక్షంలో బాదితురాలు రాణెమ్మకు పునరావాసం కల్పించి రూ.10 వేలు సాయంచేశారు. పట్టణంలోని శంకవరం వద్ద ఉన్న పాలకేంద్రం వద్ద రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ అధికారులతో కలసి ఎక్స్‌కవేటర్‌తో పూడికను తొలగించి నీటిని మళ్ళించి రాకపోకల సమస్యను పరిష్కరించారు.

ప్రభుత్వ నిబంధనల మేరకే విధుల నిర్వహణ

దొనకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు తాను విధులు నిర్వర్తిస్తున్నానని, ఏఒక్క ఉపాధ్యాయుడిని వేధింపులకు గురిచేయటం లేదని దొనకొండ ఎంఈవో-1 సాంబశివరావు స్పష్టం చేశారు. యూటీఎఫ్ మండల శాఖ ప్రతినిధులు సోమవారం ఆయనపై పలు ఆరోపణలు చేశారు. మంగళవారం ఎంఈవో మాట్లాడు తూ మండల పరిధిలోని ఉపాధ్యాయ సంఘాలన్నింటినీ సమాన దృష్టి లో చూస్తూ సమానంగా గౌరవిస్తున్నట్టు చెప్పారు. బదిలీల విషయంలో ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు చేపట్టామే కాని నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కడా డిప్యుటేషన్లు వేయటం గాని, టీచర్లను ఇబ్బందులు పెట్టటం గాని జరగలేదన్నారు.

టీఎన్‌యూఎస్ హర్షం

దొనకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): టెట్ విషయంలో ఉపాధ్యాయుల ఆందోళనపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే స్పందించినందుకు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం మార్కాపురం, కనిగిరి డివిజన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెహమాన్, మండ్లా శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీకి చెందిన ఎమ్మెల్సీలు బి రాంభూపాల్‌రెడ్డి, అలపాటి రాజేంద్రప్రసాద్, వేపాడ చిరంజీరావు, కంచర్ల శ్రీకాంత్, పేరాబత్తుల రాజశేఖరంలు మంగళవారం మంత్రి లోకేష్‌ను కలిసి టెట్ విషయంలో ఉపాధ్యాయులు ఆందోళనలు చెందుతున్న విషయాన్ని వివరించారు. ఈవిషయంపై చర్చించిన మంత్రి లోకేష్ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన సుప్రీంకోర్టులో తక్షణమే రివ్యూ పిటిషన్ వేయాలని నిర్ణయించడం హర్షనీయమన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

పామూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కంబాలదిన్నె గ్రామంలో వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్ సోమవారం నేలకొరిగింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. ఆగ్రామ టీడీపీ అధ్యక్షుడు మన్నం రమణయ్య విద్యుత్ సమస్యను తహసీల్దార్, విద్యుత్ ఏఈకి వివరించారు. దీంతో అధికారులు స్పందించి వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పెద్దన్నపల్లిలో విద్యుత్‌స్తంభం ఏర్పాటు

పీసీపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దన్నపల్లి గ్రామంలో విరిగిపోయిన విద్యుత్‌స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటుచేశారు. గ్రామంలో ఆర్డీఎస్ఎస్ పనుల్లో భాగంగా కొత్తలైను ఏర్పాటుచేశారు. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి స్తంభాన్ని బలంగా ఢీకొట్టడంతో స్తంభం మధ్యలోకి విరిగి నిలువునా చీలిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందళన చెందుతున్నారు. ఈక్రమంలో ‘పొంచిఉన్న ప్రమాదం’ శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.

మండల ప్రత్యేక అధికారి భాస్కర్‌బాబు తక్షణమే విరిగిన స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటుచేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. విద్యుత్‌శాఖ ఈఈ ఉమాకాంత్ ఆదేశాలతో ఆర్డీఎస్ఎస్ సూపర్‌వైజర్లు ప్రమోద్, రాఘవ, ప్రసాద్, లైన్‌మేన్ నాగరాజు తమ సిబ్బందితో తక్షణమే మరమ్మతు పనులు చేపట్టారు. దెబ్బతిన్న స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు

పీసీపల్లిలో 5 పునరావాస కేంద్రాలు

పీసీపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో మండలంలోని అధికారులు అప్రమత్తమయ్యారు. మండల ప్రత్యేక అధికారి భాస్కర్‌బాబు, తహసీల్దార్ ఉష, ఎంపీడీవో జీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో మండలంలో ఐదు పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేశారు. నేరేడుపల్లి, పీసీపల్లి, చింతగుంపల్లి, పెదయిర్లపాడు, మురుగుమ్మి గ్రామాల్లో జడ్పీ ఉన్నత పాఠశాల, సచివాలయాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల పరిధిలో 252 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. మంగళవారం ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, ప్రత్యేక అధికారి భాస్కర్‌బాబు, తహసీల్దార్, ఎంపీడీవో పునరావాస కేంద్రాలను సందర్శించారు.

ముండ్లమూరు: ముండ్లమూరు సమీపంలోని తమ్మలూరుకు వెళ్ళే ప్రధాన రహదారికి పక్కన నివాసం ఉంటున్న పది కుటుంబాలను పునరావాస కేంద్రమైన ఏపీ మోడల్ స్కూల్‌కు తరలించారు. సీఐ రామారావు తహసీల్దార్ లక్ష్మీనారాయణలు పది కుటుంబాల వారితో మాట్లాడి తుఫాన్ తగ్గేంత వరకు పునరావాస కేంద్రంలో ఉండాలని ఆదేశించారు. పోలీసు జీపులో వారిని పునరావాస కేంద్రానికి తరలించారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

కురిచేడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కురిచేడులో మంగళవారం అంతర్జాతీయ పొగాకు దినోత్సవ ర్యాలీని వినుకొండ బర్లీ ఫార్మర్స్ అసోసియేషన్ రైతులు నిర్వహించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ముసిరిక శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ఎంతోమంది పొగాకు పంటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. పొగాకు సాగుచేసే రైతులను ఆదుకోవాలని కోరారు.

కాలువల్లో అడ్డంకులు తొలగింపు

పామూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెల్లూరు రోడ్డుకు ఇరువైపులాఉన్న కాలువల్లో మురుగు నీరు సక్రమంగా ప్రవహించేందుకు సహాయక చర్యలు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి తెలిపారు. స్థానిక స్వాగత్ లాడ్జి వద్ద ఉన్న మురుగు కాలువపై ఆక్రమణలను ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించి ప్రత్యేక కాలువ తీయించారు. ఎంత వర్షం కురిసినా మురుగు నీరు ప్రవహించేందుకు కాలువలు తీయించినట్లు అరవిందారెడ్డి తెలిపారు. విరాట్‌నగర్ కాలనీ వద్ద ఉన్న మురుగు కాలువలో నీరు నిలిచిపోవడంతో ఎక్స్‌కవేటర్‌తో అడ్డంకులను తొలగించారు.

పాఠశాల మరమ్మతులకు సాయం

పామూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల మరమ్మతులకు పామూరు సింగిల్‌విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు మంగళవారం ఎంఈవో, హెచ్ఎం కోటిరెడ్డికి రూ.10 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గుత్తి కొండలరావు, టీడీపీ పట్టణ కార్యదర్శి కటకం శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కురిచేడు: పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందిన వారితో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

అప్రమత్తంగా ఉండాలి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



తాళ్లూరు: దోర్నపువాగు వద్ద పహరాకాస్తున్న పోలీసులు

దర్శి, అక్టోబరు, 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మొంథా తుఫాన్ వల్ల ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. నిరంతరం పర్యవేక్షిస్తూ గ్రామీణ ప్రాంతాల నుంచి సమాచారం తెలుసుకొని ఏమైనా ఇబ్బందులు జరిగితే తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వాగులు, వంకలు చెరువులు వైపు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఆ శాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి గాయత్రీదేవి, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో పి.కల్పన, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కురిచేడులో పునరావాస కేంద్రం

కురిచేడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నాగార్జునసాగర్ జలాశం, కాలువల నిర్మాణ సమయంలో కురిచేడులో రెండు కాలనీలు నిర్మించారు. ఆ కాలనీలు నేడు శిథిలావస్థకు చేరాయి. వాటిలో నివాసం ఉండేవారిని ముందుజాగ్రత్త చర్యగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. 72 మందిని పునరావాస కేంద్రంలో ఉంచారు. వారి బాగోగులను తహసీల్దార్ రజనీకుమారి, రెవెన్యూ, విద్యా శాఖల అధికారులు పరిశీలించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ లక్ష్మి మంగళవారం పునరావాస కేంద్రాన్ని పరిశీలించి ఆశ్రయం పొందినవారితో మాట్లాడారు. మున్ముందు ఇలాంటి పరిస్థితి రాకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామన్నారు. మూడు పూటలా వారికి ఆహారాన్ని పాఠశాల వంటవారితో వండించి పెడుతున్నట్లు ఎంఈవోలు వస్రాం నాయక్, సుబ్బారావు తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు వారిని ఇక్కడే ఉంచు తామని తహసీల్దార్ తెలిపారు.

వాగుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

తాళ్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు మండలంలో ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు పర్యవేక్షణలో వాగుల వద్ద ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేశారు. తాళ్లూరు-విఠలాపురం, తాళ్లూరు-రజానగరం, దోసకాయలపాడు-తోటవెంగన్నపాలెం, బెల్లంకొండవారి పాలెం-దోసకాయలపాడ గ్రామాల వద్ద దోర్నపువాగు చప్టాల దిమ్మెలకు రక్షణ కవచం ఏర్పాటుచేశారు. చప్టాల వద్ద ప్రజలు రాకపోకలు సాగించకుండా పోలీస్ పహరా కాస్తున్నారు. మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు పంలను పరిశీలించి రైతులకు పలుసూచనలు చేశారు.

కాగా, శివరాంపురం, వెలుగువారిపాలెం శివారుల్లో డేరా గుడిసెల్లో ఉంటున్న వలస కూలీల కుటుంబాలకు పునరావాసకేంద్రాలకు తరలించారు. ఆయా పునరావాస కేంద్రాలను ప్రత్యేకాధికారి ఏ.కుమార్, తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో పి.అజితలు సందర్శించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ

దొనకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో మండలంలో ఎడతెరపి లేకుండా ముసురు వర్షం కురుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులు బురదమయమై ప్రజల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారాయి. పలు గ్రామాల్లో పూరి ఇళ్లల్లో ఉంటున్న వారిని వీఆర్వోలు సురక్షిత భవనాల్లోకి చేర్చారు. మండలంలోని కొచ్చెర్లకోట గ్రామ సమీపంలోని గుండ్లకమ్మ నది చప్టాపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ చప్టాపై నుంచి వాహనాల రాకపోకలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో శ్రీశైలం, దోర్నాల, కర్నూల్ వెళ్లే వాహనాలు మార్కాపురం మీదుగా చుట్టూ తిరిగి వెళుతున్నాయి. కాశాలు ఉండటంతో ముందు జాగ్రత్తగా మండల ప్రత్యేకాధికారి సీహెచ్ శ్రీనివాసులు, తహసీల్దార్ ఎల్. లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ఎం.శ్రీదేవి, పలు శాఖల అధికారులు మంగళవారం పలు వాగులను పరిశీలించారు. మారెళ్ళ - జమ్మలమడక మధ్య ఉన్న ఈదర వాగు, ముండ్లమూరు - వేంపాడు మధ్య ఉన్న చిలకలేరు వాగు, మక్కెనవారిపాలెం - పూరిమెట్ల మధ్య ఉన్న ఈదర వాగును పరిశీలించారు. చిలకలేరు వాగులో, బ్రిడ్జి వద్ద చిల్ల చెట్లను, పూడికను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అలాగే, మండల వ్యవసాయ అధికారి తిరుమల రావు కెల్లంపల్లి, ఉల్లగల్లు, పులిపాడు గ్రామాల్లో రైతు లు సాగు చేసిన కంది, సజ్జ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పొలాల్లో ఎక్కువగా నీరు నిలబడకుం డా చూసుకోవాలన్నారు.

భైరవకోనలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

పామూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను ప్రభావంతో సీఎస్‌పురం మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ప్రముఖ శైవక్షేత్రమైన భైరవకోన జలపాతం పరవళ్ళు తొక్కుతుంది. జలపాతంలో నీటి ఉధృతి కారణంగా సుడిగుండంలా మారింది. గంగమ్మ పరవళ్ళు తొక్కుతూ శ్రీత్రిముఖదుర్గాంబ పాదాల చెంతకు చేరి ప్రవహిస్తుంది. దీంతో అధికార బృందం జలపాతం వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటుచేశారు. సీఐ భీమానాయక్ నేతృత్వంలో జలపాతం వద్దకు ఎవరూ రాకుండా గస్తీ నిర్వహిస్తున్నారు.

వాగులను పరిశీలించిన అధికారులు

ముండ్లమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు వాగులు పొంగి ప్రవహించే అవ

కల్లూరు చెరువు కట్టకు మరమ్మతులు

కురిచేడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. చెరువు కట్టలు బలహీనంగా ఉన్న ప్రదేశాలను అధికారులు గుర్తించి మరమ్మతులు చేస్తున్నారు. కల్లూరు గ్రామం పక్కనే ఉన్న చెరువు కట్ట బలహీనంగా ఉండటంతో నీటిపారుదల, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా కట్టను బలపర్చే పనులు చేపట్టారు. చెరువు కట్ట రెండుచోట్ల బలహీనంగా ఉందని గుర్తించిన అధికారులు ఇసుక బస్తాలతో కట్టను బలోపేతంచేసే పని చేపట్టారు. వాహనాలు వెళ్ళలేని ప్రదేశానికి పడవలో ఇసుక బస్తాలను తీసుకెళ్ళి కట్టను బలోపేతం చేశారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఏఈ సుబ్బారావు, తహసీల్దార్ రజనీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



దొనకొండ: కొచ్చెర్లకోట గ్రామం వద్ద గుండ్లకమ్మ చప్టాపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

కనిగిరిలో ఉరుములు, మెరుపులతో వర్షం

కనిగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈక్రమంలో కనిగిరి శివారు గార్లపేట రోడ్డులోని గ్రానైట్ క్వారీల సమీపంలో పిడుగుపడింది. కనిగిరి కొండ దిగువన ఉన్న శివాలయం గోపురం వద్ద పిడుగు పడిందంటూ ప్రచారం జరిగింది. అయితే కొండ దిగువను ఉన్న శివాలయంకు వెళ్ళే భక్తుల మార్గానికి పైకప్పు రేకులు వేసి ఉన్నారు. దశాబ్దాల క్రితం వేసిన రేకులు ఇటీవల మరమ్మతులు ఏర్పడ్డాయి. వాటిని మరమ్మతుతు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఇప్పటికే పాడైపోయిన రేకులు వర్షానికి ఒక్కసారిగా కుప్పకూలి పోయాయి. దీంతో పట్టణంలో శివాలయం వద్ద పిడుగు పడిందంటూ ప్రచారం జరగటంతో ప్రజలు ఆందోళన చెందారు.





● నిజాంపట్నం వద్ద 100 మీటర్లపైనే ముందుకు వచ్చి ఎగిసిపడుతున్న సముద్రం

● సూర్యలంక తీరం తుఫాన్ షెల్టర్‌లో భోజనం ఏర్పాటు

వణికించిన మొంథా

మొంథా.. వణికించింది. మంగళవారం రాత్రికి తీరం దాటగా.. అంతకు ముందు.. ఆ తర్వాత జిల్లాలో ఆ ప్రభావం తీవ్రంగా కనిపించింది. మధ్యాహ్నం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఆ తర్వాత ఒక్కసారిగా మారిపోయింది. అప్పటి వరకు వర్షం పడినా ఆ తర్వాత నుంచి మేఘాలు కమ్ముకు వచ్చి ఈదురు గాలులతో వర్షం పడింది. సాయంత్రానికి గాలులతోపాటు వర్షం కూడా తీవ్రమైంది. పల్నాడు జిల్లాలో కూడా మొంథా ప్రభావం చూపగా.. సముద్రతీరంలోని బాపట్ల జిల్లాను వణికించింది. గుంటూరు జిల్లాలో కూడా తుఫాన్ ప్రభావం కనిపించింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో బుధవారం కూడా విద్యా సంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాలు, గుడిసెల్లోని ప్రజలను అధికారులు పునరావాస కేంద్రా లకు తరలించారు. పంటలు నీటిలో నానుతుండటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తుఫాన్ తీరం దాటినా ఆ ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



అచ్చుతాపురం-నిజాంపట్నం రోడ్డులో గాలులకు నేలవాలిన వేపచెట్టు



రేపల్లె: పల్లపట్లలో గాలులకు పూరిగుడిసెపై విరిగిపడ్డ కొబ్బరిచెట్టు



పర్చూరు మండలం ఉప్పుటూరులో నిల్వ ఉంచిన పొగాకు బేళ్ల కిందకు పెద్ద ఎత్తున చేరిన వర్షపు నీరు

- ఈదురు గాలులు.. భారీ వర్షం
- ఉదయం నుంచి కమ్ముకున్న చీకట్లు
- తీరప్రాంత మండలాల్లో అల్లకల్లోలం
- హార్బర్‌లో 8వ ప్రమాద హెచ్చరిక

బాపట్ల, రేపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ తీరాన్ని వణికిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కమ్ముకొచ్చిన మేఘాలతో చీకట్లు అలుముకు న్నాయి. వానకు గాలులు కూడా తోడయ్యాయి. ఇక సముద్ర తీర ప్రాంతంలో 50 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులతో తీరప్రాంత మండలవాసులు భయాందోళనకు గురవుతున్నారు. విరామమిస్తూ, ఒక్కొక్కసారి వర్షం విరుచుకు పడుతోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు వాన నీటితో నిండిపోయాయి. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. తుఫాన్ తీవ్రత విషయంలో అధికారుల హెచ్చరికలతో తీరానికి దూరంగా ఉన్న పల్నాడు, గుంటూరు జిల్లా పరిధిలోని పట్టణాల్లో కూడా ప్రధాన వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. బాపట్ల జిల్లా పరిధిలోని తీర ప్రాంత సమీప గ్రామాలతో పాటు, బాపట్ల, చీరాల, రేపల్లె తదితర పట్టణాల్లో కూడా ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఇళ్లలోనే ఉన్నారు.

ఇక పలు ప్రాంతాల్లోని వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. కొన్ని మండలాల్లో వరి నెలవాలి నీటిలో నానుతుంది. పత్తి, మిరప పొలాలు నీటిలో నానుతున్నాయి. సాయంత్రం నుంచి ప్రారంభమైన ఈదురు గాలులతో అక్కడక్కడ భారీ వృక్షాలు నెలకూలాయి. తుపాన్ తీవ్రత దృష్ట్యా నిజాంపట్నంలో 8వ ప్రమాద హెచ్చరిక ఎగురవేశారు. సోమవారం అంతా మూడో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తే, మంగళశారం ఉదయానికి ఐదో ప్రమాద హెచ్చరిక, మధ్యాహ్నానికి 8వ ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. తీర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. తీరానికి (మిగతా 6వ పేజీలో)

సముద్రం ముందుకొచ్చింది..

మొంథా తుఫాన్ తీరానికి దగ్గరవుతున్న కొద్దీ సముద్రంలో అలజడులు ఎక్కువయ్యాయి. అలలు ఎగిసిపడుతున్నాయి. నిజాంపట్నం హార్బర్ వద్ద మంగళవారం ఉదయానికి సముద్రం 100 మీటర్లు ముందుకు రాగా, క్రమంగా పెరుగుతూ సాయంత్రానికి 150 మీటర్ల వరకు ముందుకొచ్చింది. చాలావరకు ఒడ్డుకు ఆనుకున్నట్లు కనిపించింది. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రళయం సంభవిస్తుందోనని నిజాంపట్నం, నిజాంపట్నం హార్బర్, దిండి తదితర తీరప్రాంతంలోని గ్రామాల్లోని ప్రజలు భయం గుప్పిట్లో ఉన్నారు. హోరు శబ్దాలతో ప్రజలంతా వణికిపోతున్నారు. బీచ్‌ల వద్ద నిషేధం కొనసాగుతుండటంతో ఆ పరిసర ప్రాంతాలు కర్ఫ్యూను తలపిస్తున్నాయి.

● బాపట్ల: తూర్పు తుంగభద్ర డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, జిల్లా ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు



తుఫాన్ బీభత్సం

- భారీ వర్షంతో అతలాకుతలం
- జిల్లాలో విద్యుత్ సరఫరా బంద్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా తుఫాన్ బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి 7 నుంచి ఈదురుగాలుల తీవ్రత భారీగా పెరిగింది. గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో గాలులు విరుచుకుపడ్డాయి. భారీ వర్షానికి ఉరుములు, మెరుపులు కూడా తోడయ్యాయి. తీర ప్రాంత గ్రామాల్లో మధ్యాహ్నం నుంచే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో అనేక ప్రాంతాల్లో అంధకారం అలుముకుంది. గాలుల హోరుల ధాటికి రాత్రంతా ప్రజలు భయం గుప్పిట్లో బిక్కుబిక్కుమంటూ గడిపారు. అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ఆరు గంటల నుంచే దుకాణాలు మూసివేశారు. చీరాల వాడరేవు తీరంలో అలలు ఎగిసిపడడంతో కొంతభాగం కోతకు గురైంది. బాపట్ల రూరల్‌తో పాటు చీరాల పరిధిలో చెట్లు, కరెంటు స్థంబాలు నేల కొరిగి నట్లు సమాచారం. అద్దంకిలోని ప్రభుత్వ కళాశాల వద్ద చెట్లు విరిగి పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షాలకు గాలులు తోడవడంతో పంటలకు నష్టం అధికంగా ఉండనున్నదని రైతులు ఆందోళన చెందారు. పర్చూరు మండలంలోని ఉప్పుటూరు శివారులో కాల్వ పక్కనే వందల క్వింటాళ్ల పొగాకు మండెల్లోకి భారీగా నీరు చేరింది.

138 పునరావాస కేంద్రాలు.. 7,176 మంది తరలింపు

జిల్లాలోని లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే వారి కోసం 138 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు మంగళవారం సాయంత్రానికి 7,176 మందిని తరలించినట్లు సమాచారం. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌రూంలో అధికారులు తుఫాన్ పరిస్థితిపై సమీక్షిస్తూ ఎక్కడికక్కడ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పర్యటించారు. బాపట్ల పరిధిలోని నాగరాజు, ఈస్ట్ తుంగభద్ర కాల్వల పరీవాహక ప్రాంతాలను కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. ఉప్పుటూరు శివారులోని కాల్వ పొంగిపొర్లుతోంది. మార్టూరు పరిధిలోని జాతీయ రహదారిపై భారీగా నిలిచిన వర్షపు నీటి తరలింపుపై అధికారులు దృష్టి సారించారు.



బాపట్ల : గాలులకు విరిగిపడిన చెట్లను తొలగిస్తున్న పోలీస్ సిబ్బంది



బాపట్ల: పునరావాస కేంద్రానికి బస్సులో తరలిపోతున్న మూలపాలెం పంచాయతీలోని కాలనీవాసులు



సూర్యలంక తీరంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎమ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, సిబ్బంది



నిజాంపట్నం : జెట్టీలకే పరిమితమైన మెరైన్‌బోట్లు



నిజాంపట్నంరోడ్డులో విద్యుత్ స్థంభాలు ఏర్పాటు



నిజాంపట్నం హార్బర్ వద్ద బోట్లలో మత్స్యకారులు



జంపని పునరావాస కేంద్రంలో నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు



కొల్లూరు : చింతల్లంకలో గాలులకు పడిపోయిన చింతచెట్టు



భట్టిప్రోలు: గాలులకు నేలకొరిగిన వరి పైరు

ప్రాణనష్టం జరగకుండా చర్యలు

అధికారులను ఆదేశించిన ఆర్‌పీ సిసోడియా

బాపట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ దాటికి జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తుఫాన్ దక్షిణ కోస్తాంధ్ర ప్రత్యేకాధికారి, చేనేత జౌళీశాఖ ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆదేశించారు. పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న వారికి ఎలాంటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాన్ నేపథ్యంలో మంగళవారం ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. భారీవర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న హైదర్‌పేటలోని నల్లమడ డ్రెయిన్‌ను పరిశీలించి ఆ పరిసర ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కాల్వల ప్రవాహంతో ప్రజలకు, పంటలకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలన్నారు. తుఫాన్‌ను ఎదుర్కునేందుకు సమగ్రప్రణాళికతో ముందుస్తుగా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ సిసోడియాకు వివరించారు. చేపడుతున్న సహాయక కార్యక్రమాలు గురించి తెలియజేశారు. 30 ప్రధాన కాల్వలు, 42 మధ్యస్థ కాల్వల పరివాహక పరిధిలోని 103 గ్రామాలకు చెందిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రత్యేకాధికారి యెనుముల గోపాలరెడ్డి, జలవనరులశాఖ ఇల్లా అధికారి అబూతలీమ్, జేఈ సునీత తదితరులు ఉన్నారు.



బాపట్ల : నల్లమడ డ్రెయిన్ ఉధృతిని పరిశీలిస్తున్న తుఫాన్ దక్షిణ కోస్తాంధ్ర ప్రత్యేకాధికారి సిసోడియా, కలెక్టర్ వినోద్‌కుమార్

కాల్వ కట్టల వద్ద జాగ్రత్త

తుఫాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున పంట కాల్వలు, డ్రెయినేజీల సమీపంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. నల్లమడవాగు(నాగరాజుకాల్వ), తూర్పు తుంగభద్ర కాల్వలను, పరివాహకప్రాంతాలను జిల్లా ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీగా వరదనీరు వచ్చే అవకాశం ఉన్నందున కట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సూచించారు. ఇళ్లలోకి వరదనీరు రాకముందే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. నల్లమడ కాల్వలో ప్రస్తుతం 12 వేల క్యూసెక్కుల వరదనీరు సముద్రంలోకి చేరుతుందన్నారు. ఈ ప్రవాహం మరింత పెరగనున్నదన్నారు.

పోలీసు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్

- 12 క్విక్ రియాక్షన్, నాలుగు స్పెషల్ రెస్పాన్స్ బృందాలు
- విపత్కర పరిస్థితులపై పోలీసులకు ఎస్పీ ఉమామహేశ్వర్ దిశానిర్దేశం



బాపట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ విపత్కర పరిస్థితులను ఎదుర్కొని ప్రజలకు సాయం అందించేందుకు పోలీసుయంత్రాంగం అన్నివిధాలా సంసిద్ధంగా ఉందని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా కమాండ్ కంట్రోల్ నెంబరు 8333813228ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, 12 క్విక్ రియాక్షన్, నాలుగు స్పెషల్ రెస్పాన్స్ బృందాలతో పోలీసులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈదురుగాలలుతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకుంటుందన్నారు. లోతట్టుప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అక్కడ నివాసం ఉంటున్న ప్రజలకు అవగాహన కల్పించి వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామన్నారు. లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారన్నారు. చీరాల, రేపల్లె, నిజాంపట్నం ప్రాంతాలకు ఎన్‌డీఆర్‌ఎస్ బృందాలను పంపామన్నారు. క్విక్ రియాక్షన్, స్పెషల్ రెస్పాన్స్ బృందాలను బాపట్లలో సిద్ధంగా ఉంచామన్నారు. చీరాల, బాపట్ల, రేపల్లె సబ్ డివిజన్లలో నోడల్ అధికారులను నియమించి కంట్రోల్‌రూమ్ ను ఏర్పాటు చేశామన్నారు. తుఫాన్ గురించి సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఎస్పీ తెలిపారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా అసత్యప్రచారాలు చేయవద్దని ఎస్పీ తెలిపారు. తుఫాన్ పరిణామాలపై పోలీసుశాఖ, ఇతర ప్రభుత్వ అధికారుల అధికారిక ప్రకటనలు మాత్రమే విశ్వసించాలని ప్రజలకు సూచించారు. సోషల్‌మీడియాలో అసత్యప్రచారాలను ఫార్వర్డ్ చేసే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా పోలీసు సహాయం అవసరమైతే తక్షణమే టోల్‌ఫ్రీ నెంబరు 112 లేదా కమాండ్ కంట్రోల్‌రూమ్ నెంబర్ల కాల్ చేయాలన్నారు.

పోలీసు కంట్రోల్ రూమ్‌లు..

- చీరాల సబ్ డివిజన్ : వి.నాగశ్రీను - 9121104793
- బాపట్ల సబ్ డివిజన్ : ఎం.విజయ్‌కుమార్ - 8978777298
- రేపల్లెసబ్ డివిజన్ : పి.రవిప్రసాద్ - 9032030919

విరిగిపడిన చెట్లు

జోరువానలోనే తొలగింపు

చీరాల(వేటపాలెం), అద్దంకి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి ఈదురుగాలులకు చీరాల, అద్దంకి ప్రాంతాల్లో పెద్దఎత్తున చెట్లు విరిగి రోడ్లపై పడిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. వేటపాలెం మండలం పందిళ్లపల్లి ప్రధాన రహదారిలో భారీ వృక్షం విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోగా ఎస్ఐ జనార్ధన్ సిబ్బంది సహకారంతో జోరువానలో తొలగించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా భారీ హోర్డింగ్ గాలులకు ఊడి రోడ్డుపై పడింది. అయితే ఆ సమయంలో రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వన్‌టౌన్ ఎస్ఐ రాజ్యలక్ష్మి, మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్ సాయంతో దానిని తొలగించారు. అద్దంకిలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో పెద్ద చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రెండు విద్యుత్ స్థంభాలు విరిగిపడి విద్యుత్ వైర్లు తెగిపోయాయి. కమిషనర్ రవీంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది చెట్టును తొలగిస్తున్నారు.



రహదారిపై విరిగిపడిన కొమ్మలు తొలగిస్తున్న ఎస్ఐ జనార్ధన్, సిబ్బంది

మార్జిన్‌లోకి వెళ్లిన ఆర్టీసీ బస్సు

మేదరమెట్ల, అక్టోబరు 28: పమిడిపాడు నుంచి హైదరాబాదు వెళ్లే ఆర్టీసీ బస్సు సోమవారం రాత్రి రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లింది. పమిడిపాడు నుంచి హైదరాబాదు వెళ్తున్న బస్సు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లింది. సింగిల్ రోడ్డు కావడం, ఆపై గుంతల నడుమ వర్షం కురుస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బస్సులోని ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఆర్టీసీ అధికా రులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.



వర్షపునీరు నిలవకుండా చర్యలు


వర్షపునీటిని తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

మార్టూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి వెంబడి సర్వీసురోడ్డులో వర్షపునీరు నిలవకుండా మార్టూరు పంచాయతీ కార్మికులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మార్టూరు కూడలిలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే సర్వీసు రోడ్డులో వర్షపునీరు నిలుస్తోంది. దీంతో గ్రామ పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు మంగళవారం పంచాయతీ కార్మికులతో నీరు నిల్వకుండా వెళ్లే విధంగా చర్యలు చేపట్టారు.మంగళవారం రాత్రి మరింతగా భారీ వర్షం కురిసినా నీళ్ల రోడ్డుపై నిలబడకుండా, ప్రక్కనే ఉన్న సైడు కాల్వలు ద్వారా వెళ్లే విధంగా చర్యలు చేపట్టారు.

అద్దంకిలో దుకాణాలు మూయించిన అధికారులు


పట్టణంలో దుకాణాలను మూయిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, సీఐ సుబ్బరాజు

అద్దంకి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణంలోని అన్ని దుకాణాలను మంగళవారం సాయంత్రం నుంచి మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, సీఐ సుబ్బరాజులు మూసివేయించారు. రోడ్ల వెంబడి పర్యటించి మైక్ ద్వారా ప్రకటిస్తూ మూసి వేయించారు. దుకాణాలు మూసి వేసి ఇళ్లలోనే ఉండాలని తెలిపారు. ప్రజలు కూడా ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. నియోజకవర్గంలోని అన్ని మద్యం దుకాణాలను మంగళవారం సాయంత్రం నుండి మూసివేయించినట్లు అద్దంకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ భవాని తెలిపారు. తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చే వరకు మద్యం దుకాణాలు తెరవ వద్దని తెలిపారు.

వణికించిన మొంథా

(5వ పేజీ తరువాయి)

దూరంగా ఉన్న ప్రాంతాల్లో మాత్రం గాలుల తీవ్రత ఎక్కువగా కనిపించింది. మంగళవారం రాత్రికి మొంథా తీరం దాటే సమయంలో తీవ్రత పెరిగితే 10వ ప్రమాద హెచ్చరిక చేస్తారని అధికారులు చెబుతున్నారు. రేపల్లె, నిజాంపట్నం, కర్లపాలెం, బాపట్ల, చీరాల పరిధిలోని తుఫాన్ ప్రభావిత గ్రామాల నుంచి జనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గుంటూరు జిల్లాలోని కృష్ణానదీ తీరంలోని కొల్లిపర, దుగ్గిరాలతోపాటు, తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, పొన్నూరు వంటి పట్టణాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వర్షం తక్కువగా ఉన్నా, గాలుల తీవ్రత పెరగడంతో విద్యుత్ సరఫరాకు చాలాచోట్ల అంతరాయం ఏర్పడింది. విరిగి పడిన చెట్ల కొమ్మలను, పడిపోయిన విద్యుత్ స్తంభాలను విద్యుత్ సిబ్బంది వర్షంలోనూ ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. వర్షాలు, గాలులతో పంటలకూ నష్టం తప్పడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలోని తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, పొన్నూరు, బాపట్ల జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు, చుండూరు, అమృతలూరు వంటి మండలాల్లో అక్కడక్కడ వరి చాపలా నేలపై పరుచుకుపోయింది. లంక గ్రామాల్లోని అరటి, కంద, పసుపు వంటి తోటలు నేలవాలాయి. మంగళవారం రాత్రికి తీరం దాటే నేపథ్యంలో సాయంత్రం నుంచి గాలుల తీవ్రత పెరిగింది. తుఫాన్ పరిస్థితుల దృష్ట్యా దక్షిణ కోస్తా జోన్‌కు ప్రత్యేక అధికారిగా నియమించిన ఆర్‌పీ.సిసోడియా బాపట్ల కలెక్టరేట్‌కు వచ్చి ఏర్పాట్లపై సమీక్షించారు.

తీరని వేదన

- జలదిగ్బంధంలో తీరప్రాంత గ్రామాలు
- వణుకుతున్న మత్స్యకార పల్లెలు
- గాలుల తీవ్రతతో భయాందోళన
- నీట మునిగిన వరి పొలాలు
- ఉద్యాన పంటలకు తీవ్ర దెబ్బ
- ఉప్పు కొటార్లు నీటిపాలు

మొంథా తుఫాన్ జిల్లాను అతలాకుతలం చేసింది. మంగళవారం జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు తీర ప్రాంతం చివురుటాకులా వణికిపోయింది. మత్స్యకార గ్రామాల్లో నిశ్శబ్దం ఆవరించింది. భారీ వర్షాలకు మత్స్యకార గ్రామాలు జలమయం అయ్యాయి. కొన్ని జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఉదయం నుంచి తుప్పర్లతో ప్రారంభం అయిన వాన మధ్యాహ్నం నుంచి భారీ వర్షంగా మారింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి మత్స్యకార గ్రామాల్లోకి భారీగా నీరు చేరింది.

ఒంగోలు నగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ దాటికి కొత్తపట్నం నుంచి బీచ్ వరకు ఉన్న తారు రోడ్డు కనిపించకుండా పోయింది. ఈ మార్గంలో రోడ్డులో మూడడుగుల ఎత్తులో నీరు ప్రవహించింది. కొత్తపట్నం పల్లెపాలెం గ్రామంలోకి వరద నీరు వచ్చి చేరింది. కొత్తపట్నం మండలోని మత్స్యకార గ్రామాలైన స్వర్ణాంధ్రపట్టపుపాలెం, మడనూరు చినపట్టపుపాలెం, పెద పట్టపుపాలెం, ఈతముక్కల పల్లెపాలెం, రాజు పాలెం పట్టపుపాలెం గ్రామాల్లోకి వర్షపు నీరు చేరింది. ఇళ్లలోకి కూడా నీరు వచ్చి చేరటంతో మత్స్యకారులు ఇబ్బందులు పడ్డారు. గడిచిన పదేళ్లలో ఇంతస్థాయిలో గ్రామాల్లోకి నీరు వచ్చిన దాఖలాలు లేవని మత్స్యకారులు అంటున్నారు. నాగులుప్పలపాడు, కనపర్తి, గుండాయపాలెం, గుండమాల, పిన్నివారిపాలెం, శింగరాయకొండ మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లోకి కూడా వర్షం నీరు చేరటంతో మత్స్యకారులు ఇబ్బందులు పడ్డారు. తీర ప్రాంత గ్రామాల్లోకి నీరు వచ్చి చేరటంతో పలు గ్రామాల్లో మత్స్యకారులను పునరావాస కేంద్రాలకు తరలించారు. అధికారులు బోజనవసతి ఏర్పాటు చేశారు.


కొత్తపట్నం నుంచి బీచ్‌కు వెళ్లే రహదారిలో భారీగా నిలిచిన నీళ్లు

500 ఎకరాల్లో నీటమునిగిన వరి

కొత్తపట్నం మండలంలో రైతులు సాగు చేసిన 500 ఎకరాల్లో వరి పూర్తిగా నీటమునిగి పోయింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు చేరి చావుబతుకుల మధ్య ఉన్న పైరు మంగళవారం కురిసిన వర్షానికి పూర్తిగా మునిగిపోయింది. పంట పొలాలు చెరువులా మారాయి. ఇసుక నేలల్లో చేమదుంపలు, ఆకు కూరలు, పూలసాగు చేసిన రైతులు కూడా బాగా దెబ్బతిన్నారు. మోకాటి లోతు నీళ్లలో పంటలు మునిగిపోయి ఉన్నాయి. కుళ్లిపోయి పనికి రాకుండా పోతాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఆందోళనలో ఆక్వా రైతులు

జిల్లాలోని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆక్వా చెరువుల్లో నీరు వచ్చి చేరింది. కట్టపైన నీరు పొంగి పొర్లుతోంది. ఇంకా వర్షం పడితే చెరువులు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం ఇలాగే కొనసాగితే చెరువుల్లో ఆక్సిజన్ స్థాయిలు పడిపోయి నష్టం వచ్చే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుఫాన్ నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాలకు విద్యుత్ సరఫరాలో పలుమార్లు అంతరాయం ఏర్పడింది. మంగళవారం రాత్రికి గాలుల తీవ్రత పెరగటంతో అనేక గ్రామాలకు అధికారులే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పెద్ద వాహనాలు తప్ప ద్విచక్ర వాహనాలు కూడా తిరగలేని విధంగా రోడ్లు వర్షపు నీరు చేరటంతో తీర ప్రాంత గ్రామాలకు రాకపోకలు తగ్గిపోయాయి.

ఎన్‌టీఆర్ నగర్ వాసులలో కలవరం

- లైలా తుపాను రోజులను గుర్తుకు తెచ్చుకుంటున్న వైనం
- చెరువు ఆక్రమణలో కాలనీ ఏర్పాటు
- కాలువలపైన అక్రమ నిర్మాణాలు
- ఆందోళన రేకెత్తిస్తున్న మొంథా తుపాను


ఎన్‌టీఆర్ నగర్ వ్యూ

అద్దంకి : మొంథా తుఫాన్ అద్దంకి లోని ఎన్‌టీఆర్ నగర్ వాసులను కలవర పెడుతోంది. 15 సంవత్సరాల క్రితం నాటి లైలా తుఫాన్ సమయంలో ఏర్పడిన పరిస్థితులు మరలా ఉత్పన్నమవుతాయనే ఆందోళన కాలనీ వాసులలో నెలకొంది. అద్దంకి పట్టణంలోని ఊరచెరువులో మూడు దశాబ్దాల క్రితం వరకు ఏటా లక్ష్మీనరశింహస్వామి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించే వారు. అయితే కాలక్రమంలో ఊరచెరువులో ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. దీంతో తెప్పోత్సవం కూడా నిలిచిపోయింది. ఊరచెరువులోనే ఎన్‌టీఆర్ నగర్ నిర్మించారు. అదే సమయంలో ఊరచెరువుకు వర్షపు నీరు చేరే మార్గాన్ని కూడా ఆక్రమించారు. దీంతో వర్షపు నీరు చెరువుకు చేరే వీలు లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే 2010 సంవత్సరంలో వచ్చిన లైలా తుపానుతో ఎన్‌టీఆర్ మొత్తం ఐదారు అడుగుల నీటితో నిండిపోయింది. దీంతో పలువురు నిరాశ్రయులయ్యారు. అయినా ఇక్కడ ఇళ్ల నిర్మాణం మాత్రం ఆగలేదు. ఏటికేడు ఊరచెరువులో ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతూనే ఉన్నారు. ప్రస్తుతం మొంథా తుఫాన్‌తో భారీ వర్షాలు కురుస్తుండడంతో పొలాలపై నుంచి వచ్చే నీరు ఊరచెరువు నిండితే ఎన్‌టిఆర్ నగర్ మునగడం ఖాయం. ఇక వరద నీరు నేరుగా చెరువులకు చేరేందుకు ఉన్న వాగులు కూడా ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో నీరు వాగులలో కాకుండా ఎన్‌టీఆర్ నగర్‌లో నుంచి ప్రవహించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో భారీ వర్షం కురిస్తే మాత్రం ఎన్‌టిఆర్ నగర్ మునిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. అప్పట్లో గుంజివారిపాలెం కూడా ముంపుకు గురైంది. అయితే అనంతరం గుంజివారిపాలెంలో మేజర్ సైడ్ డ్రైన్ నిర్మాణం చేపట్టడంతో భారీ వర్షాలు వచ్చినా ముంపునకు అవకాశం ఉండదనే అభిప్రాయం నెలకొంది. అయితే ఎన్‌టీఆర్ నగర్ పూర్తిగా ఊరచెరువులో ఉండడంతో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లేకుండా పోయింది. సుమారు 1500 మంది వరకు జనాభా ఉండడంతో ఇక్కడ కొన్ని మౌలిక వసతులు మాత్రమే కల్పిస్తున్నారు. భారీ వర్షాలు వచ్చిన ప్రతిసారి ఎన్‌టీఆర్ కాలనీ వాసులు ఆందోళనకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.


ఆక్రమణకు గురైన కాలువలు

ఏపీ మారిటైం సదస్సుకు స్పందన

ముంబయి సదస్సులో పాల్గొన్న చైర్మన్ సత్య

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ముంబయిలో జరుగుతున్న ఇండియా మారిటైం వీక్ 2025 సదస్సులో మంగళవారం రాష్ట్ర మారిటైం బోర్డు ప్రత్యేక సదస్సుతో పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రయత్నం చేసింది. కేంద్ర ఓడరేవులు, షిప్‌లు, జల మార్గాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో మంగళవారం రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, పెట్టుబడి అవకాశాలను వివరించారు. రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సత్య మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాన్ని వివరిస్తూ పారిశ్రామికవేత్తలను ఏపీకి రావాలని కోరారు. వందకుపైగా దేశాలు, 500 మందికి పైగా పారిశ్రామికవేత్తలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఇండియాస్ మారిటైం గేట్ వే టు దిఈస్ట్(తూర్పునకు భారత దేశ సముద్ర ద్వారం) అనే నినాదంతో రాష్ట్రంలోని తీర ప్రాంతంలోని పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను ప్రతిబింబించే ప్రదర్శన ఇచ్చారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో మారిటైం ద్వారా పెట్టుబడిదారులకు ఇచ్చే ప్రోత్సాహకాలను సత్య వివరించారు.


సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి, సత్య

చిత్రజ్యోతి
SINCE 1965

కొత్త తేదీన ఆర్యన్



విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ట మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.




ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.



శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబానో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి

దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకొని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగినప్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.



నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.

మొంథా బీభత్సం


చీరాల పునరావాసకాలనీలో బాధితులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

- మంగళవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం
- పూర్తిగా స్తంభించిన జనజీవనం
- పొంగిపొర్లిన వాగులు వంకలు
- ముందే స్పందించిన అధికార యంత్రాంగం
- సహాయక చర్యలు వేగవంతం
- ఆశ్రయం కల్పించిన పునరావాస కాలనీలు
- ఖరీఫ్ పైర్లు నేలమట్టం
- పలుచోట్ల విద్యుత్ సమస్యలు
- అల్లకల్లోలం సృష్టించిన ఈదురుగాలులు
- నిర్మానుష్యమైన రహదారులు

చీరాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా బీభత్సం సృష్టించింది. సోమవారం నుంచి ప్రభావం మొదలైనప్పటికీ, మంగళవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు ఏకబిగువన వర్షం కురిసింది. దీనికి తోడు ఈదురుగాలులు తోడు కావడంతో జనజీవనం స్తంభించింది.

తుపాను ప్రభావంతో తీరంవెంబడి ఈదురు గాలులు మోత మోగిస్తున్నాయి. ఎడతెరపి లేని వర్షంతో ఇళ్లల్లోకి నీరు చేరింది. రహదారులు నీళ్లతో నిండాయి. అయితే ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఎమ్మెల్యే కొండయ్య, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ముంపు గ్రామాలవాసులను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన వసతులు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే నియోజకవర్గంలోని సెయింట్‌ఆన్స్ స్కూల్, చేనేతపురి కాలనీ, తోటవారిపాలెం, చంద్రమౌళి కాలనీ, దేశాయిపేట, నవజ్యోతి కాలనీ ప్రాంతాల్లో ఎమ్మెల్యే కొండయ్య పర్యటించారు. అక్కడి పునరాస కాలనీలోని వారికి కావాల్సిన వస్తువులు, ఆహార పదార్థాలు అందజేశారు. భోజనం వడ్డించి అందరితో కలిసి అక్కడే సహపంక్తి పంచుకున్నారు. అలాగే కారంచేడు మండల పరిధిలోని కేశవరప్పాడు - తిమిడితపాడు మార్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు సుమారు 50 అడుగుల మేర ధ్వంసమైంది. అలాగే స్వర్ణ గ్రామంలోని రొంపేరు కాలువ నుండి ప్రజలకు ఇబ్బందులు పడుతుండటంతో ఆయా ప్రాంతాల్లో ఆర్డీవో పరిశీలించి జాగ్రత్త చర్యలు చేపట్టారు. రామాపురం, వాడరేవు, పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారి పాలెంవంటి పరివాహక పరివాహక ప్రాంతాల్లో అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

విద్యాలయం సందర్శన


భోజనాన్ని తనిఖీ చేస్తున్న బాలమ్మ

బల్లికురవ : బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని నియెజక వర్గ ప్రత్యేకాధికారి బాలమ్మ మంగళవారం పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు శుచి రుచిగా అందించాలన్నారు. అనంతరం కొప్పెరపాలెం ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న తుఫాను పునరావస కేంద్రాన్ని పరిశీలించి అక్కడ ఉన్న వారికి అందుతున్న వసతుల గురించి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపీడీవో కుసుమకుమారి, తహసీల్దార్ రవినాయక్, వెలుగు ఏపీఎం రాజారావు, ప్రిన్సిపాల్ సరళకుమారి తదితరులు ఉన్నారు.

మినుము రైతులకు అపారనష్టం


మినప ఓదెలలో నిలిచిన వర్షపునీరు

పంగులూరు : మొంథా తుపాను ప్రభావంతో మండలంలో సాగులో ఉన్న మినుము పూర్తిగా తుడిచిపెట్టుకు పోయింది. ఎకరాలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టపోయామని రైతులు వాపోతున్నారు. మండలంలో రెండున్నర వేల ఎకరాల్లో మినుము దెబ్బతింది. కూరగాయలు, మిరప, పత్తి పైర్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని పంగులూరు, చందలూరు, తూర్పు తక్కెళ్లపాడులో పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. పంగులూరులో సంచారజాతులు, ఇతర ఎస్సీ, ఎస్టీ బీసీలు 30మంది, చందలూరు, తక్కెళ్లపాడులో లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న 25 మంది తక్కెళ్లపాడులో 25మందికి స్థానికంగా పునరావాసం కల్పించారు. సచివాలయ సిబ్బంది తగిన భోజనవసతి ఏర్పాటు చేస్తున్నారు.

నల్లబర్లీ మండెలు నీటిపాలు

పర్చూరు/కారంచేడు : గతేడాది పండించిన నల్లబర్లీ పొగాకు మండెలు ప్రస్తుత వర్షాలకు పూర్తిగా చీకిపోయే పరిస్థితి ఏర్పడింది. నల్లబర్లీ పొగాకు అధిక శాతం రైతులు అమ్ముకోలేక పోయారు. దీంతో ఆరు బయట పొలాల్లో, ఖాళీ స్థలాల్లో మండెలుగా వేసి నిల్వ చేశారు. తడిచి పాడైపోకుండా ఉండేందుకు తాత్కాలికంగా ప్లాస్టిక్ పట్టలు కప్పారు. మొంథా తుఫాను ప్రభావంతో ఈదులు వీయడంతో, ప్లాస్టిక్ పట్టలు గాలికి లేచిపోయే ప్రమాదం ఉంది. ఇక తడి గాలులకు మండెలు పూర్తిగా దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు. దీంతోపాటు ఇప్పటికే సాగులో ఉన్న మిర్చి, పత్తి, కూరగాయల పైర్లు నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.


పొలాల్లోనే మండెకట్టి ఉన్న పొగాకు

జలమయమైన రహదారులు


పర్చూరు సబ్‌స్టేషన్ సమీపంలో పొలాల్లో నిలిచిన నీరు

మొంథా తుఫాను ప్రభావంతో రెండురోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో రహదారులు జలమయం అయ్యాయి. పర్చూరు, కారంచేడు మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న నివాస వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. వాడరేవు - పిడుగురాళ్ళ రోడ్డులోని స్థానిక పర్చూరు సమీపంలో ఏర్పాటు చేసిన 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రమాదపు అంచుల్లో ఉంది. తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను వర్షపు నీరు ముంచెత్తటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని అధికారులతోపాటు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నూతన హైవే 167ఏ జాతీయ రహదారి(హైవే) నిర్మాణంలో సైడ్ డ్రైన్‌ను ఏర్పాటు చేయక పోవడంతో సమస్య జఠిలంగా మారింది. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అంతరాయం ఏర్పడితే బాపట్ల, చీరాల, వేటపాలెం, రాష్ట్ర రాజధాని అమరావతికి కూడా విద్యుత్ సమస్య ఏర్పడుతుందని అధికారులు చెబుతున్నారు.

పునరావాస కేంద్రాల సందర్శన

పర్చూరు/కారంచేడు : లోతట్టు ప్రాంతాల్లోని ప్రజల కోసం ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రాలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న మంగళవారం పరిశీలించి వసతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఎంపీడీవో ప్రద్యూమ్నకుమార్, పంచాయితీ కార్యదర్శి మస్తాన్‌రావు, ట్రైనీ ఎస్సై పులి గోపి, ఆయా శాఖల అధికారులు ఉన్నారు. అదేవిధంగా కారంచేడు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారిని తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో పునరాస కేంద్రాలకు తరలించి ప్రత్యేక ఏర్పాట్లు కల్పించారు.


ఏల్చూరులోని పునరావాసకేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

సంతమాగులూరు : మొంథా తుఫాన్ కారణంగా మండలంలోని ఏల్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో చేపడుతున్న సహాయక చర్య లను మంగళవారం మండల ప్రత్యేకాధికారి ఎన్ రాజన్‌బాబు, తహసీల్దార్ కే.రవిబాబు, సీఐ కే.వెంకటరావులు పరిశీలించారు. ఏల్చూరు లోతట్టు ప్రాంతాలలో గుడిసెలలో నివసిస్తున్న ఎస్టీ కుటుంబాల 60 మందిని గుర్తించి ఈ పునరావాస కేంద్రంలో చేర్చి వారికి తాగునీరు, భోజనవసతి , వైద్య సదుపాయం, కల్పించినట్లు తహసీల్దార్ రవిబాబు తెలిపారు. అలాగే కుందుర్రు గ్రామంలోని లోతట్టు ప్రాంతంలో ఉన్న 13 గిరిజన కుటుంబాలను గుర్తించి వారికి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావాసం ఏర్పాటు చేశారు. అలాగే కొప్పరం గ్రామంలో పది కుటుంబాల వారిని గుర్తించి ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో తగు వసతులు కల్పించినట్లు తహసీల్దార్ తెలిపారు.

చినగంజాం : తీరప్రాంత గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి సీ.హెచ్. ప్రశాంత్ మండలస్థాయి అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. అనంతరం మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. చినగంజాం జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని వారికి ఆయన అధికారులతో కలిసి భోజనం వడ్డించారు. మండలంలో ఏర్పాటు చేసిన 13 పునరావాస కేంద్రాలలో 139 మంది ఉన్నట్లు తెలిపారు. చీరాల డిఎల్‌పీవో పద్మావతి, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీడీవో కె.ధనలక్ష్మి, ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, ఏపీవో లక్ష్మీదేవి, గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, మండల టీడీపీ అధ్యక్షులు పొద వీరయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు. గొనసపూడి గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది..

చెరువు అలుగు పూడికతీత


సూచనలు చేస్తున్న సీఐ మల్లికార్జునరావు

మేదరమెట్ల : తిమ్మనపాలెం చెరువు వర్షానికి పూర్తిగా నిండింది. మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున చెరువు కట్ట తెగుతుందేమనని అధికారులు ముందుజాగ్రత్త చర్యగా చెరువు అలుగు వద్ద పూడిక తీయించారు. తిమ్మనపాలెం చెరువు అలుగు చిల్లచెట్లతో పూడిక పడి ఉండడంతో అలుగులో నుంచి నీరు బయటకు వెళ్లడానికి ఎక్కువ సమయం తీసుకుంటోంది. ఇది గమనించిన అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు మేదరమెట్ల ఎస్సై మహ్మద్‌రఫీలు ఎక్స్‌కవేటర్‌తో అలుగువద్ద పూడిక తీయించి అక్కడ ఉన్న చెట్లను తొలగించారు. దీంతో చెరువు నిండిన వెంటనే అలుగులోని నుంచి నీరు సులభంగా బయటకు వెళ్ళేందుకు మార్గం ఏర్పడింది. జాతీయ రహదారి వెంబడే ఈ చెరువు ఉండడంతో చెరువు నిండి కట్టలకు ఏదైనా ప్రమాదం జరిగితే రోడ్డు మూసుకుపోతుందనే ఉద్దేశ్యంతో ముందు జాగ్రత్తగా ఈ పనులు చేపట్టినట్లు మల్లికార్జునరావు తెలిపారు.

పునరావాస శిబిరాల్లో 150 మంది

మొంథాతుఫాను తీవ్రంగా ఉండడంతో గుండ్లకమ్మ రిజర్వాయర్ సమీపంలోని మత్స్యకారులను లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. మంగళవారం ఉదయం తమ్మవరం ఎర్రబాలెం గ్రామాల్లోని పునరావాస శిబిరాలకు మత్స్యకారులందరిని చేర్చారు. వారికి అవసరమైన భోజనం, వైద్యసౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేశారు. మిగిలిన శిబిరాల్లో కొద్దిమంది మాత్రమే ఉన్నట్లు తెలిసింది. కొరిశపాడు తహసీల్దార్ జీవీ.సుబ్బారెడ్డి, బాధితులందరిని పునరావాస శిబిరాలకు చేర్చడం వారికి తగు వసతులు కల్పించారు.

నల్లవాగు ఉధృతి

మండలంలోని బొడ్డువానిపాలెం వద్ద నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గతంలో నల్లవాగు ప్రవాహాన్ని కొందరూ రియాల్టర్లు పూడ్చివేశారు. మంగళవారం కురిసిన భారీ వర్షాలకు రియాల్టర్లు పోసిన మెరక మట్టి మొత్తం కోసుకుపోయి పాతమార్గంలోనే నీటి ప్రవాహం మొదలైంది. ఈ విధంగా ప్రవాహ మార్గం పూడ్చడంతో బొడ్డువానిపాలెం, విపర్లవారిపాలెంలో నీరు ఇళ్లలోనికి వస్తుందేమోనని గ్రామస్థులు ఆందోళన చెందారు.

వసతుల పరిశీలన


భవనాశి చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్

అద్దంకి : అద్దంకి పట్టణం, మండ లంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ శ్రీచరణ్, సీఐ సుబ్బరాజులు పరిశీలించారు. పలు పునరావాస కేంద్రాలలో 110 మంది వరకు ఉండడంతో వారికి అందుతున్న వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు ఉండడంతో వైద్యులు ద్వారా సహాయం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని భవనాసి చెరువు, అలుగు వద్ద పరిశీలించారు. పేరాయపాలెం వద్ద దోర్నపువాగు ఉధృతిని పరిశీలించి వాగు పొంగి ప్రవహిస్తే రాకపోకలు నిలిపి వేయాలని సిబ్బందిని ఆదేశించారు. గుండ్లకమ్మ ముంపు గ్రామమైన ధేనువకొండలో పరిశీలించి, రిజర్వాయర్ నీటికి సమీపంలో ఉన్న నివాస గృహాల ప్రజలు ఖాళీ చేయించి పునరావాస కేంద్రానికి పంపించారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలియచేయాలని తెలిపారు. ఆర్ఐ శంకర్, పలుశాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పునరావాసకేంద్రాలను పరిశీలించిన అధికారులు

మార్టూరు: మొంథా తుఫాను కారణంగా మార్టూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటుచేసిన పునరావాసకేంద్రంలో బాదితులకు తగు వసతులు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ టి.ప్రశాంతి తెలిపారు. వలపర్ల జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పునరావాసకేంద్రాన్ని ఎంఈవో వస్రాంనాయక్ పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా జాతీయరహదారిపై బొల్లాపల్లి టోల్ ప్లాజా నుంచి రాజుపాలెం కూడలి వరకు మండల పరిధిలోని హైవేపై వాహనాల రాకపోకలను, ట్రాఫిక్‌ను సీఐ ఎం శేషగిరి రావు ఆధ్వర్యంలో ఎస్ఐ సైదా పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలిస్తున్నారు. ఇంకా మార్టూరు లో సంపత్ నగర్‌లో ఏర్పాటుచేసిన కేంద్రన్ని ఎంపీ డీవో వై శ్రీనివాసరావు,డిప్యూటీ ఎంపిడీవో పి రామాంజనేయులు,పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావులు పరిశీలించారు. యద్దనపూడి మండలంలోని పూనూరు జడ్పి హైస్కూల్ లో ఏర్పాటుచేసిన పునరావాసకేంద్రాన్ని తహసీల్దారు కే.రవికుమార్, ఎస్ఐ టి.రత్నకుమారిలు పర్యవేక్షించారు. వారందరికీ భోజన ఏర్పాట్లతోపాటు మిగిలిన ఏర్పాట్లకు రెవెన్యూ సిబ్బందిని నియమించారు. మార్టూరులో విద్యుత్ కార్యాలయంలో డీఈఈ సురేంద్రబాబు ఆధ్వర్యంలో సిబ్బందిని విపత్తు నిర్వహణ కోసం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

పంగులూరు : మొంథా తుఫాన్ ప్రభావంతో గ్రామాలలో నెలకొన్న పరిస్థితులను అధికారుల బృందం మంగళవారం పర్యవేక్షించింది. ఎంపీడీవో కే.స్వరూపారాణి, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు నేతృత్వంలో అధికారులు పునరావాస కేంద్రాలను పరిశీలించి అందులో తలదాచుకున్న వారి అవసరాలను తెలుసుకోవడంతో పాటు తగిన సూచనలు చేశారు. గ్రామాలలోని రహదారులు, వంతెనల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. తుపాను తీవ్రతను ప్రజలకు వివరించిన అధికారులు తీరం చేరే వరకు ఎవరూ ఇంటి నుంచి బయటకు రావద్దని కోరారు. డ్రోన్లతో మండలంలో నెలకొన్న పరిస్థితులను అంచనా వేస్తున్నారు. కార్యక్రమంలో ఎస్.ఐ.వినోద్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్, కార్యదర్శి కల్యాణి గ్రామాలలో పర్యటించారు.

పునరావాస కేంద్రానికి తరలింపు


పునరావాస కేంద్రానికి తరలిస్తున్న తహసీల్దార్ గీతారాణి

వేటపాలెం (చీరాల) : మొంథా తుఫాన్ ప్రభావం మంగళవారం సాయంత్రం నుంచి తీవ్ర ప్రభావం చూపింది. దీంతో వేటపాలెం మండలం అక్కయ్యపాలెంకు ఎస్సీ, ఎస్టీ కాలనీకు చెందిన 62 మందిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ గీతారాణి ఆర్‌టీసీ బస్సు ద్వారా సురక్షితంగా పునరావాస కేంద్రానికి తరలించారు. అలాగే పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆయా పశువులకు సంబంధించిన యజమానులకు పలు సూచనలు చేశారు. చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాలకు సంబంధించి 45 టన్నులు దాణా ప్రభుత్వం సిద్ధం చేసింది. బుధవారం ఉదయం నుంచి యజమానులకు అందజేయనున్నారు.

లారీ ఎక్కిన రైలు ఇంజన్


లారీపై వెళుతున్న రైలు ఇంజన్

అద్దంకి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైలు ఇంజన్‌ను ట్రాలీ లారీలో తరలించడంతో అందరు ఆసక్తిగా గమనించారు. చెన్నై నుంచి ఢిల్లీకి వెళుతున్న ట్రాలీ లారీ మంగళవారం ఉదయం అద్దంకి పట్టణంలో నుంచి ప్రయాణించింది. రైలు ఇంజన్ రోడ్డుపైకి రావడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

వర్షాలకు దెబ్బతిన్న కూరగాయల తోటలు

- పలు గ్రామాలలో ఎడతెరిపి లేని వర్షాలతో ఎర్రగా వచ్చిన తోటలు
- లబోదిబో మంటున్న అన్నదాతలు


కొత్తపాలెంలో దెబ్బతిన్న సొర తోట

బల్లికురవ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో గ్రామాలలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండగా, సాగు చేసిన కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. బల్లికురవ మండలంలోని గంగపాలెం, కొనిదెన, వేమవరం, గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ, అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, వల్లాపల్లి, చెన్నుపల్లి, ఎస్ఎల్ గుడిపాడు, ముక్తేశ్వరం, రామాంజనేయపురం, నక్కబొక్కలపాడు, గ్రామాలలో రైతులు కూరగాయాల తోటలు సాగుచేశారు. సుమారు రెండు వందల ఎకరాల్లో వివిధ కూరగాయలు, ఆకుకూరలు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలకు ఈ తోటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో వర్షంతో దిగుబడులు పూర్తిగా తగ్గుతాయని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

కూరగాయల తోటలను పరిశీలించిన ఉద్యానాధికారి

మార్టూరు :తుఫాను కారణంగా కూరగాయల తోటల్లో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను ఉద్యానాధికారి బి.హనుమంతనాయక్ రైతులకు వివరించారు. మొంథా తుఫాను కారణంగా కూరగాయల తోటలను కాపాడుకోవడానికి రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో వలపర్ల, నాగరాజుపల్లి గ్రామాలలో వంగ, బెండ, గోరుచిక్కుళ్ల తోటలను ఆయన పరిశీలించారు. తోటల్లో వర్షపు నీరు నిలబడకుండా, నీటిని బయటకు పంపించేందుకు చిన్న కాలువలను ఏర్పాటుచేసుకోవాలని ఆయన రైతులకు సూచనలు చేశారు.

పెదగంజాం రోడ్డుకు టీడీపీ నేత మరమ్మతులు


ఇసుక బస్తాలు వేసి మరమ్మతు చేసిన టీడీపీ నేతలు

చినగంజాం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు చినగంజాం, పెదగంజాం గ్రామాల మధ్యగల ఎన్టీఆర్ వారిధి నుండి పెదగంజాం గ్రామానికి వెళ్లే రహదారిని పెదగంజాం టీడీపీ నాయకులు మంగళవారం మరమ్మత్తులు నిర్వహించారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆరు గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా మరమ్మత్తులు చేశారు. ఎన్టీఆర్ వారిధి నుండి పెదగంజాం గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో ఉన్న బకింగ్‌హామ్ కెనాల్, పెదగంజాం ఉత్తర భూములకు అనుసంధానముగా ఉన్నటువంటి డ్రైనేజ్ కాలువ వర్షాలకు పొంగిపొర్లుతూ రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తహసీల్దార్ జె.ప్రభాకర రావు, మండల టీడీపీ అధ్యక్షులు పొద వీరయ్య, టీడీపీ సీనియర్ నాయకులు ఆసోది సుబ్బారెడ్డిల పర్యవేక్షణలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా మరమ్మతులు నిర్వహించారు. ఈ రహదారిలో ఉన్న తూముల వంతెనకు గండి పడకుండా కర్రలు నాటి ఇసుక బస్తాలు అడ్డుపెట్టినట్లు గ్రామ టీడీపీ అధ్యక్షులు ఆసోది అంజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు కోకి భాస్కరరెడ్డి, సంద శ్రీనివాసరావు, వాటుపల్లి ఏడుకొండలు, గడ్డం కోటయ్య పాల్గొన్నారు. మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవీధిపాలెం గ్రామం నుండి కడవకుదురు గ్రామం వరకు గల ఆర్‌అండ్‌బీ రహదారి తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు గండ్లు పడి, రహదారిపై మోకాలలోతు వరకు వర్షపు నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. దీనితో మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవీధిపాలెం, కుంకుటచెట్లపాలెం, జీడిచెట్ల పాలెం గ్రామాల వారు రాకపోకలకు ఇబ్బందిగా ద్విచక్ర వాహనదారులు, ఆటోడ్రైవర్లు పేర్కొంటున్నారు.

ఉపాధి సిబ్బందికి సస్పెన్షన్

లేఖల అందజేత

బల్లికురవ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులలో అవకతవకలకు పాల్పడిన సిబ్బందికి అధికారులు సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఉత్తర్వులను ఎంపీడీవో కుసుమకుమారి సదరు సిబ్బందికి మంగళవారం అందజేశారు. ఇన్‌చార్జ్ ఏపీవో, ముగ్గురు టీఏలు, కంప్యూటర్ అపరేటర్లను జిల్లా పీడీ సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చారు. రెండు మాసాల క్రితం జరిగిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలో పనులలో లోపాలు ఉన్నట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి. అందుకు బాధ్యత వహిస్తు ఐదుగురు కార్యాలయ ఉద్యోగులతో పాటు రెండు గ్రామాల క్షేత్ర సహాయకులపై వేటు పడింది. అలానే మరో 12 మంది క్షేత్ర సహాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సస్పెండ్ లెటర్లు తీసుకొని వారికి పోస్టులో వారి చిరునామాకు పంపుతామని ఎంపీడీవో తెలిపారు.

31న మున్సిపల్ సమావేశం

అద్దంకి, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం 31న శుక్రవారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్ర తెలిపారు. పీపీపీ పద్ధతిలో రూ.15 కోట్లతో మినీ బైపాస్ నిర్మాణం, ఆదానీ గ్రూప్ సీఎస్ఆర్ నిధులతో అద్దంకి టౌన్‌హాల్ నిర్మాణం, రూ.3 కోట్లతో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు తో చేపట్టే 31 పనులకు సంబంధించి ఆమోదం తదితర 27 అంశాలతో అజెండాతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సహాయక కార్యక్రమాల్లో పాల్గొనండి

- టీడీపీ కార్యకర్తలకు మంత్రి దిశానిర్దేశం

అద్దంకి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దృష్ట్యా క్షేత్ర స్థాయిలో చేపట్టే సహాయ చర్యలలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. నియోజక వర్గంలోని గ్రామాలలో తుఫాన్ పరిస్థితిని ఎప్పటికప్పుడు స్థానిక అధికారుల దృష్టికి తీసుకు వస్తూ సమన్వయంతో ముందుకు పోవాలన్నారు. ప్రజలు బయటకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

లాడ్జిలో పేకాట నిర్వహణపై దాడులు

చీరాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఓ లాడ్జిలో పేకాట నిర్వహణపై వన్‌టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. అందిన సమాచారం మేరకు సీఐ సుబ్బారావు, ఎస్సై రాజ్యలక్ష్మీ సిబ్బంది, ఎస్బీ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈక్రమంలో ఆరుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.41,250 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలాలలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి

అద్దంకి,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో భారీ వర్షాలు కురుస్తున్నందున రైతులు తమ పంట పొలాలలో నీరు నిల్వ ఉండకుండా బయటకు వెళ్ళే విధంగా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట కాలువలు ఏర్పాటు చేసుకొని వర్షపు నీరు బయటకు పంపించుకోవాలని ఏవో క్రొత్తపాటి వెంకటకృష్ణ అన్నారు. గోవాడ, చినకొత్తపల్లిలలో పంట పొలాలను పరిశీలించారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకు పోవాలి


కల్వరిగిరిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజ్

చీరాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుండే యువతీ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యాలను ఎంచుకుని విజయాలు సాధించాలని సెయింట్ మార్క్స్ లూథరన్ కళాశాల ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజ్, లూథరన్ చర్చి సంఘ కాపరులు దేవదాసు, నానిబాబు అన్నారు. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో కళాశాల విద్యార్థి మంకెన కల్వరిగిరి పాల్గొని బంగారు పతకం సాధించాడు. జాతీయ స్థాయి అండర్ -19 తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు అతడిని ప్రత్యేకంగా అభినందించారు. ఆయనతో పాటు చీరాలకు చెందిన మరో ముగ్గురు పోటీలకు ఎంపికవడం విశేషం. కార్యక్రమంలో పలువురు కళాశాల బోధన బోధనేతర సిబ్బంది ఉన్నారు.


గర్భిణీని ట్రైనీ ఎస్సై సాయం


జోరు వానలో గర్భిణిని వైద్యశాలకు తరలిస్తున్న ట్రైనీ ఎస్సై గోపీ

పర్చూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం గర్నెపడి గ్రామానికి ఓ గర్భిణీకి పురిటినొప్పులు వచ్చాయి. వైద్యం నిమిత్తం ఆమె చిలకలూరిపేటకు పోవాల్సి ఉంది. గర్నెపూడి- అన్నబొట్ల పాలెం మధ్య ఉన్న నేలచప్టా వద్ద నీరు నిలిచి రాకపోకలకు ఆటకం ఏర్పడింది. దీంతో ఆమె బయటకు రాలేని పరిస్థితి ఉంది. విషయాన్ని గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న పర్చూరు ట్రైనీ ఎస్సై పులి గోపి హుటాహుటిన పోలీసు వాహనంలో గ్రామానికి చేరుకున్నాడు. అక్కడ నుంచి తన వాహనంలో 108 వాహనం వద్దకు చేర్చి వైద్యశాలకు పంపించారు. పోలీసులు చూపుతున్న చొరవను కొనియాడుతున్నారు.

చెట్లకొమ్మలు తొలగించేందుకు ఏర్పాట్లు

అద్దంకి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రోడ్ల కు అడ్డంగా చెట్లు పడితే తక్షణమే స్పందించి తొలగించేందుకు అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ తెలిపారు. మంగళవారం అద్దంకి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రధాన రోడ్లలో పరిశీలించటం జరిగిందన్నారు. ఏ సమయంలోనైనా సమాచారం అందిస్తే తక్షణమే తొలగించటం జరుగుతుందన్నారు.





లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

'సోమశిల'కు కొనసాగుతున్న ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం 35,600 క్యూసెక్కులు ఉండగా మంగళవారం నాటికి 41 వేల క్యూసెక్కులకు పెరిగినట్లు ఇంజనీర్లు తెలిపారు. దిగువకు గేట్ల ద్వారా 33,460 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 67.279 టీఎంసీలు నిల్వ ఉండగా, పెన్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురుస్తుండటంతో వచ్చే ప్రవాహం పెరిగే అవకాశం ఉంది.

● 'కండలేరు'లో 58.74 టీఎంసీలు

రాపూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాంకు వరద ప్రవాహం కొనసాగుతంటోంది. జలాశయం సామర్థ్యం 68.03 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 58.74 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 10,600 క్యూసెక్కులుగా నమోదైంది. హెడ్ రెగ్యులేటర్ నుంచి 1450 క్యూసెక్కులు, సత్యసాయి కాలువకు 600, పిన్నేరు వాగుకు 1700, ఫస్ట్ బ్రాంచ్ కాలువకు 5, రాపూరు తాగు నీటి పథకానికి 5 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

● 'రాళ్లపాడు'లో 4 గేట్ల ఎత్తివేత

లింగసముద్రం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : 'మొంథా' ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టులోకి వరద ప్రవాహం వస్తోంది. ప్రాజెక్టులోకి 10,500 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో డీఈలు ఎం వెంకటేశ్వర్లు, పి శేషయ్య, ఏఈ మనోహర్‌లు మంగళవారం ప్రాజెక్టు కొత్త స్పిల్‌వేలోని నాలుగు గేట్లను 2 అడుగుల మేర ఎత్తి 18,500 క్యూసెక్కుల నీటిని మన్నేరుకు విడుదల చేశారు. అయితే ప్రాజెక్టులో వచ్చే ప్రవాహాన్ని బట్టి మన్నేరుకు నీటిని విడుదల చేస్తామని డీఈ వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రాజెక్టులో 18.6 అడుగల నీటిమట్టం ఉంది.

● 'గండిపాళెం'లో 12 అడుగులకు..

ఉదయగిరి : గండిపాళెం జలాశయం నీటిమట్టం 35 అడుగులు కాగా, 12 అడుగులకు నీరు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి పేర్కొన్నారు. పైతట్టు ప్రాంతాల్లో దున్నపోతుల, పిల్లాపేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో 420 క్యూసెక్కుల నీటి ప్రవాహం జలాశయంలోకి వస్తున్నట్లు తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున జలాశయం నీటి మట్టం ఇంకా పెరిగే అవకాశముందని ఆయన తెలిపారు.



కందుకూరులో పేదలను పునరావాస కేంద్రానికి తరలిస్తున్న పోలీసులు

● ఉదయగిరి రూరల్ (వరికుంటపాడు) : నక్కలగండి జలాశయం జలకళను సంతరించుకుంది. జలాశయ సామర్థ్యం 22 అడుగులు కాగా ఇప్పటివరకు 19 అడుగుల మేర నీరు చేరినట్లు ఇరిగేషన్ ఏఈ రమేష్ తెలిపారు. ప్రస్తుతం వరద కొనసాగుతుండటంతో బుధవారం అలుగు పారే అవకాశం ఉంది.

పొట్టేళ్లవాగులో వృద్ధురాలి గల్లంతు

మనుబోలు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మనుబోలు మండలం గొట్లపాళెం వద్ద పొట్టేళ్లవాగు ఉధృతికి మంగళవారం అదే గ్రామానికి చెందిన కిష్టమ్మనేని జయమ్మ(65) గల్లంతైంది. గ్రామంలోని రేషన్ డీలర్ మురళి తల్లి జయమ్మ నిత్యం వాగుదాటి పశువుల మేపేందుకు వెళుతుంది. రోజూలాగే మంగళవారం ఉదయం వెళ్ళింది. సాయంత్రం తిరిగి వచ్చే క్రమంలో వాగు ప్రవాహంలో కొట్టుకుపోయింది. సమీప పశువుల కాపరులు గుర్తించి గ్రామంలో సమాచారం అందించారు. హుటాహుటిన పోలీసులు వాగువద్దకు చేరుకుని జయమ్మ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



నెల్లూరు : తల్పగిరి కాలనీలో వర్షపు నీరు



కావలి : వర్షపు నీటి మునకలో అన్నపుగుంట ప్రాంతం

మరో 36 గంటలు..
భారీ వర్షం

● జిల్లాపై మొంథా ఎఫెక్ట్ ● రోజంతా వర్షం
● పొంగి పొరలుతున్న వాగులు, వంకలు
● లోతట్టు ప్రాంతాల జలమయం
● పరిస్థితిని పర్యవేక్షిస్తున్న కలెక్టర్, అధికారుల బృందం

మొంథా తుఫాన్ తీరం దాటినా మరో 36 గంటలపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మరోవైపు తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురవడం మినహా జిల్లాలో మరెలాంటి నష్టం సంభవించలేదు. ఈదురుగాలుల ప్రభావం కూడా చాలా తక్కువగా కనిపించింది. తీర ప్రాంతాల్లో మాత్రం సముద్రం అల్లకల్లోలంగా కనిపించడంతో సరిసర ప్రాంత ప్రజలు హడలిపోయారు. కృష్ణపట్నం ఓడరేవులో 8వ నంబరు ప్రమాద సూచికను ఎగురవేశారు.

● 12 మండలాల్లో 40 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో లోతట్టుప్రాంతాలు, తీరప్రాంతాలలోని 2,300 మందిని ఈ కేంద్రాలకు తరలించారు.

● భారీ వర్షాల కారణంగా 450 కి.మీ పొడవున ఆర్అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. పది కల్వర్టులు దెబ్బతినగా, నాలుగు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు పారుతోంది. సుమారు రూ.19 కోట్ల మేర ఆర్అండ్‌బీ శాఖకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.

- పూర్తి వివరాలు 8లో..

పంట నష్టం ఇలా..

నెల్లూరు (సాంస్కృతికం) : తుఫాన్ కారణంగా జిల్లాలో దాదాపుగా 3249.25 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు మంగళవారం సాయంత్రానికి వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. 326.5 ఎకరాల్లో చేతికొచ్చిన వరి పైరు, 10 ఎకరాల్లో సజ్జ, 4.25 ఎకరాల్లో మొక్కజొన్న, 28.5ఎకరాల్లో వేరుశనగ దెబ్బతిన్నాయి. మొత్తంగా 16 మండలాల్లో 48 గ్రామాలకు చెందిన 1141 మంది రైతులు చెందిన పంటలు దెబ్బతిన్నట్లుగా వ్యవసాయ శాఖ తెలిపింది.



మనుబోలు : నీటమునిగిన సంగమేశ్వర ఆలయం



ఉదయగిరిలో దెబ్బతిన్న వరిపైరు



అల్లూరులో ఈదురుగాలులు..

విద్యాసంస్థలకు నేడు కూడా సెలవు

నెల్లూరు (విద్య), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున బుధవారం కూడా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్తర్వులను ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఎంఈఓలు విధిగా అమలు చేయాలని డీఈఓ బాలాజీరావు, ఆర్ఐఓ వరప్రసాద్‌రావు తెలిపారు.

పునరావాస కేంద్రాల్లో జాగ్రత్తలు తీసుకోండి

● జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి ఎన్.యువరాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, మండల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లో వసతుల గురించి అధికారులతోపాటు ఆశ్రయం పొందుతున్న వారితో నేరుగా మాట్లాడారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ చెరువులకు గండి పడే అవకాశం ఉంటే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పూర్తిగా నిండిన చెరువుల వద్ద పోలీసు, రెవెన్యూ అధికారులు గస్తీ ఉంటూ సమీప గ్రామ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పొరుగు జిల్లాల నుంచి మన ప్రాజెక్టులకు వస్తున్న వరద నీటిని అంచనా వేసి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

వర్షంతో స్తంభించిన జనజీవనం

లింగసముద్రం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. ముత్యాలపాడు ఎస్టీ కాలనీలోకి నీరు చేరింది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో కే.శ్రీనివాసులు మోటారు ఏర్పాటు చేయించి నీటిని తోడించారు. పెదపవని బస్టాండ్ సెంటర్‌లో పెద్ద వేపచెట్టు నేలకూలింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వీఆర్ కోట పంచాయతీ బ్రాహ్మణపల్లిలో ఇల్లు కూలింది. గ్రామాల్లో వీధులు, ఆర్అండ్‌బీ రోడ్లు జలమయమయ్యాయి. రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందిపడ్డారు.

బ్రాహ్మణపల్లిలో వర్షానికి కూలిన ఇల్లు →



ఎడతెరిపి లేని వర్షం

● లోతట్టు ప్రాంతాల జలమయం ● స్తంభించిన జనజీవనం



కందుకూరు : ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కందుకూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో సోమవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. ఈ ప్రాంతంలోని అన్ని మండలాల్లో ఒక్కరోజులోనే సరాసరిన 15 సెం.మీటర్లకు పైగా వర్షపాతం నమోదవటంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కందుకూరు పట్టణంతో పాటు అనేక గ్రామాలలో లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. కందుకూరు ప్రాంతంలో రాళ్లవాగు, ఎర్రవాగు పొంగిప్రవహిస్తుండటంతో పలుమార్గాలలో రాకపోకలు నిలిచిపోయాయి. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు కోటారెడ్డినగర్, సుల్తాన్‌మొహిద్దీన్ నగర్, కేసరిగుంట, కేసరిగుంట కాలనీ, శ్రీనగర్‌కాలనీ, బండపాలెం జనార్ధన ఎస్టీ కాలనీలు జలమయమయ్యాయి. కోటారెడ్డినగర్‌లోని అనేక ప్రాంతాలలో మోకాటిలోతున వర్షపునీరు నిలిచింది. గుణ్ణంకట్ట కుంట పొంగిప్రవహిస్తుండటంతో సుల్తాన్‌మొహిద్దీన్ నగర్‌లోని నీరు నిలిచింది. కేసరిగుంట కాలనీ జలమయం అయింది. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. తహసీల్దారు లావణ్య, మున్సిపల్ కమిషనర్ అనూష, పట్టణ ఎస్ఐ శివనాగరాజు దగ్గరుండి పునరావాస కేంద్రాలకు తరలించడంతో పాటు ఏర్పాట్లును పర్యవేక్షించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు నేతృత్వంలో పేదలకు ఆహార పొట్లాలు, దుస్తులు, చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వైసీపీ నాయకులు రఫీ, గంగిరెడ్డి ఆధ్వర్యంలో శివారుప్రాంతంలో పేదలకు ఆహారపొట్లాల పంపిణీ చేశారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో మాచవరం, మోపాడు గ్రామాలలో సాగుచేసి కోత దశలో ఉన్న వరిపైరుకు తీవ్రనష్టం వాటిల్లింది. మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌రహీం మాచవరంలో వరి పైరును పరిశీలించి నష్టం అంచనాలను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.

● **బిట్రగుంట :** బోగోలు మండలంలో మంగళవారం ఎడతెరిపి లేని కుండపోత వర్షం కురుస్తుంది. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద సముద్ర అలలు సుమారు 10 నుంచి 14 అడుగుల ఎత్తు ఎగసి పడుతున్నాయి. తాటిచెట్లపాలెం సముద్రతీరంలో అలలు ఉధృతంగా వీస్తుండటంతో తీరం కోతకు గురైంది. జక్కేపల్లిగూడూరు, కడనూతల, బోగోలు చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. పాతబిట్రగుంట పంచాయతీ కొండబిట్ర గుంట గిరిజన కాలనీలో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. అంతర్గత రోడ్లు జలమయం అయ్యాయి. సాయంత్రం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా ఏఈ జడరాయ చర్యలు చేపట్టారు. తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు భరత్‌కుమార్, ఆర్ఐ రామకుమారిలు ఎస్వీపాలెం, సీఆర్‌పాలెం, తాటిచెట్లపాలెంలో పర్యటించారు. తీరప్రాంతం లో కావలి రూరల్ సీఐ పాపారావు, స్థానిక ఎస్ఐ ప్రభాకర్ పర్యటించారు.

● దగదర్తి తహసీల్దారు కృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్ఐ జంపాని కుమార్‌లు వేర్వేరుగా పర్యటించి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు గిరిజన కాలనీకి చెందిన 90 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. అనంతవరంకు వచ్చిన కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ గిరిజనులను కలిసి మాట్లాడారు. అలాగే దగదర్తి గ్రామ పరిసర ప్రాంతాల వారిని జడ్పీ ఉన్నత పాఠశాలకు తరలించారు. టీడీపీ మండల యువత అధ్యక్షుడు వడ్డే వినయ్‌కుమార్ పండ్లు, బిస్కెట్ పాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో బాలయ్య, వీఆర్ఏలు శ్రీనివాసులు, సునీత, యువత ముప్పాళ్ల తరుణ్ తదితరరులు పాల్గొన్నారు.

● **కావలి రూరల్ :** మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం సముద్రతీర ప్రాంతాలను ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, రూరల్ సీఐ రాజేశ్వరరావులు పర్యటించి లోతట్టు ప్రాంతాల్లో పేదలను పునరావాస కేంద్రాలకు తరలించారు. బుడంగుంట ఎస్టీ కాలనీ, అన్నగారిపాలెం పంచాయతీ వెంకటేశ్వరపురం, లక్ష్మీపురం గ్రామాలల్లో పూరిగుడిసెల్లో నివశించే గిరిజనులను పునరావాస కేంద్రాలకు తరలించారు. మద్దూరుపాడు టిడ్కో గృహాల సముదాయాలలో నిల్వచేరిన వర్షపు నీటిని, జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై వర్షపు నీరు నిల్వచేరి హైవే పైకి చేరుతుండటాన్ని గుర్తించిన సీఐ ఎక్స్‌వేటర్ తో కాలువలు తీయించి పక్కకు మళ్లించారు.



బిట్రగుంట : తాటిచెట్లపాలెంలో ఎగసిపడుతున్న సముద్రపు అలలు

● **అల్లూరు :** తుఫాన్ ధాటికి తీరప్రాంత మండలమైన అల్లూరులో సోమవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. ఈదురుగాలులకు చెట్లు ఊగిపోయాయి. ఇస్కపల్లిలో సము ద్రం అల్లకల్లోలంగా ఉండడంతో అధికార యం త్రాంగం ఎవ్వరినీ సముద్రం వద్దకు వెళ్లనీయకుండా చర్యలు చేపట్టారు.

● **కొండాపురం :** మండలంలో వాగులు, వంకలు పొంగి చెరువులన్నీ దాదాపుగా నిండాయి. తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో ఆదినారాయణరావు, ఎస్ఐ మాల్యాద్రిలు ప్రమాదకరంగా ఉన్న సాయిపేట చెరువును పరిశీలించారు. కొండాపురం-రేణమాల మధ్య ఉప్పుటేరు, కొమ్మి దగ్గర గండికట్ల చెరువు అలుగు, సత్యవోలు వద్ద మిడతవాగు, చింతలదీవి వద్ద ఉప్పుటేరులనే అధికారులు పరిశీలించారు. శాయిపేట పంచాయతీలోని కొమ్ముపాలెంలో రోడ్లపై నీరు నిలవడంతో అక్కడకువెళ్లిన అధికారులు, జిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ డైరెక్టరు తాటికొండ అనూష 10 కుటుంబాలకు ఆహార పొట్లాలు అందజేశారు. కార్యదర్శి ప్రదీప్, ఇరిగేషన్ ఏఈ రమేష్‌కుమార్, నేతలు ప్రవీణ్, వల్లూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కావలిరూరల్ : సర్వీస్ రోడ్డులో నీరు



కొండాపురం : పర్యవేక్షిస్తున్న అధికారులు

రాజకీయ చైతన్యంతోనే బీసీల అభ్యున్నతి

● మాజీ ఎమ్మెల్సీ బీదాటి

కావలి(టౌన్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాజకీయ చైతన్యంతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ బీదాటి రాధాకృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం ముసునూరులోని ఈడెన్ గార్డెన్స్ హాల్‌లో బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్ అధ్యక్షతన మొదటి వార్షికోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాధాకృష్ణయ్య మాట్లాడుతూ బీసీలు ఆర్థికంగా రాజకీయంగా ఎదిగినప్పుడే అసలైన అభివృద్ధి అన్నారు. చివరగా రాధయ్యను వివిధ బీసీ కులాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ భవన్ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి చిన్నివరప్రసాద్, గౌరవాధ్యక్షుడు గోవిందు, మాజీ జెడ్పీటీసీ నాయుడు రాంప్రసాద్, బీజేపీ నేత కుట్టుబోయిన బ్రహ్మానందం, బీసీ సంఘాల నేతలు బాలజీ, గోపాల్, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీదాటిని సత్కరిస్తున్న నేతలు

అంకమ్మ ఆలయ ప్రాంగణంలో గదుల నిర్మాణానాకి హైకోర్టు బ్రేక్!



నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

కందుకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామ దేవత అంకమ్మ ఆలయ ప్రాంగణంలో ఎటువంటి నిర్మాణాలు చేయరాదని, ఆలయానికి ఉన్న 1.52 ఎకరాలను దైవిక కార్యక్రమాల నిర్వహణలో భక్తుల సౌకర్యం కోసం ఉంచాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అమ్మవారి ఆలయ ఆదాయం పెంపే లక్ష్యంగా ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వల్ల భక్తులకు అసౌకర్యం కలుగుతుందని అందువల్ల నిర్మాణాలను నిలుపుదల చేయాలని తానికొండ వెంకటేశ్వరరావు దాఖలు చేసిన పిటీషన్‌ను విచారించిన కోర్టు కొంతకాలం నిర్మాణాలపై స్టే విధించాక గతనెల 29న స్టే ఎత్తివేస్తూ షాపులు, భవనాలు నిర్మాణాలు చేయరాదని ఉత్తర్వులు జారీ చేసింది. గదుల నిర్మాణాన్ని తక్షణం నిలిపివేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే సెలవులు, వర్షాలకారణంగా ఆ జడ్జిమెంట్ కాపీ రావటం ఆలస్యం కావటంతో గత 20 రోజులుగా షాపుల నిర్మాణం వేగంగా జరుగుతోంది. అయితే ఆలయ ఈవో కార్తీక్ మంగళవారం కూడా ఆలయ ప్రాంగణం 1.52 ఎకరాలలో మాత్రమే నిర్మాణాలు వద్దని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే మొత్తం ప్రాంగణం 2.30 ఎకరాలు అయినందున మిగిలిన 78 సెంట్లులోనే షాపుల నిర్మాణం జరుగుతుందని, దీనికి ఎలాంటి ఆటంకం లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే సాంకేతికంగా రూములు నిర్మాణం జరుగుతున్నది ఆలయానికి చెందిన 1.52 ఎకరాలలోని స్థలంలో అయినందున ఈవో నిర్ణయం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని పిటీషన్‌దారులు విమర్శిస్తున్నారు. ఈవో, ఇతర బాధ్యులపై కోర్టు ధిక్కారణ పిటీషన్ దాఖలుచేస్తామని చెబుతున్నారు.

కారు డ్రైవరు మృతితో కావలిలో విషాదం



రవికుమార్ (ఫైల్)

కావలి రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు ఎస్సీ కాలనీకి చెందిన కారు ఒనర్ కం డ్రైవర్ గండూరి రవికుమార్(56) మంగళవారం తిరుపతి జిల్లా నాయుడుపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం పోషణ కోల్పోయింది. సీనియర్ డ్రైవర్‌గా, అయ్యప్ప గురుస్వామిగా పట్టణంలో మంచి పేరు తెచ్చుకున్న రవికుమార్ 2014-19 టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్ నుంచి కారు రుణం పొంది కుటుంబాన్ని పోషించుకొంటున్నాడు. తన పెద్ద కుమారుడు మణికంతను ఆయుర్వేద వైద్యుడిని చేశాడు. చిన్న కుమారుడు బాలసుబ్రహ్మణ్యం బీఎస్సీ నర్సింగ్ చేస్తున్నాడు. అందరి తో కలివిడిగా ఉండే రవికుమార్ మృతితో ఎస్సీకాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. భార్య స్వర్ణలత, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అయ్యప్ప మాలలో ఉన్న రవికుమార్ మృతి పట్ల స్టాండ్‌లోని కారు డ్రైవర్లు సంతాపం తెలిపారు.

మండలం	వర్షపాతం
కందుకూరు	145.8
కావలి	130.4
దగదర్తి	117.0
జలదంకి	113.2
అల్లూరు	110.8
విడవలూరు	109.6
కొడవలూరు	109.4
వులవపాడు	106.4
గుడ్లూరు	104.8
బోగోలు	97.8
వలేటివారి పాళెం	90.0
కలిగిరి	89.8
కోవూరు	88.2
లింగసముద్రం	83.4
టీపీ గూడూరు	83.0
నెల్లూరు అర్బన్	80.6
వింజమూరు	78.8
కొండాపురం	78.6
సంగం	76.6
ఉదయగిరి	75.4
ఇందుకూరుపేట	74.4
ఏఎస్‌పేట	72.8
నెల్లూరు రూరల్	72.4
పొదలకూరు	71.6
బుచ్చిరెడ్డి పాళెం	71.0
చేజర్ల	69.2
వరికుంటపాడు	67.8
వెంకటాచలం	63.6
ఆత్మకూరు	59.2
ముత్తుకూరు	57.4
సైదాపురం	55.2
మర్రిపాడు	54.4
దుత్తలూరు	52.8
మనుబోలు	52.8
కలువాయి	51.0
అనంతసాగరం	47.4
సీతారాంపురం	40.4
రాపూరు	25.2



మరో 36 గంటలు

భారీ వర్షం

- జిల్లాపై మొంథా ఎఫెక్ట్
- రోజంతా ఎడతెరిపి లేని వాన
- పరిస్థితిని పర్యవేక్షిస్తున్న కలెక్టర్, అధికారుల బృందం

నెల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని గడగడలాడిస్తున్న మొంథా తుఫాను జిల్లాను మాత్రం కాస్త కరుణించింది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం రాత్రి వరకు 24 గంటలపాటు ఎడతెరపి లేకుండా ఓ మోస్తారు వర్షం కురవడం మినహా జిల్లాలో మరెలాంటి నష్టం సంభవించలేదు. ఎడతెరపి లేని వర్షం కారణంగా మంగళవారం కూడా జిల్లావ్యాప్తంగా జనజీవనం స్తంభించింది. భారీ వర్ష సూచనలతో దాదాపు ప్రజలంతా ఇళ్లకే పరిమితం అయ్యారు. జిల్లా సగటు వర్షపాతం 79.7 మి.మీ నమోదైంది. వాతావరణ శాఖ ప్రకటనల ప్రకారం మొంథా తుఫాను ప్రభావం నెల్లూరు జిల్లాపై ఎక్కువగా ఉంటుందని భావించారు. సోమవారం సాయంత్రం నుంచే జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భావించారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధపడింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకుంది. అయితే అదృష్టవ శాత్తు సోమ, మంగళవారం రాత్రి 8 గంటల వరకు జిల్లాలో మోస్తారు వర్షాలు తప్ప ఎక్కడా భారీ వర్షాలు నమోదు కాలేదు. ఈదురుగాలుల ప్రభావం కూడా చాలా తక్కువగా కనిపించింది. అయితే తీర ప్రాంతాల్లో మాత్రం సముద్రం అల్లకల్లోలంగా కనిపించడంతో పరిసర ప్రాంత ప్రజలు హడలిపోయారు. కృష్ణపట్నం ఓడరేవులో 8వ నంబరు ప్రమాద సూచికను ఎగురవేశారు. బిట్రగుంట ఫిషింగ్ హార్బర్ సముద్ర అలల తాకిడికి అల్లాడిపోయింది.

● ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం కారణంగా నెల్లూరు నగరంలో రోడ్లు జలమయం అయ్యాయి. మురుగు, వర్షపు నీళ్లతో ట్రంక్ రోడ్డు, గాంధీనగర్ వేదాయపాళెం సెంటర్లు మడుగులుగా కనిపించాయి. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. నగరంలోని లోతట్టు ప్రాంతాలు అయిన తల్పగిరి, సప్తగిరి నగర్ కాలనీలు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి నీరు ప్రవేశించాయి. కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు-తెట్టు రహదారిలో పొట్లూరు వద్ద రాళ్ల వాగు ఉధృతంగా ప్రవహించడంతో కావలి-గుడ్లూరు మధ్య రాకపోకలు స్తంభించాయి. జలదంకి పంచాయతీ గమల్లపాలెం గ్రామంలో ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వరద నీటిలో జిల్లా పరిధిలోని ప్రాజెక్టులు, చెరువులు నిండుకుండల్లా మారాయి. మంగళవారం ఉదయం నుంచి కలెక్టర్ హిమాన్షు శుక్లా, ప్రత్యేక అధికారి యువరాజులు జిల్లాలో తుఫాను పరిస్థితిని సమీక్షించారు. ట్రాన్స్‌కో సీఎండీ శివశంకర్ కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లో తిష్ఠ వేసి ఎక్కడా విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించారు. వాతావరణం శాఖ అంచనా ప్రకారం మంగళవారం అర్ధరాత్రి 11 గంటలకు తుఫాను తీరం తాకుతుంది. అప్పటి నుంచి మరో 36 గంటల వ్యవధిలో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న సంకేతాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తం అయ్యింది.


నెల్లూరు : తెలుగుగంగ కాలనీలో ఇళ్ల వద్ద నీరు


కావలి : తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ట్రంకురోడ్డుపై పడిపోయిన చెట్టు


జలదంకి : గమల్ల పాలెంలో ఇళ్లలోకి నీరు


ఉదయగిరిలో నేలకొరిగిన వరి పైరును పరిశీలిస్తున్న అధికారులు


నెల్లూరు : సండేమార్కెట్ దుస్థితి


జలదంకి : ఊళ్లవాగు వద్ద రాకపోకలు నిలిపివేస్తూ రోడ్డుకు అడ్డంగా వేస్తున్న కంప


ముత్తుకూరు : పొంగిపొర్లుతున్న బకింగ్‌హాం కాలువ


నెల్లూరు : వరద పరిస్థితిపై ఆరా తీస్తున్న కలెక్టర్ శుక్లా, కమిషనర్ నందన్, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి


: నెల్లూరు : ములుముడిలో మగ్గం గుంతల్లోకి వచ్చిన నీటిని ఎత్తిపోస్తున్న కార్మికుడు

తుఫాన్ బాధితులకు అండగా..


కోవూరు : బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


ఉదయగిరి : ఉజ్జంపల్లిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్


కావలి: పెంకులఫ్యాక్టరీ గిరిజన కాలనీలో ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి


నెల్లూరులో ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి


కొండాపురం : కొమ్ముపాలెంలో ఆహార పొట్లాలు అందచేస్తున్న తానికొండ అనూష


ఆత్మకూరు : నెల్లూరుపాళెంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఆహారం పంపిణీ


పొదలకూరులో ఆహారం పంపిణీ చేస్తున్న స్థానికులు

నగరానికి చిన్నజీయర్ రాక

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళవారం రాత్రి నెల్లూరు అల్లీపురంలోని విడిది గృహానికి చేరుకున్నారు. ఆయనకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారు బుధవారం మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం పునర్నిర్మాణ శంకుస్థాపనకు హాజరవుతారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణ చేస్తారు.

● నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం రాత్రి శివపార్వతులకు ప్రాకారోత్సవం జరిగింది. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు జరిగాయి. సాయంత్రం భారీ సంఖ్యలో భక్తులు కార్తీక దీపారాధనలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

మాతృసంస్థకు ఏపీఐఐసీ డీజెడ్ఎం..

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) ఏపీఐఐసీ(ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) డీజెడ్ఎంగా ఉన్న వెంకట సురేష్‌ను మాతృ సంస్థ అయిన పరిశ్రమల శాఖకు బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. పరిశ్రమలశాఖ డీడీ(డిప్యూటీ డైరక్టర్)గా విజయవాడకు ప్రధాన కార్యాలయానికి ఆయన్ను బదిలీ చేశారు.ఇక్కడ ఏపీఐఐసీలో ఐదేళ్లపాటు ఉత్తమసేవలు అందించిన ఆయన్ను ఏపీఐఐసీ అధికారులు,సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్,శేఖర్ రెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

భోజనం, దుప్పట్ల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం) : నగరానికి చెందిన డాడీ యూత్ ఫౌండేషన్ మంగళవారం మొంథా తుఫాన్ వర్షంలో చిక్కుకున్న యాచకులు, అనాథలు, వృద్ధులకు భోజనం, దుప్పట్లు పంపిణీ చేసింది.

వీఎస్‌యూలో నిర్లక్ష్య వైఖరి

- తుఫాన్ అయినా పరీక్షలు, తరగతుల నిర్వహణ
- విమర్శలతో అప్పటికప్పుడు వాయిదా ప్రకటన

వెంకటాచలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా వ్యాప్తంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అన్ని శాఖల అధికారులను గత రెండు రోజులుగా అలర్ట్ చేస్తున్నారు. ఈక్రమంలో రెండు రోజులుగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సెలవులు ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేశారు. కానీ విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అధికారలుఉ మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో తుఫాన్ ప్రభావం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరికలు చేసిన ఈనెల 27న జిల్లా వ్యాప్తంగా డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించి వర్సిటీ విమర్శల పాలైంది. అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలలకు ఈనెల 27వ తేదీ సెలవు ప్రకటించకపోవడంతో పలు కళాశాలలు తరగతులు నిర్వహించాయి. దీంతో వర్సిటీ అధికారుల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. కొందరు వర్సిటీ అధికారులు నియంతల్లా వ్యహరిస్తుండడంతోనే తరచుగా యూనివర్సిటీ విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

● సెలవు ప్రకటించడంలో నిర్లక్ష్యం

తుఫాన్ ఉగ్రరూపం దాల్చడంతో మంగళవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. అయినా కళాశాలలకు ముందుగానే సెలవు ప్రకటించడంలో వర్సిటీ అధికారులు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించారు. మంగళవారం జరగాల్సిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను సైతం వాయిదా వేయకపోవడం గమనార్హం. దీనిపై సోషల్ మీడియా వేదికగా విమర్శలు రావడంతో అప్పటికప్పుడే వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత స్పందించి మంగళవారం ఉదయం 7.40 గంటల ప్రాంతంలో వర్సిటీ అధికారిక వాట్సాప్ గ్రూప్‌లలో మంగళవారం జరగాల్సిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు. అలాగే యూనివర్సిటీ తోపాటు అనుబంధ కళాశాలలకు సెలవు ప్రకటిం చారు. ఈ క్రమంలో అధికారుల తీరుపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.



విద్యుత్ అంతరాయం ఏర్పడిన స్వర్ణముఖి మహిళా వసతి గృహం

● చీకట్లో విద్యార్థినులు

వర్సిటీ వసతి గృహంలో మంగళవారం అంధకారం అలముకుంది. యూనివర్సిటీ ప్రాంగణంలోని స్వర్ణముఖి మహిళా వసతి గృహనికి వచ్చే విద్యుత్ లైన్‌లో సమస్య ఏర్పడింది. దీంతో విద్యుత్ అంతరాయం నెలకొని విద్యార్థినులు చీకట్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తుఫాన్ ఉందని తెలిసి కూడా హాస్టల్ మెయిన్ ఎలక్ట్రీషియన్‌కు సెలవు ఇవ్వడం, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవ డంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమస్య ఈనెల 21వ తేదీ కూడా ఏర్పడింది. దీనిపై రిజిస్ట్రార్‌ను వివరణ కోరగా ప్రత్యామ్నాయ ఎలక్ట్రీషియన్లతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీ అభ్యర్థులకు ఎస్ఐ, కానిస్టేబుల్, టెట్, డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ షేక్ హైపా ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు నెల్లూరులోని మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో కానీ, 89785 21854 నంబరులోకానీ సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఐఈఆర్పీల సర్టిఫికెట్లు పరిశీలన పూర్తి

నెల్లూరు(విద్య), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల భవిత కేంద్రాల్లోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 88 మంది ఐఈఆర్‌పీల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం పూర్తయింది. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీ రావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో త్రిసభ్య కమిటీ రెండురోజులపాటు సర్టిఫికెట్లను పరిశీలించి నిర్ధారణ చేశారు. పూర్తయిన వారి వివరాలను డీఈవో లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో వెరిఫికేషన్ చేసి, అందులో తప్పులుంటే తిరిగి ఐఈఆర్‌పీల లాగిన్‌కు పంపిస్తామని డీఈవో తెలిపారు. వీటిని సరిదిద్ది తిరిగి సబ్‌మిట్ చేసిన తరువాత, ఎంఈవోల లాగిన్ ద్వారా వాటిని వెరిఫై చేసిన అనంతరం అప్రూవల్ చేసి డీవోఈ లాగిన్‌కు పంపాలన్నారు. ఈ పరిశీలనలో డిప్యూటీ ఈవో వెంకటేశ్వరనాయక్, టీపీగూడూరు ఎంఈవో జయరామ్‌నాయుడు, టీపీగూడూరు జడ్పీ హెచ్ఎం రియాజ్ అహ్మద్, ఎస్ఎస్ఏ సహిత విద్యా కోఆర్డినేటర్ పీ.ప్రసాద్‌రావు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో ఎస్పీ పరిశీలన

ఇందుకూరుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలోని ముంపు ప్రాంతాలను ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల మంగళవారం సందర్శించారు. పునరావాసం, సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఇందుకూరుపేట మండల పరిధిలోని ముదివర్తిపాలెంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు ఆహారం, వైద్యసేవలు, నీరు ఇతర వసతులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ జిల్లా వ్యాప్తంగా ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల సేవలను వినియోగించుకోవాలన్నారు. 24గంటలు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అత్యవసర పరిస్థితి వచ్చినా, సమస్యలకు గురైనా ప్రజలు వెంటనే డయల్ 112కుగానీ పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 93929 03413చ 94407 96383, 94407 96370లకు గానీ సమాచారం తెలపాలని కోరారు.

పోర్టులో 8వ నెంబరు ప్రమాద హెచ్చరిక

- గాలులతో వణుకుతున్న తీరం


కృష్ణపట్నం తీరంలో ఎగిసిపడుతున్న అలలు

ముత్తుకూరు (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ తీరానికి చేరువవుతున్న కొద్దీ కడలి కల్లోలంగా మారింది. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు, వేగంగా వీచే ఈదురుగాలులు తీరప్రాంతాన్ని వణికిస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో తీర గ్రామాల ప్రజలు ఇళ్లలోనే ఉండిపోయారు. తుఫాన్ తీవ్రత దృష్ట్యా అదానీ కృష్ణపట్నం పోర్టు అధికారులు 8వ నెంబరు ప్రమాద హెచ్చరిక జెండా ఎగురవేశారు. సముద్రం ఉధృతంగా ఎగిసిపడుతుండడంతో అలలు తీరం కట్టలు తాకుతూ ముందుకు వస్తున్నాయి. తీర ప్రాంత గ్రామాలైన నేలటూరు, పైనాపురం, దళితవాడ, గిరిజకాలనీల్లో వర్షపు నీరు రోడ్లను ముంచేసి ఇళ్లలోకి చేరింది. సరైన డ్రైనేజీ వ్యవస్థలేక రహదారులు నీటమునిగాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా అంతరాయం కలిగింది. నక్కల కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. పొట్టెంపాడు బ్రిడ్జి వద్ద తూటాకుతో నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడింది. విషయం తెలుసుకున్న తహసీల్దారు స్వప్న అక్కడికి చేరుకుని యంత్రాల సాయంతో అడ్డంకులను తొలగించారు. 50 - 70 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు ప్రజలను అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. కృష్ణపట్నం పోర్టు, ఇతర పరిశ్రమలు, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, వైద్య శాఖలు కలిసి సహాయక చర్యలకు సిద్ధమయ్యాయి.